

# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు



## మీ సేవలు పల్లెలకెళ్లాలి!



- యువ వైద్యులకు రాష్ట్రపతి ముర్ము పిలుపు
- దేశ ఆరోగ్యాభివృద్ధిలో పాలు పంచుకోవాలని సూచన
- ఘనంగా ఎయిమ్స్ తొలి స్నాతకోత్సవం
- ఎయిమ్స్ అభివృద్ధికి మరింత సహకరిస్తా: చంద్రబాబు

3



## ఇప్పుడంతా.. మెడ్‌టెక్ సైన్స్

- సాంకేతికత అనుసంధానిస్తే శ్రేష్ఠమైన వైద్యసేవ
- ఏపీ ఎయిమ్స్.. దేశంలోనే నెంబర్ వన్ కావాలి
- కేంద్ర సాయంతోనే ప్రతిష్టాత్మక సంస్థకు పునాది
- 2019లోనే మౌలిక వసతులతో సేవలందించాం..
- రూ.10కే అందరికీ నాణ్యమైన వైద్యం
- ఎయిమ్స్‌కు మరో పదెకరాల భూమి కేటాయిస్తాం
- మొదటి స్నాతకోత్సవంలో సీఎం చంద్రబాబు హామీ

2



మంగళగిరి చేనేతకు..

## బ్రాండ్ అంబాసిడర్ మంత్రి లోకేష్

- రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు మంగళగిరి శాలువా బహూకరణ
- మంత్రి లోకేష్ బాటలోనే భార్య బ్రాహ్మణి, తల్లి భువనేశ్వరి

6



రాష్ట్ర రాజకీయ చిత్రపటాన్ని మార్చేసిన....

## నిప్పుకణం.. యువగళం!

- యువనేత లోకేష్ చారిత్రాత్మక పాదయాత్రకు నేటితో ఏడాది పూర్తి
- 5కోట్ల మంది ప్రజల ఆశలు, ఆకాంక్షలను ప్రతిబింబించిన యువగళం
- నాటి హామీలను నెరవేర్చే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు

>>5లో..



విజయసాయి రెడ్డికి డీఎన్ఏ పరీక్ష చేయించి..

## నా భార్య బిడ్డకు తండ్రెవరో తేల్చండి

6

- దేవాదాయ ఏసీగా పనిచేస్తున్న నా భార్యను లోబర్చుకొని రూ.1500 కోట్ల భూములు కొల్లగొట్టారు
- అన్యాయంగా నన్ను బదిలీ చేయించారు, న్యాయం చేయాలి
- మంత్రి లోకేష్‌కు కళింగిరి శాంతి భర్త మదన్ మోహన్ వినతి

## అధైర్య పడొద్దు...అండగా నిలుస్తా!

- సమస్యలపై వచ్చిన బాధితులకు మంత్రి లోకేష్ సాంత్వన
- 52వ రోజు ప్రజాదర్బార్‌కు బారులు తీరిన జనం
- రాష్ట్రం నలుమూలల నుంచి వినతుల వెల్లువ
- పరిశీలించి న్యాయం చేస్తానని మంత్రి హామీ

7



### బియ్యం దొంగ పేర్ని నాని

- నీతులు చెప్పే నాని బియ్యం కుంభకోణంలో అడ్డంగా బుక్కయ్యాడు
- రూ.90 లక్షల విలువైన బియ్యం బొక్కేసి కుటుంబం సహా పరార్
- నిప్పులు చెరిగిన మంత్రి కొల్లు

13

### పొరపాటు జరిగింది.. క్షమించండి

- పార్టీ ప్రమేయం, నా ప్రమేయం లేదు
- చంద్రబాబు, లోకేష్ నాకు చాలా గౌరవం ఇచ్చారు.. నిలబెట్టుకుంటాను
- వైసీపీ తాను నుండి నన్ను నేను చింపుకుని బయటకు వచ్చేశాను
- మంత్రి కొలుసు పార్థసారథి వివరణ

14

### ఆక్వా రైతులందరికీ విద్యుత్ రాయితీ

- చేప పిల్లల పంపిణీకి చర్యలు
- మత్స్యకారుల ఇంధన రాయితీకి నిధుల మంజూరు
- వచ్చే నెలలో మత్స్యకార భరోసా
- మంత్రి అచ్చెన్నాయుడు

13

### రేషన్ బియ్యం దొంగలను వదిలేది లేదు

- పేర్ని జయసుధ గోదాములో మొత్తం 4840 బస్తాలు మాయం
- మూడు శాఖలతో లోతుగా విచారణ
- తప్పు చేసినవారు తప్పించుకోలేరు
- మంత్రి నాదెండ్ల స్పష్టీకరణ

10

### పర్యాటకానికి మహర్దశ

- పెట్టుబడిదారులకు పూర్తి సహకారం
- పర్యాటక రంగంలో రూ.25 వేల కోట్ల పెట్టుబడులు లక్ష్యం
- పర్యాటక పెట్టుబడిదారుల సదస్సులో మంత్రి దుర్గేష్
- నూతన పర్యాటక పాలసీ ఆవిష్కరణ

11

### పైప్డ్ గ్యాస్ రాజధానిగా అమరావతి

- ప్రతిపాదనలతో ముందుకొచ్చిన ఐఓసీ అధికారులు
- సమ్మతి తెలిపిన సీఎం, సహకరిస్తామని హామీ

11

### వక్ఫ్‌బోర్డు చైర్మన్‌గా అబ్దుల్ అజీజ్

- ఏకగ్రీవంగా ఎన్నుకున్న బోర్డు సభ్యులు

10

### జమిలికి టీడీపీ మద్దతు

- ఎన్నికల ఖర్చు తగ్గే అవకాశం
- లోక్‌సభలో కేంద్ర మంత్రి పెమ్మసాని

9

చైతన్యరథం

# ఇప్పుడంతా.. మెడ్‌టెక్ సైన్స్

- సాంకేతికత అనుసంధానిస్తే శ్రేష్ఠమైన వైద్యసేవ
- ఏపీ ఎయిమ్స్.. దేశంలోనే నెంబర్ వన్ కావాలి
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి ఆకాంక్ష
- కేంద్ర సాయంతోనే ప్రతిష్టాత్మక ఎయిమ్స్‌కు పునాది
- 2019లోనే మౌలిక వసతులతో సేవలందించాం..
- రూ.10కే అందరికీ నాణ్యమైన వైద్యం
- ఎయిమ్స్‌కు మరో పదెకరాల భూమి కేటాయిస్తాం
- మొదటి స్నాతకోత్సవంలో సీఎం చంద్రబాబు హామీ



అమరావతి (చైతన్య రథం): వైద్య శాస్త్రంలో సాంకేతికతను వినియోగించడం ద్వారా అద్భుతాలు సాధించవచ్చని, టెక్నాలజీ ద్వారా రోగుల చెంతకే వైద్య సేవలు అందించడం సాధ్యమవుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. మెడికల్ సైన్స్ ఇప్పుడు మెడ్‌టెక్ సైన్స్ అయ్యిందన్నారు. డీప్‌టెక్‌వంటి నూతన సాంకేతిక పరిజ్ఞానంపై వైద్య విద్యార్థులు పట్టు సాధించాలని, తప్పనిసరి పరిస్థితుల్లో తప్ప రోగులు ఆస్పత్రులకు రావాల్సిన అవసరం లేకుండా వైద్య చికిత్స అందించేలా వైద్యరంగాన్ని సాంకేతిక పరిజ్ఞానంతో తీర్చిదిద్దాలని సూచించారు. మంగళగిరి ఎయిమ్స్‌లో మంగళవారం జరిగిన మొదటి స్నాతకోత్సవానికి హాజరైన ముఖ్యమంత్రి.. కార్యక్రమానికి హాజరుకావడం తనకు సంతోషంగా ఉందన్నారు. స్నాతకోత్సవానికి హాజరైన వైద్య విద్యార్థులు అందరికీ ముందుగా అభినందనలు తెలిపారు.

## రాష్ట్రపతి ముర్ము అందరికీ స్ఫూర్తి

ఒడిశాలోని మారుమూల గ్రామంలో గిరిజన కుటుంబం నుంచి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వచ్చారని, రాష్ట్రపతి స్థాయికి ఎదగడం అందరికీ స్ఫూర్తిదాయకమని ముఖ్యమంత్రి కొనియాడారు. ఉపాధ్యాయురాలిగా ప్రస్థానాన్ని మొదలుపెట్టిన ఆమె ప్రొఫెసర్‌గా, జూనియర్ అసిస్టెంట్‌గా, కౌన్సిలర్‌గా, చైర్‌పర్సన్‌గా, ఎమ్మెల్యేగా, రాష్ట్రమంత్రిగా, గవర్నర్‌గా.. ఇలా పలు బాధ్యతలు నిర్వర్తించారని.. దేశానికి ప్రథమ పౌరురాలు అయ్యారని.. అంతే పట్టుదలగా కష్టపడితే ఎవరైనా ఉన్నత స్థానానికి చేరుకోవచ్చని రాష్ట్రపతి నిరూపించారని ముఖ్యమంత్రి అన్నారు.

## ఎయిమ్స్‌కు సంపూర్ణ సహకారం

మంగళగిరి ఎయిమ్స్‌కు దేశంలో మరే ఎయిమ్స్‌కు లేనట్టుగా 183 ఎకరాల భూమి ఇచ్చామని, అదీ అత్యుత్తమ ప్రాంతాన్ని ఎంపికచేసి కేటాయించామని సీఎం గుర్తు చేశారు. భవిష్యత్ అవసరాల కోసం మరింత భూమిని ఇవ్వాల్సిందిగా ఇటీవల ఎయిమ్స్ అధికారవర్గాలు తనను కోరాయని, త్వరలోనే మరో 10 ఎకరాలు ఎయిమ్స్‌కు కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నామని ముఖ్యమంత్రి ప్రకటించారు. 2018లో తమ ప్రభుత్వ హయాంలోనే ఎయిమ్స్‌కు శంకుస్థాపన చేశామని, 960 బెడ్లతో రూ.1618 కోట్లతో దీనిని నిర్మించారని.. తొమ్మిదేళ్లలో మంచి గుర్తింపు సాధించడం ఆనందదాయకమని అన్నారు. ఎయిమ్స్‌కు అప్రోచ్ రోడ్లు, జాతీయ రహదారితో అనుసంధానం, విద్యుత్ సరఫరా, నీటి సరఫరావంటి మౌలిక సదుపాయాలు రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందని, భవిష్యత్‌లో మరింతగా సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని ముఖ్యమంత్రి అన్నారు. మంగళగిరి ఎయిమ్స్‌లో రోగులకు రూ.10కే వైద్య సేవలు అందించడాన్ని ఆయన అభినందించారు.

మంగళగిరి ఎయిమ్స్ ప్రస్తుతం ర్యాకింగ్‌లో దేశంలో 8వ స్థానంలో ఉందని, త్వరలోనే మొదటి స్థానంలో ఉండాలనేది ఆకాంక్షగా చెప్పారు.

ఎయిమ్స్, ఐఐటీ, ఐఐఎం, గిరిజన విశ్వవిద్యాలయం, సెంట్రల్ యూనివర్సిటీ సహా పలు కేంద్ర విద్యా సంస్థలను కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో ఏర్పాటు చేసినందుకు ప్రధాని నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి కృతజ్ఞతలు తెలిపారు. అమరావతి నగరాన్ని వచ్చే మూడేళ్లలో దాదాపు రూ.50 వేల కోట్లు ఖర్చుచేసి అత్యద్భుతంగా నిర్మిస్తామని చెప్పారు.

## రాష్ట్రపతికి సాదర స్వాగతం

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మంగళవారం ఉదయం గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్నారు. గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆమెకు ఘనస్వాగతం పలికారు. విమానాశ్రయంలో పోలీసు గౌరవవందనం స్వీకరించిన అనంతరం రోడ్డు మార్గంలో మంగళగిరి ఎయిమ్స్‌కు రాష్ట్రపతి బయలుదేరి వెళ్లారు. మంగళగిరిలోని అఖిల భారత వైద్య విద్యా సంస్థ (ఎయిమ్స్) స్నాతకోత్సవంలో రాష్ట్రపతి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.









తన



చైతన్యరథం



# మీ సేవలు పల్లెలకెళ్లాలి!

- యువ వైద్యులకు రాష్ట్రపతి ముర్ము పిలుపు
- దేశ ఆరోగ్యాభివృద్ధిలో పాలు పంచుకోవాలని సూచన
- ఘనంగా ఎయిమ్స్ తొలి స్నాతకోత్సవం
- ఎయిమ్స్ అభివృద్ధికి మరింత సహకరిస్తా: చంద్రబాబు



మంగళగిరి (చైతన్య రథం): యువ వైద్యులు గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో వైద్య సేవలందించాలని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సూచించారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఎయిమ్స్ తొలి స్నాతకోత్సవానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రత్యేక విమానంలో గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్న ముర్ముకు గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సహా పలువురు స్వాగతం పలికారు. అనంతరం ఎయిమ్స్‌కు చేరుకున్న రాష్ట్రపతి.. మొదటి బ్యాచ్‌గా వైద్య విద్య పూర్తి చేసుకున్న 49మంది ఎంబీబీఎస్ విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు.

"వైద్య వృత్తిని ఎంచుకోవడం ద్వారా విద్యార్థులు మానవత్వంతో సేవ చేసే దారిని ఎంచుకున్నారు. ప్రజల ప్రాణాలు కాపాడి.. వారి ఆరోగ్యం మెరుగుపరిచే అమూల్యమైన అవకాశం మీకు వస్తుంది. మీలాంటి యువ వైద్యులు.. గ్రామీణ, గిరిజన, మారుమూల ప్రాంత ప్రజలకు సేవ చేసేందుకు ప్రాధాన్యమివ్వాలి. జాతి సమ్మిళిత ఆరోగ్య సంరక్షణలో ప్రత్యేకించి మీలాంటి యువ వైద్యులు కీలక పాత్ర పోషించాలి. ఈ దశలో మీరు చిత్తశుద్ధితో పనిచేసి.. దేశ ఆరోగ్యాభివృద్ధిలో పాలుపంచుకుంటారని ఆశిస్తున్నా" అని రాష్ట్రపతి పిలుపునిచ్చారు. ఆనందోత్సాహాల మధ్య సాగిన స్నాతకోత్సవంలో గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్, కేంద్ర ఆరోగ్య సహాయమంత్రి ప్రతాపరావు జాదవ్, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రాష్ట్ర ఆరోగ్యమంత్రి సత్యకుమార్ యాదవ్, మానవ వనరుల అభివృద్ధి, ఐటీ మంత్రి నారా లోకేశ్ గౌరవ అతిథులుగా హాజరయ్యారు.

తొలుత భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము.. అధ్యాపకులు మరియు బంగారు పతక విజేతలతో గ్రూప్ ఫోటో సెషన్‌లో పాల్గొన్నారు. అనంతరం ఆడిటోరియం వద్ద అధ్యాపకులు మరియు స్నాతకోత్సవ విద్యార్థులతో జరిగిన అకాడమిక్ కార్యక్రమానికి హాజరయ్యారు. కేంద్ర ఆయుష్ సహాయ మంత్రి ప్రతాపరావు జాదవ్ స్నాతకోత్సవానికి అధ్యక్షత వహిస్తూ స్వాగతోపన్యాసం చేశారు. ఎయిమ్స్ డైరెక్టర్ డా. ప్రొఫెసర్ మధబానంద కర్.. మంగళగిరి ఎయిమ్స్ పురోగతి నివేదికను సమర్పించారు. ఈ సందర్భంలో అవార్డు గ్రహీత విద్యార్థులకు రాష్ట్రపతి ముర్ము బంగారు పతకాలు బహూకరించారు. కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. వైద్య సేవలలో శ్రేష్ఠత సాధించడానికి సాంకేతికత అవసరాన్ని నొక్కి చెప్పారు. ఎయిమ్స్ మంగళగిరి అభివృద్ధికి తనవంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తానని హామీ ఇచ్చారు. ముఖ్య అతిథిగా ద్రౌపతి ముర్ము స్నాతకోపన్యాసం చేస్తూ.. డిగ్రీలు అందుకున్న యువ వైద్యులందరికీ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. గ్రాడ్యుయేట్‌లలో మూడింట రెండొంతులమంది మహిళా వైద్యులే ఉన్నారని, వైద్య వృత్తిలో పెరుగుతున్న మహిళల భాగస్వామ్యం., వారి గణనీయమైన సహకారంతో అభివృద్ధి చెందిన సమాజాన్ని నిరూపిస్తోందని నొక్కి చెప్పారు. అనంతరం ముఖ్య అతిథి ద్రౌపది ముర్ము, గౌరవ అతిథులను ఎయిమ్స్ విభాగం ఘనంగా సత్కరించింది. కేంద్ర ఆరోగ్య సహాయ మంత్రి ప్రతాప్రావు జాదవ్, ఏపీ వైద్య మంత్రి సత్యకుమార్ యాదవ్ 49మంది విద్యార్థులకు మరియు పోస్ట్ డాక్టోరల్ సర్టిఫికేట్ కోర్సు విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేశారు. ఎయిమ్స్ మంగళగిరి- సెంటర్ ఫర్ మెడికల్ ఎడ్యుకేషన్ టెక్నాలజీ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అకడమిక్స్ డీన్ కుమార్ దాష్ స్నాతకోత్సవ ఆహూతులకు కృతజ్ఞతలు తెలిపారు. పోలీస్ బ్యాండ్ జాతీయ గీతంతో స్నాతకోత్సవం ముగిసింది. కార్యక్రమంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, ఎయిమ్స్ కార్యవర్గ సభ్యులు, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది గ్రాడ్యుయేషన్ విద్యార్థుల తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొన్నారు.


















# రాష్ట్రపతికి ఘనంగా వీడ్కోలు

విజయవాడ (చైతన్యరథం): గుంటూరు జిల్లా మంగళగిరి ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) స్నాతకోత్సవంలో పాల్గొని మంగళవారం సాయంత్రం తిరుగుప్రయాణమైన భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఘనంగా వీడ్కోలు పలికారు. భారత వాయుసేన ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌లోని హకీంపేట ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌కు రాష్ట్రపతి బయలుదేరి వెళ్లారు. రాష్ట్రపతికి వీడ్కోలు పలికిన వారిలో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, రాష్ట్ర గిరిజన సంక్షేమ, ఐసిడిఎస్ శాఖ ల మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, గన్నవరం శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్, డీజీపీ సిహెచ్ ద్వారకా తిరుమలరావు, కమాండింగ్ ఆఫీసర్ 22 ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ లెఫ్టినెంట్ కల్నల్ జే. మహేష్, కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ ఆర్ గంగాధర్ రావు, తదితరులు ఉన్నారు.



## రాష్ట్ర రాజకీయ చిత్రపటాన్ని మార్చేసిన...

# నిప్పుకణం... యువగళం!

- యువనేత లోకేష్ చారిత్రాత్మక పాదయాత్రకు నేటితో ఏడాది పూర్తి!
- 5 కోట్ల మంది ప్రజల ఆశలు, ఆకాంక్షలను ప్రతిబింబించిన యువగళం
- నాటి హామీలను నెరవేర్చే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు



రాష్ట్రంలోని ఐదుకోట్ల మంది ప్రజల ఆశలు, ఆకాంక్షలకు ప్రతిరూపంగా నిలచి ఐదేళ్ల జగన్మోహన్ రెడ్డి చీకటిపాలనను కూకటివేళ్లతో పెకలించిన యువనేత నారా లోకేష్ చారిత్రాత్మక యువగళం పాదయాత్రకు నేటితో ఏడాది పూర్తయింది. నాటి అరాచక పాలనను అంతమొందించడమే లక్ష్యంగా ఇంటింటై వటుడింతై అన్న చందంగా పల్లెలు, పట్టణాలను ఏకం చేస్తూ సాగిన యువగళం పాదయాత్ర... ప్రజల్లో చైతన్యాన్ని రగిల్చి రాష్ట్ర రాజకీయ చిత్రపటాన్ని సమూలంగా మార్చేసింది. 2023 జనవరి 27న కుప్పం శ్రీ వరదరాజ స్వామి పాదాల చెంత ప్రారంభమైన యువగళం పాదయాత్ర గత ఏడాది డిసెంబర్ 18వ తేదీన గాజువాక నియోజకవర్గం అగనంపూడి టోల్ ప్లాజా సమీపంలో దిగ్విజయంగా ముగిసింది. తండ్రి చంద్రబాబునాయుడు వస్తున్నా మీ కోసం పాదయాత్రను ముగించిన చోటే యువనేత లోకేష్ యువగళం పాదయాత్రను ముగించారు. రాష్ట్రంలోని 97 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని 2200 గ్రామాలను స్పృశిస్తూ 226 రోజులపాటు 3,132 కి.మీల మేర సాగిన యువగళం పాదయాత్ర జగన్మోహన్ రెడ్డి అప్రజాస్వామిక పాలనను కూకటివేళ్లతో పెకలించింది. అడుగడుగునా ప్రతిబంధకాల నడుమ నాటి పాలకుల కుట్రలు, కుతంత్రాలను ఛేదిస్తూ చారిత్రాత్మక యువగళం పాదయాత్ర విజయవంతమైంది.

### యువగళం గొంతునొక్కేందుకు జగన్ కుట్ర

జగన్మోహన్ రెడ్డి పాలనలో బాధితులుగా మారిన ప్రజలకు నేనున్నానని భరోసా ఇస్తూ యువనేత నారా లోకేష్ యువగళం పాదయాత్ర సాగింది. చంద్రబాబునాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గం నుంచి ప్రారంభమైన యువగళం పాదయాత్రను అడ్డుకునేందుకు నాటి వైసిపి ప్రభుత్వం చేయని ప్రయత్నం లేదు. జీఓ 1 పేరుతో నల్లచట్టాన్ని తచ్చి యువనేత నారా లోకేష్ గొంతునొక్కడానికి నాటి ప్రభుత్వం విఫలయత్నం చేసింది. పోలీసుసైన్యంతో పాదయాత్రను అడుగడుగునా అడ్డుకుంటూ అవరోధాలు సృష్టించింది. మాట్లాడే మైకు నుంచి నిలబడే స్టూలు వరకు అన్నీ లాగేసి యువనేత గొంతునొక్కాలని చూశారు. యువగళాన్ని సజావుగా సాగనిస్తే పాదయాత్ర... లేదంటే దండయాత్రగా మారుతుందని లోకేష్ బెబ్బులిలా గర్జించారు. యువనేత లోకేష్ చేసిన యాత్ర చిత్తూరు జిల్లాలో పూర్తయ్యేలోపు తొలి 45రోజుల్లో రోజుమార్చి రోజుకొక కేసు చొప్పున 25 తప్పుడు కేసులు బనాయించారు. బాణాసంచా కాల్చారంటూ పీలేరు ఇన్‌చార్జి కిషోర్ కుమార్ రెడ్డి, కలికిరి సర్పంచ్ ప్రతాప్ కుమార్ రెడ్డి, మరికొందరిపై పోలీసులు కేసులు నమోదుచేశారు. చివరకు పాదయాత్రలో టపాసులు కాల్చారని కూడా కేసులు బనాయించారంటే యువగళం యాత్రను చూసి నాటి ప్రభుత్వం ఎంతలా ఆందోళన చెందిందో అర్థంచేసుకోవచ్చు.

### ఎమ్మెల్సీ ఎన్నికల్లో సత్తాచాటిన యువగళం

యువగళం పాదయాత్ర యువనేత లోకేష్ ఒక్కడి గొంతుక కాదు...5కోట్ల ప్రజల అంతరంగాన్ని ప్రతిబింబించే సింహగర్జన అని తెలుసుకోవడానికి నాటి పాలకులకు ఎక్కువ సమయం పట్టలేదు. పాదయాత్ర చిత్తూరు జిల్లా దాటే లోగా రాష్ట్రంలోని 107 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మూడు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్యే స్థానాలకు జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు ఘన విజయం సాధించారు. ఆ ఎన్నికల్లో గెలుపొందేందుకు జగన్ ప్రభుత్వం వందల కోట్లు మంచినీళ్లలా ఖర్చుచేసి అధికార బలగాలను దుర్వినియోగం చేసిన యావత్తు యువత తెలుగుదేశం పార్టీకే అండగా నిలిచారు. పాదయాత్రను అడ్డుకునేందుకు కృష్ణాజిల్లా నుంచి కవ్వింపు చర్యలకు దిగిన వైసిపి మూకలు... భీమవరంలో పాదయాత్రపై విరుచుకుపడ్డాయి. యువగళం వాలంటీర్లపై తప్పుడు కేసులు బనాయించారు. చంద్రబాబునాయుడు అరెస్టైన రోజునే 59మంది యువగళం వాలంటీర్లను నిర్బంధించి రాజమండ్రి జైలులో పెట్టారు. అక్రమ కేసులతో చంద్రబాబునాయుడును అరెస్టు చేసిన నేపథ్యంలో సెప్టెంబర్ 9వ తేదీన రాజోలు నియోజకవర్గం పొదలాడ వద్ద పాదయాత్రను తాత్కాలికంగా నిలిపివేయాల్సి వచ్చింది. గత ఏడాది నవంబర్ 26వ తేదీన పునఃప్రారంభమైన యువగళం పాదయాత్రను... ఎన్నికల క్రతువు ముంచుకొని రావడంతో అనివార్యంగా గాజువాక నియోజకవర్గంలో అర్థంతరంగా ముగించాల్సి వచ్చింది.

### హామీల అమలుదిశగా ప్రజాప్రభుత్వం అడుగులు

సుదీర్ఘ యువగళం పాదయాత్రలో యువత, మహిళలు, వృద్ధులు, విద్యార్థులు, ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీల ఆకాంక్షలకు అనుగుణంగా యువనేత నారా లోకేష్ అనేక హామీలను ఇచ్చారు. ముఖ్యంగా సీమ ప్రజల కోసం కడపలో రాయలసీమ డిక్లరేషన్‌ను ప్రకటించారు. యువనేత లోకేష్ పాదయాత్రలో ఇచ్చిన హామీలను ప్రతిబింబిస్తూ ఎన్‌డిఎ కూటమి సూపర్ సిక్స్ పేరుతో మ్యానిఫెస్టో ప్రకటించింది. పాదయాత్రలో యువనేత నారా లోకేష్ ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా ప్రజాప్రభుత్వం అడుగులు వేస్తోంది. కొత్తప్రభుత్వం కొలువుదీరిన తొలిరోజునే మెగా డిఎస్సీ ఫైలుపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తొలి సంతకం చేశారు. అధికారంలోకి వచ్చాక యువతకు ఐదేళ్లలో 20లక్షల ఉద్యోగాలు కల్పిస్తానని యువనేత లోకేష్ ఇచ్చిన హామీ అమలుకు ప్రణాళికాబద్ధమైన కృషి జరుగుతోంది. ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి ఆరునెలల్లోనే రూ.4.6లక్షల కోట్ల పెట్టుబడులు, 4లక్షలమందికి పైగా ఉద్యోగాలు కల్పించేందుకు ప్రముఖ కంపెనీలతో ఒప్పందాలు జరిగాయి. మంత్రి నారా లోకేష్ అవిశ్రాంత కృషితో ఆర్సెలర్ మిట్టల్ అండ్ నిప్పాన్ స్టీల్స్, గూగుల్, టిసిఎస్, వీడియోకాన్ వంటి కంపెనీలు రాష్ట్రానికి క్యూ కట్టాయి. యువగళం పాదయాత్రలో తాను ఇచ్చిన హామీల అమలుకు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసిన యువనేత లోకేష్... ఇందుకోసం ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటుచేశారు. పోలీసు వలయాలు, పరదాల మాటున కాకుండా అనుక్షణం ప్రజల్లో ఉంటూ వారి కష్టసుఖాల్లో పాలుపంచుకునే వాడే ప్రజానాయకుడని ఆచరణాత్మకంగా నిరూపిస్తున్న యువకెరటం నారా లోకేష్ నేటితరం రాజకీయ నాయకులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

- కందిమళ్ల కృష్ణారావు



# మంగళగిరి చేనేతకు..

# బ్రాండ్ అంబాసిడర్ మంత్రి లోకేష్













- రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు మంగళగిరి శాలువా బహూకరణ
- మంత్రి లోకేష్ బాటలోనే భార్య బ్రాహ్మణి, తల్లి భువనేశ్వరి

అమరావతి (చైతన్యరథం): మంగళగిరి చేనేతలంటే ఆయనకు వల్లమాలిన అభిమానం.. చేనేతలు తమ ఆత్మబంధువులని చెప్పే మంత్రి నారా లోకేష్ కేవలం మాటలకు మాత్రమే పరిమితం కాకుండా ఆచరణలో కూడా అభిమానాన్ని చూపుతుంటారు. ఒక్కమాటలో చెప్పాలంటే మంగళగిరి చేనేతలకు మంత్రి నారా లోకేష్‌తోపాటు ఆయన భార్య బ్రాహ్మణి, తల్లి భువనేశ్వరి అనధికార బ్రాండ్ అంబాసిడర్లుగా మారారు. అవకాశం వచ్చిన ప్రతిసారీ మంగళగిరి చేనేత వస్త్రాలను ప్రమోట్ చేస్తున్నారు. తాజాగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఎయిమ్స్‌లో మంగళవారం జరిగిన కాన్వొకేషన్ కార్యక్రమానికి విచ్చేశారు. ఈ సందర్భంగా మంగళగిరి చేనేతలు నేసిన శాలువాను ఆమెకు మంత్రి బహూకరించారు. గతంలో ప్రధాని నరేంద్ర మోడీ, ఇతర ప్రముఖులను కలిసినపుడు కూడా మంగళగిరి శాలువాలతోనే వారిని మంత్రి లోకేష్ సత్కరించారు. లోకేష్ భార్య బ్రాహ్మణి, తల్లి భువనేశ్వరి మంగళగిరి చీరలను ధరిస్తూ వాటి ప్రాశస్త్యాన్ని ప్రమోట్ చేస్తూ వస్తున్నారు. ఇదిలావుండగా ప్రతిపక్షంలో ఉండగానే మంత్రి లోకేష్ మంగళగిరిలో వీవర్స్ శాలను ఏర్పాటు చేసి, ఇక్కడి చేనేతలు తయారుచేసిన వస్త్రాల మార్కెటింగ్ కోసం టాటా టనేరియాతో అనుసంధాన వ్యవస్థను ఏర్పాటు చేశారు. పతనావస్థకు చేరుతున్న మంగళగిరి చేనేతను పునరుజ్జీవింప జేసేందుకు మంత్రి లోకేష్ చేస్తున్న కృషికి మంగళగిరిలోని చేనేతలు మురిసిపోతున్నారు.

## విజయసాయి రెడ్డికి డీఎన్ఏ పరీక్ష చేయించి...

# నా భార్య బిడ్డకు తండ్రెవరో తేల్చండి

- దేవాదాయ ఏసీగా పనిచేస్తున్న నా భార్యను లోబర్చుకొని రూ.1500 కోట్ల భూములు కొల్లగొట్టారు
- విజయసాయి రెడ్డిపై పోరాడుతున్నందుకు నన్ను బదిలీ చేయించారు
- నాకు న్యాయం చేయాలి
- మంత్రి నారా లోకేష్‌కు కళింగిరి శాంతి భర్త మదన్ మోహన్ వినతి




అమరావతి (చైతన్యరథం): వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి తన భార్యను లోబర్చుకొని విశాఖపట్నంలో రూ.1500 కోట్ల విలువైన భూములు కొల్లగొట్టారని, ఆయన అక్రమాలు, అసాంఘిక కార్యకలాపాలపై పోరాడుతున్నందుకు తనను ఇటీవల హైదరాబాద్ నుంచి కోల్‌కతాకు బదిలీ చేయించారని సస్పెన్షన్‌కు గురైన దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ కళింగిరి శాంతి భర్త మదన్ మోహన్ ఆవేదన వ్యక్తంచేశారు. ఉండవల్లి నివాసంలో మంగళవారం ప్రజాదర్బార్‌కు విచ్చేసిన మదన్ మోహన్... మంత్రి లోకేష్‌ను కలిసి తన గోడును వెళ్లబోసుకున్నారు.

తాను ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్యాకింగ్ (ఐఐపి)లో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నానని, ఎంపీ విజయసాయి రెడ్డి, అడ్వకేట్ సుభాష్ కలసి తన భార్య కళింగిరి శాంతిని లోబర్చుకొని విశాఖలో ఆర్కే బీచ్ నుంచి భీమిలి వరకు పెద్దఎత్తున భూములు కొల్లగొట్టారని మదన్ మోహన్ పేర్కొన్నారు.

2022-23 నడుమ తనను ఏమార్చి అమెరికా పంపిన విజయసాయి.. తన భార్య శాంతితో రహస్యంగా సహజీవనం చేసి మగబిడ్డను కన్నారని తెలిపారు. తాను స్థానికంగా లేని సమయంలో జన్మించిన బిడ్డకు విజయసాయిరెడ్డే తండ్రి అని తాను గట్టిగా విశ్వసిస్తున్నానని చెప్పారు. తనకు న్యాయం చేయాల్సిందిగా రాష్ట్రపతి, ప్రధాని కార్యాలయాలతో పాటు రాష్ట్ర హెూంమంత్రిని, డీజీపీలను కలిసి విన్నవించుకున్నా ఇప్పటివరకు తనకు న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. విజయసాయిరెడ్డికి డీఎన్ఏ పరీక్షలు నిర్వహించి శాంతికి కలిగిన బిడ్డకు తండ్రి ఎవరో తేల్చాలని మంత్రి లోకేష్‌ను మదన్ మోహన్ కోరారు. గత ప్రభుత్వ హయాంలో శాంతి దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేసిన కాలంలో రూ.20 కోట్లకు పైగా అక్రమాస్తులు సంపాదించినట్లు తెలిపారు. కుంచనపల్లిలో రూ.4కోట్ల విలువైన విల్లా, జగన్ ఇంటి సమీపంలో రూ.3కోట్ల విలువైన ఇల్లు, విశాఖ సాగర్ నగర్లో ట్రిపుల్ బెడ్ రూమ్ ఫ్లాట్ తోపాటు ఆమెకు విలాసవంతమైన కార్లు కూడా ఉన్నాయని పేర్కొన్నారు. విశాఖలో విజయసాయి, సుభాష్, తన భార్య శాంతి కలిసి కొట్టేసిన రూ.1500 కోట్ల విలువైన భూములపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, విజయసాయి కుట్రతో కోల్‌కతా బదిలీ అయిన తనను తిరిగి హైదరాబాద్‌కు ట్రాన్స్‌ఫర్ చేయించాలని మదన్ మోహన్ విన్నవించారు. ఉన్నతాధికారులతో మాట్లాడి న్యాయం చేస్తామని మంత్రి లోకేష్ హామీ ఇచ్చారు.

చైతన్యరథం

# అధైర్య పడొద్దు... అండగా నిలుస్తా!

- సమస్యలపై వచ్చిన బాధితులకు మంత్రి లోకేష్ సాంత్వన
- 52వ రోజు ప్రజాదర్బార్‌కు బారులు తీరిన జనం
- రాష్ట్రం నలుమూలల నుంచి వినతుల వెల్లువ
- పరిశీలించి న్యాయం చేస్తానని మంత్రి హామీ




అమరావతి (చైతన్యరథం): భూ సమస్యలతో కొందరు, అనారోగ్యంతో ఇంకొందరు, పథకాలు ఇప్పించాలని మరికొందరు... ఇలా సమస్యల సుడిగుండంలో చిక్కుకున్న ప్రజలకు ఆశాకిరణంలా కన్పిస్తున్నారు మంత్రి నారా లోకేష్. రాష్ట్రవ్యాప్తంగా తరలివస్తున్న బాధిత ప్రజలకు నేనున్నానని భరోసా ఇస్తున్నారు యువనేత లోకేష్. ఉండవల్లి నివాసంలో 52వ రోజు మంగళవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌కు వినతులు వెల్లువెత్తాయి. రాష్ట్రం నలుమూలల నుంచి భారీఎత్తున తరలివచ్చిన బాధిత ప్రజలకు అండగా ఉంటానంటూ లోకేష్ సాంత్వన కల్పించారు. తనను కలుస్తున్న వారిలో భూ బాధితులే అధికంగా ఉంటుండటంతో రెవిన్యూ, పోలీసు అధికారులు సమన్వయంతో పనిచేసి సమస్యలకు పరిష్కారం చూపాలని మంత్రి లోకేష్ ఆదేశించారు. బాధితులు మళ్లీమళ్లీ తనను కలవకుండా సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని లోకేష్ సూచించారు.

## జాతీయ రహదారి అలైన్‌మెంట్ మార్చాలి

నరసరావుపేట సమీపంలో ప్రతిపాదించిన జాతీయ రహదారి ఎలైన్‌మెంట్ మార్పుచేయాలంటూ ప్రభావిత ప్రజలు ఎమ్మెల్యే అరవిందబాబుతో కలసివచ్చి లోకేష్‌కు వినతిపత్రం సమర్పించారు. చీరాల ఓడరేవు నుంచి నకరికల్లు వరకు 167-ఎ 4లైన్ల జాతీయ రహదారిని ఎన్‌హెచ్‌ఎఐ అధికారులు 2022లో ప్రతిపాదించారు. ఇందులో అంతర్భాగంగా ఉన్న నరసరావుపేట బైపాస్ నిర్మాణానికి 3 ఆప్షన్లు ఇచ్చారు. ఇందులో నరసరావుపేట దక్షిణం వైపు బైపాస్‌కు ప్రతిపాదించిన ఆప్షన్ -3 వల్ల 5 గ్రామాల ప్రజలు, రైతులు పెద్దఎత్తున నష్టపోవాల్సి వస్తుంది. రైతులకు తక్కువ నష్టం కలిగించే ఆప్షన్ -2ను అమలు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు ఎమ్మెల్యే అరవిందబాబు నేతృత్వంలో మంత్రి లోకేష్ ను కలిసి విన్నవించారు.

కరోనా సమయంలో తన బిడ్డ వైద్యం కోసం కుదువపెట్టిన బంగారాన్ని తిరిగి ఇవ్వకుండా మేనమామ వేధిస్తున్నారని ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట నియోజకవర్గం తోటచర్లకు చెందిన గుమ్మడివెల్లి పద్మావతి ఆవేదన వ్యక్తం చేసింది. కరోనా సమయంలో నా బిడ్డ వైద్యం కోసం 120 గ్రాముల బంగారాన్ని కుదువపెట్టి మేనమామ వెంకటేశ్వరరావు వద్ద రూ.3 లక్షలు అప్పు తెచ్చాం. వైద్యం చేయించినా మా బిడ్డ బతకలేదు. అంతకు ముందు 2019 ఎన్నికల సమయంలో మా రెండో బిడ్డ యాక్సిడెంట్‌లో చనిపోయాడు. ఇద్దరు బిడ్డలను పోగొట్టుకొని కడుపుకోతతో ఉన్న మేము అప్పుగా తీసుకున్న రూ.3 లక్షలు ఇస్తామని చెబుతున్నా బంగారం ఇవ్వడం లేదు. దీనిపై డీఎస్పీ నుంచి ఎస్ఐ వరకు పలుమార్లు కలిసినా న్యాయం జరగలేదు. తమ కుటుంబానికి న్యాయం చేయాల్సిందిగా మంత్రి లోకేష్‌ని కోరుతూ పద్మావతి కన్నీళ్ల పర్యంతమైంది.

పుట్టుకతో తీవ్ర అనారోగ్యంతో జన్మించిన తమ బిడ్డకు ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని కడప జిల్లా బద్వేలుకు చెందిన ఎల్.కొండమ్మ విన్నవించింది. ఒళ్లంతా పొక్కులతో కొలేడన్ బేబీగా జన్మించిన బిడ్డకు తమిళనాడులోని కంచి కామకోటి హాస్పటల్‌లో రూ.15లక్షలు ఖర్చుచేసినా ప్రయోజనం కలగలేదు. కలెక్టర్‌కు రెండుసార్లు విన్నవిస్తే కడప రిమ్స్‌కు రాశారు. అక్కడ కూడా సరైన మందులు ఇవ్వడం లేదు. ప్రైవేటుగా మందులు కొనుగోలు చేస్తే ప్రతినెలా రూ.10వేలు ఖర్చవుతోంది. రెక్కాడితే గానీ డొక్కాడని తమకు పెన్షన్, ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని పద్మావతి వేడుకుంది.

ఏడాది క్రితం జరిగిన యాక్సిడెంట్‌లో కోమాలోకి వెళ్లిన తమ బిడ్డకు ఆర్థిక సాయం అందించాలని కడప జిల్లా మైదుకూరు నియోజకవర్గం చాపాడు మండలం పల్లవోలుకు చెందిన మింగాల అశోక్ తండ్రి శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు. యాక్సిడెంట్ తర్వాత కోమాలోకి వెళ్లిన బిడ్డ వైద్యానికి రూ.18 లక్షలు ఖర్చయినా ప్రయోజనం లేదు. ఇప్పటికీ వీల్ చైర్‌కే పరిమితమయ్యాడు. లారీకి వెళ్లి కుటుంబాన్ని పోషించే తాను కూడా పక్షవాతానికి గురయ్యానని, దీంతో బతుకు బండి లాగడం భారంగా మారిందని చెబుతూ ఆదుకోవాలని విన్నవించారు.

వైసీపీ నేతల అండతో ఓ వ్యక్తి విశాఖలోని తమ స్థలాన్ని ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని గుంటూరు జిల్లా తెనాలి నియోజకవర్గం మోపర్రుకు చెందిన కృష్ణప్రసాద్ ఆందోళన వ్యక్తం చేశారు. విశాఖ మాధవధారలోని సర్వే నెం.13/3లో 1991లో నేను 342 గజాల స్థలాన్ని కొనుగోలు చేశాను. ఆ ప్రాంతానికి చెందిన సనపల సీతారాం అనే వ్యక్తి వైసీపీ నేతల అండతో తమను బెదిరిస్తూ సర్వే నెంబర్‌లోని ఏడు ఎకరాల భూమి ఆయనదేనని అంటున్నాడు. తనతోపాటు మరో నలుగుర్ని కూడా స్థలంలోకి అడుగుపెట్టనీయడం లేదు, న్యాయం చేయాలని కృష్ణప్రసాద్ కోరారు.

అంగన్ వాడీ భవన నిర్మాణాలకు సంబంధించి బిల్లులు చెల్లించి ఆదుకోవాలని గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలం గారపాడుకు చెందిన మేస్త్రి గుంజి వెంకటేశ్వర్లు వినతిపత్రం సమర్పించారు. 2018లో ముట్లూరులో 2 భవనాలు, గారపాడులో ఒక అంగన్ వాడీ భవనం నిర్మించాం. ఇందుకోసం రూ.30 లక్షలు వెచ్చిస్తే గత టీడీపీ ప్రభుత్వంలో రూ.11 లక్షలు ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఐదేళ్లు తిప్పించుకొని రూ.4 లక్షలు ఇచ్చారు. వైసీపీ రంగులు వేయడానికి మరో రూ.6 లక్షలు ఖర్చుచేయించారు. చెప్పులరిగేలా కలెక్టర్ చుట్టూ తిరిగినా ఉపయోగం లేదు. అప్పుల పాలైన తనకు బిల్లులు చెల్లించి ఆదుకోవాలని విన్నవించారు.

కర్నాటకలో మెడిసిన్ చదువుతూ అదృశ్యమైన తమ బిడ్డ ఆచూకీ కనుగొనేందుకు సహకరించాలని చిత్తూరు జిల్లా పలమనేరు నియోజకవర్గం బైరెడ్డిపల్లికి చెందిన సుబ్రహ్మణ్యం శెట్టి విన్నవించారు. కర్నాటక అర్తిబెల్లిలోని ఆక్స్‌ఫర్డ్ మెడికల్ కాలేజీలో నా బిడ్డ సురేష్ బాబు ఎంబీబీఎస్ ఫైనలియర్ చదువుతూ 100రోజుల క్రితం అదృశ్యమయ్యాడు. అక్కడి పోలీసులకు ఫిర్యాదు చేసినా ఇంతవరకు ఆచూకీ తెలియలేదు. కర్నాటక పోలీసులతో మాట్లాడి తమ బిడ్డ ఆచూకీ కనుగొనేందుకు సహకరించాల్సిందిగా కోరారు.

రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన బాధితుల వినతులను స్వీకరించిన మంత్రి లోకేష్ ధైర్యంగా ఉండాలని, సమస్యల పరిష్కారానికి తమవంతు సహకారం అందిస్తానని భరోసా ఇచ్చారు.















## ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్‌కు...

# త్వరలో విధి, విధానాలు

- రెవెన్యూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి
- న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖల మంత్రి ఫరూక్ వెల్లడి
- నెల్లూరు కలెక్టరేట్‌లో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి హెూదాలో పలు శాఖలపై సమీక్ష
- పాల్గొన్న మంత్రులు ఆనం, నారాయణ, ఎమ్మెల్యేలు, అధికారులు



నెల్లూరు(చైతన్యరథం): భూ ఆక్రమణలకు అడ్డుకట్ట వేసేందుకు కూటమి ప్రభుత్వం ల్యాండ్ గ్రాబింగ్ (నిరోధక) చట్టం తీసుకువచ్చిందని, దీనికి సంబంధించిన నియమ నిబంధనలు రూపొందిస్తున్నట్లు నెల్లూరు జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ చెప్పారు. మంగళవారం మధ్యాహ్నం నెల్లూరు కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాలులో జిల్లా మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, పొంగూరు నారాయణ, కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్‌తో కలిసి రెవెన్యూ, ఇరిగేషన్, వ్యవసాయం, డ్వామా, ఆర్అండ్‌బి, పంచాయతీరాజ్ శాఖల పనితీరుపై అధికారులతో మంత్రి ఫరూక్‌సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఫరూక్ మాట్లాడుతూ గత ప్రభుత్వం చేపట్టిన రీసర్వేలో తప్పులు, భూ కబ్జాలతో రైతులు, ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. రైతుల పాస్‌పుస్తకాలు, హద్దురాళ్లపై జగన్ బొమ్మలు వేసి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారన్నారు. సుమారు పది లక్షల కోట్ల రూపాయలకు పైగా అప్పులు మిగిల్చిపోయార న్నారు. ఆ అప్పులకు అసలు, వడ్డీ చెల్లించాల్సి వస్తుందని, వీటిని సరిచేసుకోవడానికే తమకు సమయం సరిపోతోందన్నారు. రెవెన్యూ, భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా తమ ప్రభుత్వం అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందన్నారు. ఈ సదస్సుల్లో వచ్చిన ఫిర్యాదులను జిల్లా స్థాయిలోనే పరిష్కరించాలని కలెక్టర్, జేసీకి సూచించారు. పరిష్కారం కాని సమస్యలను నిర్దిష్ట గడువులోగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలన్నారు. ప్రజల భూములకు రక్షణ లేకుండా గత ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు రద్దు చేసి, ప్రజల భూములకు రక్షణ కల్పిస్తూ ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్‌ను తీసుకొచ్చినట్లు చెప్పారు. గత ఐదేళ్లు దెబ్బతిన్న రోడ్లకు తట్టెడు మట్టి కూడా వేయలేదన్నారు. తమ ప్రభుత్వం ఆర్అండ్‌బి రోడ్లపై గుంతలు లేకుండాచేయడానికి జిల్లాకు రూ.20 కోట్ల నిధులు మంజూరు చేసిందని, సంక్రాంతి లోగా వీటిని పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు.

తెలుగుదేశంపార్టీ కోసం ఎంతగానో కృషి చేసిన స్థానిక నాయకులు అబ్దుల్ అజీజ్‌కు, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డికి ముఖ్యమంత్రి చంద్రబాబు సముచిత పదవులు ఇచ్చారని, అందుకు సీఎంకు ధన్యవాదాలు తెలుపుతున్నట్లు మంత్రి ఫరూక్ చెప్పారు.

### దేవాదాయ భూముల సమస్యకూ పరిష్కారం: మంత్రి ఆనం

దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల్లో దేవాదాయ భూ సమస్యల పరిష్కారానికి కూడా సత్వర చర్యలు చేపట్టాలని సూచించారు. ఉపాధిహామీ నిధుల కేటాయింపు గురించి డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌తో చర్చించామని, ఫిబ్రవరి, మార్చి నెలల్లో ఉపాధిహామీ మిగులు నిధులను అవసరమైన ప్రాంతాలకు కేటాయిస్తామని డిప్యూటీ సీఎం చెప్పినట్లు మంత్రి ఆనం తెలిపారు.

### త్వరలోనే ల్యాండ్ గ్రాబింగ్ చట్టం అమలు: మంత్రి నారాయణ

మున్సిపల్‌శాఖ మంత్రి పొంగూరు నారాయణ మాట్లాడుతూ ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్ కేబినెట్ ఆమోదం పొందిందని, ప్రభుత్వం నియమ నిబంధనలు రూపొందిస్తుందని, త్వరలోనే ఈ చట్టం అమలులోనికి రానున్నట్లు చెప్పారు.

### భూ ఆక్రమణపై చర్యలు: సోమిరెడ్డి

సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధిహామీలో గతంలో జరిగిన పనులు సక్రమంగా జరిగాయో లేదో విచారించి బిల్లులు మంజూరు చేయాలని డ్వామా పీడీకి సూచించారు. తిరుమలమ్మపాలెం, నక్కలవాగుపై కాజ్‌వేలు నిర్మించాలని, జిల్లాలో లోలెవల్ కాజ్‌వేలపై ప్రత్యేక దృష్టిపెట్టి పనులు చేపట్టాలన్నారు. పేదల భూములు ఆక్రమించిన వారికి తగిన గుణపాఠం చెప్పాలని, భూ ఆక్రమణలపై వివరాలతో సహా అధికారులకు ఫిర్యాదు చేశామని, వాటిపై తగిన చర్యలుతీసుకోవాలని కోరారు. రాళ్లపాడు ప్రాజెక్టు సమీక్షలో ముందుగానే గేట్లు ఎందుకు పరిశీలించుకోలేదని ప్రశ్నించారు. కిందిస్థాయిలో ఇరిగేషన్ సిబ్బంది ఏం చేస్తున్నారని నిలదీశారు. గత ఐదేళ్లలో ఇరిగేషన్ శాఖ నిర్లక్ష్యంగా పనిచేయడం వలనే ఈ సమస్యలు వచ్చాయన్నారు.

అటవీశాఖ భూముల గురించి వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ మాట్లాడుతూ భూమి ఒకరి అనుభవంలో వుంటే పాసుపుస్తకాల్లో మరొకరి పేర్లు ఉన్నాయని, ఇలాంటి సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ ఆనంద్ దృష్టికి తీసుకువచ్చారు. ఫారెస్ట్ హక్కుల చట్టం నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ చెప్పారు.

కావలి ఎమ్మెల్యే దగుమాటి కృష్ణారెడ్డి మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల గురించి గ్రామాల్లో దండోరా వేసి ప్రచారం చేయాలని, నోషనల్ ఖాతాల పరిధిని ఆర్డీవో స్థాయికి తీసుకురావాలని కోరారు. సిజెఎఫ్ఎస్ భూములను రద్దు చేసి ప్రభుత్వ భూమిగా మార్చడం వలన రైతులు ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు పొందలేకపోతున్నారని చెప్పారు. ఈ సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. గతంలో టెండర్లు పిలిచిన రోడ్డు పనులకు కాంట్రాక్టర్లకు నోటీసులు ఇచ్చి పనులు చేపట్టేలా చూడాలని ఆర్అండ్‌బి ఎస్ఈని కోరారు. రోడ్ల పక్కన ఉన్న ముళ్ల చెట్లను జంగిల్ క్లియరెన్స్ చేయించాలని, వనసంరక్షణ సమితులను బలోపేతం చేయాలని కోరారు. నరేగా నిధులను నియోజకవర్గాల వారీగా కేటాయించాలని కోరారు.

ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ రాళ్లపాడు ప్రాజెక్టు గేట్లు మరమ్మతులకు గురి కావటంతో పొలాలకు నీరు అందక రైతులు నష్టపోయారని, కేవలం లక్ష రూపాయలు ఖర్చు చేస్తే ఇలాంటి పరిస్థితి వచ్చేది కాదన్నారు. గండిపాలెం రిజర్వాయర్‌ను కూడా ముందుగా పరిశీలించి మరమ్మతులు చేపట్టాలని కోరారు.

జిల్లా కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ రాళ్లపాడు రిజర్వాయర్ నుంచి రైతులకు పూర్తిస్థాయిలో నీటిని అందించడానికి అన్ని చర్యలుచేపట్టామన్నారు. ఇక్కడి రైతులకు 130 క్యూసెక్కులు ఇస్తే చివరి భూములకు కూడా నీరు అందుతాయని, రిజర్వాయర్ నుంచి 80 నుంచి 100 క్యూసెక్కుల నీటిని ఇప్పటికే అందిస్తున్నామని చెప్పారు. బ్యాకమ్ అనే అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం కలిగిన జర్మనీ కంపెనీతో చర్చించి రిజర్వాయర్ గేట్లను తెరిపించేందుకు చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ చెప్పారు. జిల్లాలో ఎక్కడెక్కడ ఇలాంటి సమస్యలు ఉన్నాయో వాటన్నింటిని గుర్తించి సమస్యలులేకుండా చూస్తామన్నారు. సాగునీటి సంఘాల ఎన్నికలను విజయవంతంగా నిర్వహించామని, ప్రాజెక్టు కమిటీలకు కూడా ఈ నెల 21న ఎన్నికల నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో ఎరువులు ప్రస్తుతానికి సరిపడా అందుబాటులో ఉన్నాయని, వరిసాగు ఎక్కువగా ఉన్నందున కొరతరాకుండా ఇంకా కొంతమొత్తంలో ఎరువులు కేటాయించేందుకు కృషిచేయాలని మంత్రులను కోరారు. ఉపాధిహామీ పనిదినాలు పెంచ దానికి కృషి చేస్తున్నామని కలెక్టర్ చెప్పారు. రైతుల పొలాల్లోని డొంక రోడ్ల నిర్మాణాన్ని ఉపాధిహామీలో చేపట్టాలని, పైలెట్‌ప్రాజెక్టుగా కావలి నియోజకవర్గాన్ని పరిశీలించాలని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి కోరగా, మట్టిపనులకు ఉపాధిహామీ నుంచి డొంక రోడ్లు ఏర్పాటు చేయడానికి పరిశీలిస్తా మని కలెక్టర్ చెప్పారు. ప్రస్తుతం వ్యవసాయ పనులు జరుగుతున్నందున ఫిబ్రవరి, మార్చిలో రోజుకు లక్ష పనిదినాలు లక్ష్యంగా 45 లక్షల పనిదినాలు పూర్తి చేస్తామని చెప్పారు.

జాయింట్ కలెక్టర్ కె కార్తీక్ మాట్లాడుతూ జిల్లాలో 731 రెవెన్యూ గ్రామాలుండగా 232 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు పూర్తిచేశామని, వీటిలో 2951 అర్జీలు వివిధ భూసమస్యలపై అందాయని చెప్పారు. వీటిలో 120 అర్జీలను పరిష్కరించినట్లు చెప్పారు. భూ సమస్యల్లో ఆర్ఓఆర్, 22ఎ తొలగింపులు, ఎఫ్లైన్ సర్వే, అసైన్‌మెంటు భూముల కోసం పలు వినతులు వచ్చాయన్నారు.

ఈ సమావేశంలో డిఆర్‌వో ఉదయభాస్కర్‌రావు, ఎఎస్‌పి శ్రీనివాసరెడ్డి, ఇరిగేషన్ ఎస్ఈ దేశ్‌నాయక్, జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి, జడ్పీ సిఇవో విద్యారమ, డ్వామా పీడీ గంగా భవాని, ఆర్అండ్‌బి ఎస్ఈ గంగాధర్, పంచాయతీరాజ్ ఎస్ఈ అశోక్‌కుమార్, డిఇవో బాలాజీరావు, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# హాస్టళ్లలోకి బయట ఆహారం అనుమతించొద్దు

- అధికారులకు బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత ఆదేశం
- రాంపురం గురుకుల పాఠశాల విద్యార్థినుల ఆరోగ్యంపై ఆరా
- డిశ్చార్జి చేసినా హాస్టల్‌లో వైద్య సిబ్బంది పర్యవేక్షణలోనే ఉంచాలని సూచన

అమరావతి(చైతన్యరథం): రాష్ట్ర వ్యాప్తంగా బీసీ హాస్టళ్లు, గురుకుల పాఠశాలల్లోకి బయట ఆహారాన్ని అనుమతించొద్దని బీసీ సంక్షేమ శాఖాధికారులు, హాస్టళ్ల సిబ్బందిని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి ఎస్.సవిత ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం మంత్రి సవిత ఒక ప్రకటన విడుదల చేశారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ మండలం రాంపురం బీసీ గురుకుల పాఠశాలకు చెందిన 13 మంది బాలికలు స్వల్ప అస్వస్థతకు గురికాగా, స్థానిక పీహెచ్‌సీలో ప్రాథమిక చికిత్స అందజేసిన అనంతరం మంగళవారం ఉదయం వారిని డిశ్చార్జి చేశారు. విషయం తెలుసుకున్న మంత్రి సవిత...విద్యార్థినులతోనూ, వైద్యులతోనూ, గురుకుల సిబ్బందితోనూ ఫోన్లో మాట్లాడారు. కలుషిత ఆహారం తీసుకోవడం వల్లే విద్యార్థినులు స్వల్ప అస్వస్థతకు గురయ్యారని మంత్రితో వైద్యులు తెలిపారు. విద్యార్థినులంతా కోలుకున్నారని, వారిని డిశ్చార్జి చేశామని వైద్యులు వెల్లడించారు. ప్రస్తుతం హాస్టల్‌లోనే విద్యార్థినులు విశ్రాంతి తీసుకుంటున్నట్లు గురుకుల సిబ్బంది తెలిపారు. బాలికలను డిశ్చార్జి చేసినా హాస్టల్‌లోనే వైద్యుల పర్యవేక్షణలోనే ఉంచాలని, ఎప్పటికప్పుడు వారి ఆరోగ్య పరిస్థితి నివేదికలు ఇవ్వాలని మంత్రి ఆదేశించారు. గురుకుల పాఠశాలలోని మిగిలిన విద్యార్థినుల పరిస్థితిపైనా మంత్రి ఆరా తీశారు. వారంతా బాగున్నారని, ఆదివారం కావడంతో, హాస్టల్ చుట్టు పక్కల ఉన్న షాపుల నుంచి కూడా ఆహార పదార్థాలను కొనుగోలు చేసి విద్యార్థినులు తిన్నారని తెలిపారు. అటువంటి వారే అస్వస్థతకు గురయ్యారని తెలిపారు. దీనిపై మంత్రి సవిత తీవ్ర ఆగ్రహం చేశారు. హాస్టల్‌లోకి బయట ఆహారం తీసుకురానివ్వొదని ఆదేశించారు. విద్యార్థినులను ఎట్టి పరిస్థితుల్లోనూ హాస్టల్ నుంచి బయటకు వెళ్లనీయొద్దని మంత్రి సవిత స్పష్టం చేశారు.



# ఉద్యోగాల పేరుతో రూ.10 కోట్లకు కుచ్చుటోపీ







- నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్, వైసీపీ నేతలపై ఫిర్యాదు
- దోపిడీ దారులపై చర్యలు తీసుకోవాలని బాధితుల వినతి
- భూమి కబ్జా చేసిన బద్వేల్ మున్సిపల్ వైస్ చైర్మన్
- టీడీపీ కేంద్ర కార్యాలయానికి అర్జీలతో తరలి వచ్చిన జనం
- వినతులు స్వీకరించిన నేతలు వర్ల రామయ్య, ఎంఏ షరీఫ్, అశోక్‌బాబు, దీపక్‌రెడ్డి

అమరావతి (చైతన్యరథం): వైసీపీ నేతల దోపిడీలు రోజుకొకటి బయటకు వస్తున్నాయి. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం జరిగిన ప్రజావినతుల స్వీకరణ కార్యక్రమంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అప్పనపల్లి దేవస్థానంలోని కేశఖండన శాలలో పనిచేసే నాయీ బ్రాహ్మణులు గోడు వెళ్లబోసుకున్నారు. గత ప్రభుత్వం తెచ్చిన 110 జీవోను అడ్డుపెట్టుకొని వైసీపీ హయాంలో నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌గా వ్యవహరించిన సిద్ధవటం యానాదయ్య, ఆంధ్రప్రదేశ్ దేవాలయాలకు జేఏసీ నాయకులమని చెప్పుకుంటున్న గుంటుపల్లి రామదాసు, ర్యాలి వెంకటరమణ, గౌరీ లక్ష్మీ నారాయణలు తమకు ఉద్యోగాలు ఇప్పిస్తామని ఒక్కొక్కరి వద్ద లక్ష చొప్పున వసూలు చేశారని ఫిర్యాదు చేశారు. ఇలా రాష్ట్రవ్యాప్తంగా దాదాపు రూ.10కోట్లు దండుకున్నారని.. ఈ దోపిడీపై విచారణ జరిపి వారిని కఠినంగా శిక్షించాలని నేతలకు బాధితులు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య.. సమస్యపై కోనసీమ జిల్లా ఎస్పీతో ఫోన్లో మాట్లాడారు. సమస్యను తెలియజేసి విచారించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు ఎంఏ షరీఫ్, ఎమ్మెల్సీ అశోక్‌బాబు, SEEDAP చైర్మన్ దీపక్ రెడ్డి పాల్గొని ప్రజల నుండి అర్జీలు స్వీకరించి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు.

వైసీపీకి చెందిన బద్వేల్ మున్సిపల్ వైస్‌చైర్మన్ తమ భూమిని ఆక్రమించుకొని అక్రమ నిర్మాణాలు చేపడుతున్నాడని.. కడప జిల్లా బద్వేల్ మండలానికి చెందిన ఎస్ సుధాకర్ ఫిర్యాదుచేశాడు. దానిపై తాము కోర్టుకు వెళితే స్టే ఆర్డర్ ఇచ్చిందని,అయినా అక్రమ నిర్మాణాలు ఆగలేదని వాపోయారు. అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని వేడుకున్నాడు.

తాము టీడీపీకి అనుకూలంగా ఉండటంతో తన తండ్రిపై వైసీపీ నేతలు హత్యయత్నం చేయగా.. కేసు కోర్టుకు వెళితే అక్కడ పీపీ వైసీపీ నేతలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నాడని పల్నాడుజిల్లా మాచర్ల మండలం కంభంపాడు గ్రామానికి చెందిన దండు నరసింహారావు ఆవేదన వ్యక్తం చేశాడు. ఇప్పుడున్న పీపీ వల్ల తమకు న్యాయం జరగదని, కొత్త పీపీని ఏర్పాటు చేసి న్యాయం జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

తమ పొలంలోకి వెళ్లనివ్వకుండా సీఐ చిన్న గొల్ల కోటయ్య, కానిస్టేబుల్ గొల్ల మునీంద్రలు తమను అడ్డుకుంటున్నారని కర్నూలు జిల్లా దేవనకొండ మండలం వరిముక్కల గ్రామానికి చెందిన వడ్డె హరికృష్ణ వాపోయాడు. తమపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని ఆరోపించాడు. వైసీపీ కండువా వేసుకుంటేనే తమ పొలానికి దారి ఇస్తామని లేదంటే..దిక్కున్న చోట చెప్పుకోమని బెదిరిస్తున్నారని ఆరోపించారు. వారిపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని వేడుకున్నాడు.

తమ తాతల నుండి తమకు వారసత్వంగా వచ్చిన భూమిని ఆన్‌లైన్ చేయమని అడుగుతుంటే అధికారులు పట్టించుకోకుండా తిప్పుకుంటున్నారని కర్నూలు జిల్లా వెల్దుర్తికిచెందిన కటక బీబీ వాపోయారు. దాదాపు 15సంవత్సరాల నుండి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నామని తమకు వారసత్వంగా వచ్చిన భూమిని ఆన్‌లైన్ చేసి తమ సమస్యను పరిష్కరించాలని వేడుకున్నారు.

తనకు గతంలో ప్రభుత్వం ఇచ్చిన ఇంటిని కోటా లక్ష్మి అనే మహిళ కబ్జా చేసి మరొకరికి అమ్మేసుకుందని కృష్ణా జిల్లా చల్లపల్లి మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన మట్టా ఏసు కుమారి ఫిర్యాదు చేసింది. ఆమెపై చర్యలు తీసుకొని తమ ఇంటిని తనకు ఇప్పించాలని టీడీపీ నేతలను ఏసు కుమారి వేడుకుంది.

ఆలయ కార్యదర్శి బత్తుల గురుమూర్తి దాదాపు రూ.10 లక్షలు గుడి సొమ్ము కాజేశాడని విజయవాడ పరిధిలోని గంగానమ్మ రామాలయ దేవస్థాన కమిటీ సభ్యులు ఫిర్యాదుచేశారు.అతని అవినీతి దందాపై విచారణ జరిపించి సొమ్ములు ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

రాష్ట్ర ప్రభుత్వం తమ విన్నపాన్ని మన్నించి బేడ, బుడగ జంగం కులాన్ని షెడ్యూల్డ్ కులాల జాబితాలో చేర్చి రాజ్యాంగ బద్ధమైన హక్కులు, రిజర్వేషన్ కల్పించాలని బేడ, బుడగ సంక్షేమ సంఘం సభ్యులు సమర్పించిన వినతి పత్రంలో కోరారు.

తమ ఇంటివద్ద ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించమంటే ఏకంగా లక్షా యాభై వేల రూపాయాలు డిమాండ్ చేస్తున్నారని విజయనగరం జిల్లా కొత్తవలస మండలం దేవాడ గ్రామానికి చెందిన కొల్లా అప్పల సీతారామయ్య వాపోయాడు. తమ ఆర్థిక పరిస్థితి బాగా లేదని, తాము డబ్బులు చెల్లించలేమని నిస్సహాయత వ్యక్తం చేశాడు.దయచేసి తమ ఇంటి వద్ద ప్రమాదకరంగా ఉన్న టాన్స్‌ఫార్మర్‌ను తొలగించేలా చర్యలు తీసుకోవాలని వేడుకున్నాడు.

తమ పేరు మీద ఉన్న భూములను కత్తులు పెట్టి బెదిరించి ఈశ్వరయ్య,నాగేశ్వర్, నాగేశంలు కబ్జా చేశారని సత్యసాయి జిల్లా ధర్మవరానికి చెందిన కాశెట్టి ఓబులమ్మ ఆరోపించింది. దీనిపై విచారించి తమ భూములను తమకు వచ్చేలా చూడాలని కోరింది.





# జమిలికి టీడీపీ మద్దతు



- ఎన్నికల ఖర్చు తగ్గే అవకాశం
- వికసిత్ భారత్‌లో భాగస్వామ్యమే లక్ష్యం
- లోక్‌సభలో కేంద్ర మంత్రి పెమ్మసాని

ఢిల్లీ (చైతన్యరథం): వన్ నేషన్- వన్ ఎలక్షన్‌కు ఏపీ సీఎం చంద్రబాబు నాయుడి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందని కేంద్ర గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖల సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం లోక్‌సభలో జమిలి ఎన్నికల బిల్లుపై ఆయన మాట్లాడుతూ వికసిత్ భారత్ -2047 లక్ష్యసాధన కార్యక్రమాలకు టీడీపీ కట్టుబడి ఉందని తెలిపారు.

దేశ సమాఖ్య స్ఫూర్తి, పురోగతి, అభివృద్ధిలో భాగస్వామ్యం అయ్యేందుకు వికసిత్ భారత్ లక్ష్యానికి వికసిత్ ఆంధ్ర -2047 ను అనుసంధానం చేయాలని ధ్యేయంగా పెట్టుకున్నట్లు తెలిపారు.

## అనేక ప్రయోజనాలు

వన్ నేషన్ -వన్ ఎలక్షన్ ద్వారా అనేక ప్రయోజనాలు ఉన్నాయని కేంద్రమంత్రి పెమ్మసాని తెలిపారు. 2019 లోక్‌సభ ఎన్నికలకు సుమారు రూ.6 వేల కోట్లు, 2024 లో రూ.10 వేల కోట్లపైగా ఎన్నికల కమిషన్ ఖర్చు చేసినట్లు వివరించారు. లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు.. రెండింటినీ ఒకేసారి నిర్వహిస్తే ఖర్చులు 40 శాతం తగ్గే అవకాశం ఉందని, దీంతోపాటు ఏడు శాతం వరకు ఓటింగ్ పెరుగుతుందని తెలిపారు.

## ఖర్చులు - విధులు

దేశంలో రాజకీయ పార్టీలకు లక్ష కోట్ల రూపాయలకు పైగా ఎన్నికల ఖర్చు అవుతుందని, ఒకేసారి ఎన్నికలు నిర్వహించడం ద్వారా ఈ ఖర్చు కూడా తగ్గుతుందని వివరించారు. గత ఆరు నెలల్లో రాష్ట్ర స్థాయిల్లో మూడు ఎన్నికలు జరిగాయని, ఈ కారణంగా అధికార యంత్రాంగం రెగ్యులర్ విధులకు ఆటంకం కలుగుతుందని వివరించారు. విడతల వారీగా ఎన్నికలను నిర్వహించడం ద్వారా ఆ ప్రభావం దేశవ్యాప్తంగా ఉంటుందని పెమ్మసాని తెలిపారు.

చైతన్యరథం

# రేషన్ బియ్యం దొంగలను వదిలేది లేదు

- పేర్ని జయసుధ గోదాములో మొత్తం 4840 బస్తాలు మాయం
- మూడు శాఖలతో లోతుగా విచారణ
- తప్పు చేసినవారు తప్పించుకోలేరు
- సాక్ష్యాధారాలతో ప్రజాక్షేత్రంలో నిలబెడతాం
- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టీకరణ



తెనాలి (చైతన్యరథం): వైసీపీ నాయకుడు, మాజీ మంత్రి పేర్ని నాని సతీమణి జయసుధ యజమానిగా ఉన్న జేఎస్ గోడౌన్‌లో రేషన్ బియ్యం మాయం ఘటనలో పోలీస్, రెవెన్యూ, పౌరసరఫరాల శాఖలు లోతుగా విచారణ జరుపుతున్నాయని రాష్ట్ర పౌర సర ఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. ప్రజలకు సంబంధించిన రేషన్ బియ్యాన్ని దారి మళ్లిం చి ఆధారాలను నాశనం చేయాలని చూస్తున్నారన్నారు. తెనాలిలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి నాదెండ్ల మాట్లాడుతూ మాయమైన బియ్యానికి డబ్బు కడితే సరిపోతుందని అనుకుంటున్నారు.. క్రిమినల్ కేసులు నమోదు చేశాం.. తప్పు చేసిన వారికి శిక్ష తప్పదని హెచ్చరించారు. ఆ గోడౌన్‌లో 3 వేల బస్తాలు కాదు... మొత్తం 4840 బస్తాలు మాయం అయ్యాయని తెలిపా రు. గత ప్రభుత్వంలో బాధ్యత కలిగిన పదవిలో ఉండి... దానిని దుర్వినియోగం చేసిన తీరును సాక్ష్యా ధారాలతో ప్రజల ముందుపెడతామని అన్నారు. కూట మి ప్రభుత్వంలో ఎవరి మీద కక్ష సాధింపు చర్యలు ఉండవని, తప్పు చేసిన వారు ఎవరైనా చట్టం నుంచి తప్పించుకోలేరని స్పష్టం చేశారు. అక్కడే ఉన్న రెండో గోదాముపైన కూడా అనుమానాలు ఉన్నాయన్నారు.

### సాఫ్ట్‌వేర్ అమలు చేస్తున్నామనగానే లేఖ రాశారు

పౌరసరఫరాలశాఖలో సంస్కరణలు తీసుకురావాలని నవంబర్ 26న సివిల్ సప్లైస్ ఎండీ.. "వేర్ హౌస్ మేనేజ్మెంట్ సిస్టమ్" అనే సాఫ్ట్ వేర్ తీసుకొచ్చారు.ఏ గోడౌన్‌లో ఎంత స్టాక్ ఉంది? ఏ గోడౌన్‌లో ఎంత స్టాక్ భద్రపరచాలి? వచ్చే సీజన్‌లో ఎంత వరకు ధాన్యం కొనుగోలు చేయాలి.. ఇలాంటి సమాచారం పొందు పరిచే విధంగా ఈ సాఫ్ట్ వేర్ రూపొందించారు. అదే రోజు గోడౌన్ యాజమానులకు, మేనేజర్లకు, పౌరసరఫరాలశాఖ అధికారులకు ఆన్‌లైన్‌లో ట్రైనింగ్ ఇచ్చారు. ఏ విధంగా తనిఖీలు చేసి ఆన్ లైన్‌లో నమోదు చేయాలో వివరంగా తెలియజేశారు. ఆ మరుసటి రోజునే.. నవంబర్ 27వ తేదీన తమ గోదాముల్లో నిల్వలు తగ్గాయని, మూడు వేల బస్తాల రేషన్ బియ్యం తక్కువగా కనబడుతోందని, వేబ్రిడ్జ్ లో తూకం పొరపాటు వల్ల ఇలా జరిగిందని జె.ఎస్. గోడౌన్ ప్రతినిధులు లేఖ రాశారు. గోడౌన్‌లో మాయ మైన బియ్యానికి ఎంత విలువైతే అంత డబ్బులు చెల్లిస్తామని లేఖలో పేర్కొన్నట్లు మంత్రి నాదెండ్ల తెలిపారు.

### ముగ్గురు సభ్యులతో కమిటీ వేశాం

ఆ లేఖ చూడగానే... అసలు జేఎస్ గోడౌన్స్‌లో స్టాక్ ఎంతుందనే సమాచారాన్ని జాయింట్ కలెక్టర్ నుంచి డిసెంబర్ 4వ తేదీన తెప్పించుకున్నాం. దీంతో చట్టప్రకారం తగ్గిన బియ్యం విలువకు రెట్టింపు మొత్తం జరిమానా వేయాలని, జేఎస్ గోడౌన్‌ను బ్లాక్ లిస్టులో ఉంచాలని నిర్ణయించి, క్రిమినల్ చర్యలు తీసుకోవాలని పోలీసులకు డిసెంబర్ 10న సివిల్ సప్లయిస్ ఎండీ ఫిర్యాదు చేశారు. మాయమైన రేషన్ బియ్యంపై లోతైన విచారణకు ఆర్డీవో, సివిల్ సప్లయిస్ మేనేజర్, లీగల్ మెట్రాలజీ విభాగం నుంచి అసిస్టెంట్ కంట్రోలర్‌తో కమిటీ వేశారు. జేఎస్ గోడౌన్‌లో డిసెంబర్ 16వ తేదీన తనిఖీలు నిర్వహిస్తామని 13వ తేదీన నోటీసులు జారీ చేశాం. నోటీసులు జారీ చేసిన రోజే కోటి రూపాయల డీడీలను కృష్ణా జిల్లా జాయింట్ కలెక్టర్‌కు జరిమానా కింద జేఎస్ యాజమాన్యం అందించింది. 16వ తేదీన సిబ్బంది తనిఖీలకు వెళ్లినా సహకరించలేదు. కనీసం ఎవరూ రాకపోవడంతో- పై అధికారుల అనుమతితో లాయర్ల సమక్షంలో పంచనామా చేశారు. పూర్తిస్థాయిలో విచారణ జరపడానికి అక్కడ ఉన్న స్టాక్ 4093 బస్తాలు మండల లెవల్ స్టాకింగ్ పాయింట్లకు తరలించారు. దీన్ని మొత్తం వీడియో కెమెరా ద్వారా చిత్రీకరించామని మంత్రి నాదెండ్ల వివరించారు.

### రిజిస్టర్ ట్యాంపర్ చేసే ప్రయత్నం

వేబ్రిడ్జ్‌లో టెక్నికల్ ప్రాబ్లమ్ వల్ల పొరపాటున స్టాక్ తగ్గింది అని జేఎస్ యాజమాన్యం చెబుతోంది. అయితే పక్కనే ఉన్న సత్య గోడౌన్‌లో టెక్నికల్ ప్రాబ్లమ్ ఉందనిగానీ, స్టాక్ తగ్గిందని మాత్రం చెప్పలేదు. స్టాక్ రిజిస్టర్, లారీ వేబ్రిడ్జ్‌ను ట్యాంపర్ చేసి ఆధారాలను ధ్వంసం చేయడానికి ప్రయత్నిస్తున్నారు. దీనిపై ఇప్పటికే ఎఫ్ఐఆర్ నమోదయింది. అందిన రిపోర్టు ప్రకారం 243 మెట్రిక్ టన్నులు అంటే 4840 బస్తాలు తగ్గాయని నిర్ధారణ అయింది. నిబంధనల ప్రకారం 2 కోట్ల 23లక్షల 56వేల రూపాయలు చెల్లించారు. చాలా మంది సంబంధిత గోడౌన్ యజమాని కుటుంబంపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు. చట్టం ముందు అందరూ సమానమే. ఎవరిపైనా కక్ష సాధింపు చర్యలు ఉండవు. తప్పు చేస్తే ఎవరూ తప్పించుకోలేరు. రూల్ ఆఫ్ లా ఇంప్లిమెంట్ కావాల్సిందే. జేఎస్ గోడౌన్ 2021లో పౌర సరఫరాల శాఖకు అప్పగించారు. అక్కడ సుమారు 5వేల మెట్రిక్ టన్నులు బియ్యాన్ని భద్రపరుస్తాం. అటువంటి గోడౌన్‌లో 243 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని దారి మళ్లించారు. లెక్కలతో సబంధం లేకుండా ప్రజల సొమ్ము స్వలాభం కోసం దారి మళ్లించారు. కూటమి ప్రభుత్వం తరపున ప్రజలకు హామీ ఇస్తున్నాం. వందకు వందశాతం న్యాయం చేస్తాం. తప్పు చేసిన ఏ ఒక్కరినీ వదిలిపెట్టబోమని మంత్రి నాదెండ్ల స్పష్టం చేశారు.

# గుంతల్లేని రోడ్లే లక్ష్యం

- మరమ్మతు పనులను ముమ్మరం చేయాలి
- సంక్రాంతినాటికి పనులు పూర్తి కావాలి
- అధికారులకు మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి ఆదేశం
- పనుల పురోగతిపై వీడియో కాన్ఫరెన్స్

అమరావతి (చైతన్యరథం): ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు సంక్రాంతి నాటికి రహదారుల మరమ్మతు పనులను పూర్తి చేసి, గుంతల రహిత రహదారుల లక్ష్యాన్ని కచ్చితంగా చేరుకోవాల్సిందేనని ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులకు రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాలశాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. మంగళవారం మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆర్ అండ్ బీ శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రభుత్వం అనుకున్న విధంగా గుంతల రహిత రహదారుల లక్ష్యాన్ని చేరుకోవడానికి కేవలం నెలరోజుల సమయమే ఉందన్నారు. ఈ నేపథ్యంలో మరమ్మతు పనులను మరింత ముమ్మరం చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. నిర్దిష్ట కాలపరిమితిని పెట్టుకుని, క్షేత్రస్థాయి అధికారులతో సమన్వయం చేసుకుని, ప్రణాళికబద్ధంగా పనులను పూర్తిచేసే విధంగా ముందుకుసాగాలని అధికారులకు సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆశాఖ ముఖ్యకార్యదర్శి కాంతిలాల్ దండే, ఈఎన్‌సీ నయిముల్లా, ఏపీఎస్ ఆర్డీసీ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్‌రెడ్డి,ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన రహదారులను అందించాలనే ఆలోచనతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. అందుకు అనుగుణంగా యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని క్షేత్రస్థాయి అధికారులకు సూచించారు. రోడ్ల మరమ్మతుల పనులకు సంబంధించి డివిజన్ల వారీగా క్షేత్రస్థాయి నుంచి అందుతున్న రోజు వారీ ప్రగతి నివేదికలపై ఆయా డివిజన్ల అధికారులతో మంత్రి మాట్లాడారు. కొత్త ఏడాదిలో ప్రజలకు మంచి రోడ్లు అందించాలనే ఆలోచనతో జనవరి తొలి వారం నాటికే పనులు పూర్తి చేయాలనే ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. నూతన సంవత్సరంలో ప్రజల నుంచి రోడ్లకుసంబంధించి ఏవిధమైన విమర్శలకు తావు లేకుండా పనిచేయాలన్నారు. వివిధ కారణాలతో వెనుకబడ్డ డివిజన్లకు సంబంధించి ఆ అధికారులతో వ్యక్తిగతంగా మాట్లాడాలన్నారు. ఎప్పటిలోపు పనులు పూర్తిచేస్తారో టార్గెట్ ఫిక్స్ చేయాలని ఉన్నతాధికారులకు మంత్రి సూచించారు. ఇప్పుడు వెనుకబడ్డ డివిజన్‌లు వచ్చే సమావేశం నాటికి పనుల్లో వేగం పుంజుకోవాలన్నారు.

రాష్ట్రంలోని మొత్తం 45,378కి.మీ మేర రాష్ట్ర, జిల్లా ప్రధాన రోడ్లు ఉండగా, అందులో 22,299 కి.మీ రోడ్లు దెబ్బతిన్నాయన్నారు. మొత్తంగా రూ.861 కోట్లతో చేపట్టిన రోడ్ల మరమ్మతులకు సంబంధించి ఇప్పటి వరకు 4,157కి.మీ మేర రోడ్లను గుంతల రహిత రహదారులుగా తీర్చిదిద్దామన్నారు. ముఖ్యమంత్రితో పాటు తామంతా రోడ్ల ప్రగతిపై ప్రతివారం సమీక్షా సమావేశాలు నిర్వహిస్తూ, క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనుల వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నామన్నారు.ఇప్పటికే పలు జిల్లాల్లో పర్యటించడం ద్వారా రోడ్లమరమ్మతులను తాను స్వయంగా పర్యవేక్షించినట్లు మంత్రి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రోడ్ల మరమ్మతుల పనుల విషయంలో సీరియస్‌గా ఉన్న నేపథ్యంలో క్షేత్రస్థాయిలో అధికారులు సైతం మరింత కష్టపడి పనిచేయాలన్నారు. రోడ్ల మరమ్మతుల పనులు ప్రారంభించిన సమయంతో పోలిస్తే, వర్షాలు వంటికారణాలతో కొన్ని డివిజన్‌లలో పనులు ముందకొడిగా సాగుతున్నాయన్నారు. ఆయా డివిజన్లలో పనులు తిరిగి వేగం పుంజుకోవాలంటే యుద్ధ ప్రాతిపదికన పని చేయాలన్నారు. అదే సమయంలో ఆయా పనులును సకాలంలో పూర్తిచేయడానికి కాంట్రాక్టర్లపై కూడా ఒత్తిడి పెంచాలన్నారు..సకాలంలో పనులు పూర్తి చేసిన వారికి జాప్యం లేకుండా త్వరితగతిన బిల్లులు అందజేస్తామని మంత్రి తెలిపారు.

గుంతల రహిత రోడ్లే లక్ష్యంగా మిషన్ మోడ్‌లో రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వం పనిచేస్తోందని, అదే సమయంలో రోడ్ల నాణ్యతాప్రమాణాల విషయంలో ఎంతమాత్రం రాజీ పడవద్దని మంత్రి స్పష్టంచేశారు. రోజువారీ రోడ్ల పనుల ప్రగతికి సంబంధించి ఉన్నతాధికారులకు సమాచారం అందిస్తూ..ఎక్కడైనా లోపాలుంటే ఆయాఅధికారుల దృష్టికి తీసుకొచ్చి సమన్వయం చేసుకోవాలని క్షేత్రస్థాయి అధికారులకు మంత్రి సూచించారు.



# వక్ఫ్‌బోర్డు చైర్మన్‌గా అబ్దుల్ అజీజ్



- ఏకగ్రీవంగా ఎన్నుకున్న బోర్డు సభ్యులు
- ఈ మేరకు జీవో విడుదల
- వేగంగా బోర్డు ఏర్పాటు ప్రక్రియ పూర్తిచేసిన మంత్రి ఫరూక్

అమరావతి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ వక్ఫ్‌బోర్డ్ చైర్మన్‌గా నెల్లూరు నగర మాజీ మేయర్, టీడీపీ నాయకుడు అబ్దుల్ అజీజ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవల ప్రభుత్వం చేత నియమితులైన వక్ఫ్‌బోర్డు సభ్యుల మొదటి సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో చైర్మన్‌గా అబ్దుల్ అజీజ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అబ్దుల్ అజీజ్ నియామకంపై ప్రభుత్వం జీవో కూడా విడుదల చేసింది. వక్ఫ్ బోర్డ్ ఏర్పాటు ప్రక్రియను త్వరితగతిన చేపడతామని మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే. అందుకు అనుగుణంగానే మంత్రి ఫరూక్ నేతృత్వంలో వక్ఫ్ ఏర్పాటు ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేశారు.

గత ప్రభుత్వ హయాంలో జారీ అయిన వక్ఫ్‌బోర్డు జీవో-47ను రద్దుచేసి, ప్రస్తుత కూటమి ప్రభుత్వం జీవో-75 విడుదల చేసిన విషయం విదితమే. గత ప్రభుత్వం 2023, అక్టోబర్ 21న వక్ఫ్ బోర్డు ఏర్పాటు కోసం నామినేట్ చేసిన సభ్యుల నియామకాల తీరుపై కొందరు రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో, వక్ఫ్‌బోర్డు చైర్మన్ ఎంపిక ప్రక్రియను నిలుపుదల చేస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. వివిధ రకాల న్యాయపరమైన సమస్యలు తలెత్తిన కారణంగా అప్పటి నుంచి వక్ఫ్ బోర్డులో పరిపాలనా శూన్యత ఏర్పడింది. ఈ సమస్యను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా దృష్టి సారించి, రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ నేతృత్వంలో వేగంగా కార్యాచరణ ప్రారంభించింది. ఇందులో భాగంగా గత ప్రభుత్వం జారీ చేసిన వివాదాస్పదమైన జీవో -47ను రద్దు చేసి, నూతనంగా జీవో నెంబర్ 75ను కూటమి ప్రభుత్వం జారీ చేసింది. తదనంతరం కూటమి ప్రభుత్వం నిబంధనలకు అనుగుణంగా వక్ఫ్ బోర్డు సభ్యులను నియమిం చింది.బోర్డు సభ్యుల మొదటి సమావేశం వక్ఫ్ బోర్డు కార్యాలయంలో జరిగింది. బోర్డు సభ్యులంద రూ సహచర సభ్యుడొకరిని చైర్మన్‌గా ఎన్నుకోవాల్సి ఉంటుంది. అందుకు అనుగుణంగా అబ్దుల్ అజీజ్ ను చైర్మన్‌గా బోర్డు సభ్యులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు అబ్దుల్ అజీజ్‌ను ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్‌గా నియమిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది.

ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ వక్ఫ్ ఆస్తుల నిర్వహణ, పరిరక్షణ, మైనార్టీల సంక్షేమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కట్టుబడిఉందని స్పష్టంచేశారు. గత కొద్ది నెలలుగా వక్ఫ్ బోర్డులో ఏర్పడిన పరిపాలనా శూన్యతపై దృష్టి సారించి,తగు చర్యలు చేపట్టి, నియమ నిబంధనలకు అనుగుణంగా వక్ఫ్ బోర్డు ఏర్పాటు ప్రక్రియను పూర్తి చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో అన్యాక్రాంతమైన వక్ఫ్ భూములను స్వాధీనం చేసుకోవడం, ఉన్న భూములను పరిరక్షించడంపై కొత్త బోర్డుకు ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టమైన బాధ్యతలు అప్పజెప్పినట్లు మంత్రి తెలిపారు.

# రాష్ట్రంలో పర్యాటకానికి మహర్దశ

- పెట్టుబడిదారులకు పూర్తి సహకారం
- పర్యాటక రంగంలో రూ.25 వేల కోట్ల పెట్టుబడులు లక్ష్యం
- పర్యాటక పెట్టుబడిదారుల సదస్సులో మంత్రి దుర్గేష్
- నూతన పర్యాటక పాలసీ ఆవిష్కరణ



విజయవాడ (చైతన్యరథం): కూటమి ప్రభుత్వంలో పరిశ్రమ హెూదాతో పర్యాటక రంగానికి మహర్దశ వచ్చిందని, సమగ్ర పర్యాటక విధానంతో రాబోయే ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్‌ను పర్యాటకుల గమ్యస్థానంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. మంగళవారం విజయవాడలోని హెూటల్ వివంతలో సీఐఐ, ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ మద్దతుతో స్నేహపూర్వక వాతావరణంలో జరిగిన పర్యాటక పెట్టుబడిదారుల సదస్సులో మంత్రి కందుల దుర్గేష్ 2024-29 కాలానికి నూతన పర్యాటక పాలసీని ఆవిష్కరించారు. పర్యాటక రంగంలో పెట్టుబడి పెట్టేందుకు దాదాపు 200 మందికి పైగా పెట్టుబడిదారులు ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా కొత్త పర్యాటక పాలసీ విధివిధానాలు, పర్యాటక అభివృద్ధికి రాష్ట్రంలో ఉన్న అవకాశాలు, ఇచ్చే రాయితీలు, ప్రోత్సాహకాల గురించి టూరిజం సెక్రటరీ వి.వినయ్‌చంద్, ఎండీ కాట ఆమ్రపాలి కూలంకషంగా వివరించారు.

ఒక్కొక్క ఇన్వెస్టర్‌తో మంత్రి కందుల దుర్గేష్, ఏపీటీడీసీ చైర్మన్ నూకసాని బాలాజీ, టూరిజం సెక్రటరీ వి.వినయ్ చంద్, ఎండీ ఆమ్రపాలి కాట, ఈడీ పద్మావతి.. ప్రత్యేకంగా మాట్లాడి వారి ప్రతిపాదనలు స్వీకరించారు. రాష్ట్రంలో ఏయే ప్రదేశాల్లో పెట్టుబడులు పెట్టాలని ఆసక్తి ఉందో అడిగి తెలుసుకొని సాధ్యాసాధ్యాలను వివరించారు. స్పష్టమైన, సహేతుకమైన ప్రతిపాదనలతో రావాలని పెట్టుబడిదారులకు సూచించారు. ఏ విధమైన సమాచారం కావాలన్నా తనతో సహా ఏపీటీడీసీ చైర్మన్, ఉన్నతాధికారులు అందరూ అందుబాటులో ఉంటారని మంత్రి దుర్గేష్ తెలిపారు.

### పర్యాటక రంగంపై ప్రత్యేక దృష్టి

మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఎలాంటి భయాందోళనలు అక్కర్లేదని, పెట్టుబడిదారులు నిర్భయంగా పెట్టుబడి పెట్టొచ్చని ఇన్వెస్టర్లకు ధైర్యమిచ్చారు. గతంలో రాజకీయ చిత్తశుద్ధి లేక పర్యాటక రంగం కుంటుపడిందని, ప్రస్తుతం ఇన్వెస్టర్లకు ప్రభుత్వ సహకారం మెండుగా ఉంటుందని, సరైన వాతావరణం కల్పిస్తుందని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం పర్యాటక రంగంపై ప్రత్యేక దృష్టి సారించిందని భరోసానిచ్చారు

రాష్ట్రంలో పర్యాటక అభివృద్ధికి పుష్కలమైన అవకాశాలు, వనరులున్న నేపథ్యంలో వాటన్నింటిని సమర్థవంతంగా వినియోగించుకొని పర్యాటక రంగంలో ఏపీని దేశంలో అగ్రపథాన నిలుపుతామన్నారు. సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ల దిశానిర్దేశంలో పర్యాటక రంగంలో రూ. 25,000 కోట్ల పెట్టుబడులను ఆకర్షించాలన్న ధ్యేయంతో ముందుకు సాగుతున్నామన్నారు. పర్యాటకాన్ని, పర్యావరణాన్ని సమ్మిళితం చేసి యువతకు ఉపాధి కల్పన, పర్యావరణ పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. టూరిజం సర్క్యూట్‌లు, యాంకర్ హబ్‌లు, థీమాటిక్ అప్రోచ్ ఏర్పాటు, అంతర్జాతీయ మౌలిక వసతుల కల్పనతో సందర్శనకు వచ్చిన పర్యాటకుడు కనీసం మూడు, నాలుగు రోజులు అక్కడే గడిపే విధంగా వసతులు కల్పిస్తామన్నారు. రాష్ట్రంలోని హెూటళ్లలో గదుల సంఖ్యను 50 వేలకు పెంచేలా కృషి చేస్తామన్నారు. ఒకే తరహా పర్యాటకాభివృద్ధి కాకుండా టెంపుల్, ఎకో, వెల్‌నెస్, విలేజ్, అగ్రి, అడ్వెంచర్ టూరిజంలను అభివృద్ధి చేస్తామన్నారు. గడచిన ఐదేళ్లలో కుంటుపడిన పర్యాటక రంగానికి కేంద్ర ప్రభుత్వ సహకారంతో కొత్త శోభ తెస్తామని మంత్రి దుర్గేష్ తెలిపారు. ఇప్పటికే సాస్కి -2024-25 (స్పెషల్ అసిస్టెన్స్ టూ స్టేట్స్ ఫర్ కేపిటల్ ఇన్వెస్ట్‌మెంట్) ద్వారా అఖండ గోదావరి, గండికోట అభివృద్ధికోసం నిధులు మంజూరయ్యాయని గుర్తుచేశారు. పర్యాటక రంగంలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ అమలు చేసి దేశంలోనే ఏపీని నెంబర్ 1గా తీర్చిదిద్దుతామన్నారు. తాము ఇచ్చిన చిన్న పిలుపుతో భారీ సంఖ్యలో వచ్చిన పెట్టుబడిదారులకు మంత్రి దుర్గేష్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

### సుస్థిరమైన పర్యాటకాభివృద్ధి దిశగా అడుగులు

ఏపీటీడీసీ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం పర్యాటకాభివృద్ధికి అనేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ప్రణాళికా బద్ధమైన విధానాలతో సుస్థిరమైన పర్యాటకాభివృద్ధికి బాటలు వేస్తామన్నారు. పర్యాటక రంగాన్ని అభివృద్ధిలో కొత్త పుంతలు తొక్కిస్తామని తెలిపారు.

### నూతన టూరిజం పాలసీతో అభివృద్ధి పరుగులు

నూతన టూరిజం పాలసీతో రాష్ట్రంలో పర్యాటకాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని టూరిజం సెక్రటరీ వి. వినయ్ చంద్ స్పష్టం చేశారు. స్థానిక జన సమూహాలను బలోపేతం చేయాలన్న ఉద్దేశంతో పాలసీ రూపొందించామన్నారు. రాష్ట్రంలోని జ్యోతిర్లింగాలు, శక్తిపీఠాలు, శైవ క్షేత్రాలు కలిసేలా 10 సర్క్యూట్‌లు, 25 థిమాటిక్ అప్రోచ్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. సీ ప్లేన్‌తో పాటు కోస్టల్ టూరిజం సర్క్యూట్‌లో భాగంగా వైజాగ్, కాకినాడ, శ్రీకాకుళం, నెల్లూరు, మచిలీపట్నం ప్రాంతాల్లో 5 బీచ్ సర్క్యూట్‌లు ఏర్పాటు చేయనున్నామన్నారు. రివర్ టూరిజం, క్రూయిజ్ టూరిజం సర్క్యూట్‌లు అభివృద్ధి చేయనున్నామన్నారు. ఇప్పటివరకు రుషికొండ బీచ్‌కు మాత్రమే బ్లూఫాగ్ సర్టిఫికెట్ ఉందని, మరిన్ని బీచ్‌లను అభివృద్ధి చేసి బ్లూఫాగ్ సర్టిఫికేషన్ కోసం ప్రతిపాదనలు పంపిస్తామన్నారు.

### ఆర్థిక పురోభివృద్ధి, ఉపాధి కల్పన

పర్యాటక రంగం ద్వారా ఆర్థిక పురోభివృద్ధి,ఉపాధి కల్పనకు బాటలువేస్తామని టూరిజం ఎండీ ఆమ్రపాలి కాట తెలిపారు. కొత్త పాలసీతో జాతీయ, అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షిస్తామన్నారు. సుస్థిరమైన అభివృద్ధి, బాధ్యతాయుత పర్యాటకం ద్వారా అభివృద్ధి సాధించాలన్నది పాలసీ ఉద్దేశమన్నారు. 4.6శాతం ఉన్న జీవీఏను 28శాతానికి పెంచడం, పర్యాటక రంగంలో 12శాతం ఉపాధిని 15శాతానికి పెంచాలన్న లక్ష్యంతో పాలసీ తయారుచేశామని వెల్లడించారు. భారతదేశానికి విదేశీ పర్యాటకులు అత్యధికంగా వచ్చే టాప్ 10రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్‌ను ఒకటిగా తయారు చేయాలన్న ఆలోచనతో ముందుకు వెళ్తున్నామన్నారు. పర్యాటక రంగంలో ఒక పర్యాటకుడు పెట్టే ఖర్చును 1,700 నుండి 25,000 ఖర్చు చేసే విధంగా మౌలిక సదుపాయాలు ఏర్పాటుచేయాలని నిర్ణయించామన్నారు. విశాఖపట్నం, అరకువ్యాలీ, రాజమహేంద్రవరం, అమరావతి, శ్రీశైలం, గండికోట, తిరుపతి ప్రాంతాల్లో 7 యాంకర్ హబ్‌లు ఏర్పాటు చేయనున్నామన్నారు. అమరావతి - నాగార్జున కొండ, విశాఖపట్నం-తొట్లకొండ ప్రాంతాల్లో బుద్ధిస్ట్ సర్క్యూట్స్ ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. పర్యాటకుల భద్రతకు పెద్దపీట వేస్తున్నామని వివరించారు.


టూరిజం పాలసీ విధివిధానాలు బాగున్నాయని ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ పి. భాస్కరరావు పేర్కొన్నారు. కొత్త టూరిజం పాలసీ పర్యాటక రంగంలో అద్భుతాలు సృష్టిస్తుందని నమ్ముతున్నామని సిఐఐ ప్రెసిడెంట్ డి. రామకృష్ణ అన్నారు. ఎంతో అధ్యయనం చేసి, మరెన్నో సమీక్ష సమావేశాల తర్వాత పర్యాటక పాలసీని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రూపొందించారని హెూటల్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వీరస్వామి తెలిపారు. ఏపీలో 50వేల రూమ్స్ ఏర్పాటుకు తాము సహకరిస్తామని తెలిపారు.

మరిన్ని వివరాలు, సలహాలు, సూచనల కోసం md@aptdc.in,edop@aptdc.in,ppp@aptdc.in,sathya27@gmail.com ను సంప్రదించాలని వక్తలు తెలిపారు.

పర్యాటక పెట్టుబడిదారుల సమావేశంలో తాజ్, మహీంద్ర, స్టెర్లింగ్, ఇమాజికా, ప్రమాణ్, వెవెంచర్, ఎస్ఆర్ఎస్, వేద్య, ఏపీఆర్, వి ఇన్ఫోటెక్ గ్రూప్, ఐఆర్ సీటీసీ, ఐఆర్ టీఎస్, నోవాటెల్, రిపిల్, డ్రీమ్ వ్యాలీ, రహేజా, లైలా గ్రూప్, తదితర సంస్థల పెట్టుబడుదారులు, ఔత్సాహికులు, అధికారులు పాల్గొన్నారు.

# పైప్డ్ గ్యాస్ రాజధానిగా అమరావతి

- గుజరాత్ గిఫ్ట్ సిటీ తరహాలో చేపడతాం
- ప్రతిపాదనలతో ముందుకొచ్చిన ఐఓసీ అధికారులు
- సీఎస్‌తో పీఎన్‌జీఆర్‌బీ ప్రతినిధుల భేటీ
- సమ్మతి తెలిపిన సీఎస్, సహకరిస్తామని హామీ




అమరావతి (చైతన్యరథం): దేశంలోనే మొత్తం పైప్డ్ గ్యాస్ వినియోగించే రాజధాని నగరంగా అమరావతిని తయారు చేస్తామని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ అధికారులు ప్రతిపాదనలతో ముందుకొచ్చారు. పెట్రోలియం అండ్ నేచురల్ గ్యాస్ రెగ్యులేటరీ బోర్డు (పీఎన్‌జీఆర్‌బీ) సభ్యులు ఎ.రమణకుమార్ నేతృత్వంలో ప్రతినిధుల బృందం మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) నీరభ్‌కుమార్ ప్రసాద్‌తో భేటీ అయ్యారు. రాష్ట్రంలో తాము చేపడుతున్న గ్యాస్ పైపులైన్ల నిర్మాణం, తదితర ప్రాజెక్టుల గురించి చర్చించారు. అమరావతి రాజధాని నగరాన్ని దేశంలో మొట్టమొదటి పూర్తి పైప్డ్ గ్యాస నగరంగా చేయాలని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ప్రతిపాదించిన విషయాన్ని ప్రభుత్వం ముందుంచారు. గుజరాత్ గాంధీనగర్ జిల్లాలోని గుజరాత్ ఇంటర్నేషనల్ ఫిన్-టెక్ సిటీ (గిఫ్ట్) నగరంలో గ్యాస్ మొదలు విద్యుత్తు, టెలికాం కేబుళ్ల వరకు అన్నీ కూడా అండర్ గ్రౌండ్‌లో ఉంటాయని, అక్కడ ఆవాసాలకు, వ్యాపార సముదాయలకు, సంస్థలు అన్నిటికీ కూడా పూర్తి పైప్డ్ గ్యాస్ అందిస్తున్నారని చెప్పారు. అదే తరహాలో అమరావతి రాజధాని నగరంలో కూడా పూర్తిగా పైప్డ్ గ్యాస్ అందించి రాజధానిని దేశంలో మొట్టమొదటి పైప్డ్ గ్యాస్ రాజధానిగా చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని పీఎన్‌జీఆర్బీ ప్రతినిధులు తెలిపారు. దీనికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్ సమ్మతి తెలియజేశారు. దీనికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నుంచి కావాల్సిన సంపూర్ణ సహకారాన్ని అందిస్తామని చెప్పారు.

### 80 లక్షల కనెక్షన్లు లక్ష్యం

రాష్ట్రంలో రాబోయే రోజుల్లో 80 లక్షల మందికి పైప్డ్ గ్యాస్ కనెక్షన్లు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆంధ్రప్రదేశ్ గ్యాస్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కె. దినేష్ కుమార్ తెలిపారు. సీఎస్‌తో భేటీ అనంతరం పీఎన్‌జీఆర్‌బీ ప్రతినిధుల బృందం ఆర్టీజీఎస్‌ను సందర్శించి అక్కడ ఏపీ గ్యాస్ డెవలప్మెంట్ కార్పొరేషన్ అధికారులతో సమావేశమైంది. రాష్ట్రంలో చేపడుతున్న నేచురల్ గ్యాస్ పైపులైన్ల నిర్మాణ ప్రగతి, సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ పనుల గురించి చర్చించారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో 80 లక్షల ఆవాసాలకు పైపుల ద్వారా గ్యాస్ సరఫరా అందించాలనేది లక్ష్యమని, ఆ దిశగా పీఎన్‌జీఆర్‌బీ అధికారులు సహకారం అందించాలని దినేష్ కుమార్ కోరారు. గ్యాస్ పైపులైన్ల నిర్మాణంలో క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి తాము పూర్తిగా సహకరిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ సంస్థ డైరెక్టర్ లెఫ్టినెంట్ కల్నల్ కుమార్ ఆశిష్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# 'ఆక్రోశిస్తున్న ఆంధ్రా ఎస్కోబార్'

తనకు అలవాటైన బొంకు రాతలతో పబ్బం గడపడానికి జగన్‌రెడ్డి అలవాటుపడిపోయాడు. "దొంగే దొంగ దొంగ అని అరిచినట్టు" సాక్షి ద్వారా ఆర్థిక నేరగాడు నిత్యం రాష్ట్ర ప్రజలకు సినిమా చూపిస్తున్నాడు. ప్రజాస్వామ్య విధ్వంసానికి, ప్రతిపక్షాల అణచివేతకు, వ్యవస్థలను కూల్చడానికే తన అధికారాన్ని వినియోగించిన జగన్.. తన వ్యక్తిగత ప్రయోజనాల కోసం రాష్ట్రాన్ని నాశనం చేసిన ప్రిజనరీ. స్వార్థం కోసం రాష్ట్రాన్ని అగాధంలోకి నెట్టిన అధికార వ్యసనపరుడు. ఒక్క ముక్కలో చెప్పుకోవాలంటే -ఏపీ ద్రోహి వైఎస్ జగన్! రాష్ట్రాభివృద్ధి, ప్రజాసంక్షేమానికి అహరహం కృషి చేస్తున్న నిర్మాణాత్మక నేత చంద్రబాబు ఉన్నతని చూసి జగన్ కడుపుమంటతో రగిలిపోతున్న దుస్థితి.. జగన్ ప్రచారం చేస్తున్న అబద్ధాలతోనే అర్థమవుతుంది. ఫ్యాక్షనిస్టు లక్షణాలతో పెరిగిన జగన్‌రెడ్డి.. తన అవినీతి పాప పంకిల మకిలి కూటమి ప్రభుత్వానికి ఆపాదించే ప్రయత్నాలు నిరంతరం చేస్తూనే ఉన్నాడు. అందులో భాగమే -కపట పత్రిక సాక్షి రాతలు!!

సుదీర్ఘ రాజకీయానుభవంతో రాష్ట్రాభివృద్ధికి చారిత్రక కార్యక్రమాలు నిర్వహిస్తున్న చంద్రబాబుపై -జగన్ తండ్రి, దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ సైతం ఇదే కక్షధోరణి ప్రదర్శించడం రాష్ట్ర ప్రజలకు తెలీంది కాదు. అటు వైఎస్ హయాంలోనూ.. మొన్నటి జగన్ జామానాలోనూ.. చంద్రబాబుపై పన్నిన కుట్రలు, కుతంత్రాలు, అవినీతి ఆరోపణలు ఏదీ నిలవలేదు. ప్రతిపక్షాలు పన్నిన ప్రతి కుతంత్రాన్నీ చంద్రబాబు నిశ్శబ్దంగా తనదైన ధోరణిలో సమర్థంగా తిప్పికొట్టారు. జగన్ తండ్రి వైఎస్సార్ సీఎంగా ఉన్న కాలంలో చంద్రబాబుమీద 28 కేసులు వేశారు. కానీ, దేన్నీ నిరూపించలేకపోయారు వైఎస్సార్. సచ్ఛీలుడైన చంద్రబాబుపై.. వైఎస్సార్ పెట్టిన కేసులు ఏ ఒక్కటీ నిలవలేదన్న ఇంగితాన్ని విస్మరించిన జగన్.. అధికారంలో ఉన్నంతకాలం చంద్రబాబుపై కక్షసాధింపు ధోరణినే ప్రదర్శించాడు. జగన్ నైజాన్ని అర్థం చేసుకుని ప్రజలు దారుణ పరాభవంతో గద్దె దింపేయడంతో.. ఇప్పుడు చంద్రబాబుపై అబద్ధాలు ప్రచారం చేస్తూ బురదజల్లే కార్యక్రమాలకు దిగజారిపోయారు. తండ్రి అనుభవాల నుంచి ఏమాత్రం పాఠం నేర్చుకోని జగన్.. 'ఆకాశంపైకి రాయి విసిరితే మన ముఖంమీదే పడుతుందన్న' పాఠాన్నీ నేర్వలేకపోవడం అతని సహజ నైజానికి గీటురాయి. అధికారం కోసం బాబాయిపై గొడ్డలి వేటు వేయించి.. పచ్చి అబద్ధాలతో గుండెపోటుగా చిత్రీకరించడం జగన్‌కే చెల్లింది. 'నారసుర రక్త



చరిత్ర" అంటూ సీబీఐ విచారణ కోరిన జగన్, అధికార పీంమెక్కిన మరుక్షణం సీబీఐ విచారణకు వెనక్కి తగ్గాడు. జగన్‌ను మించిన అధికార దాహార్తులు ఇంకెవరూ ఉండరని తనకు తనే నిరూపించుకున్నాడు జగన్.

బురదలో పొర్లిన పంది తనకంటిన బురదను అందరికీ అంటించడానికి తపన పడినట్టు, జగన్‌రెడ్డి తన అవినీతి కేసుల బురదను ఇతరులకు అంటించి తన పరిపాలన మొత్తం కక్ష రాజకీయాలకు వేదిక చేశాడు. ఏపీ స్కిల్ డెవలప్మెంట్ స్కాం, అమరావతి భూకుంభకోణం, ఫైబర్‌గ్రిడ్ అవినీతి, పోలవరం ప్రాజెక్ట్ అవినీతి ఆరోపణలు, సంధ్యా హిల్స్ భూకుంభకోణం, హెరిటేజ్ ఫుడ్స్ కేసు వంటి లెక్కలేని ఆరోపణలతో తనదైన కుట్రల రాజకీయం నడిపించాడు. తన స్వార్థ రాజకీయాలను కొనసాగిస్తూ, ఆధారాలు లేని కేసుతో 53 రోజులపాటు చంద్రబాబును జైల్లో పెట్టి పైశాచిక ఆనందాన్ని అనుభవించాడు జగన్.

జగన్‌రెడ్డి అండ చూసుకుని గత ఐదేళ్లలో పేట్రేగిపోయిన అధికారులు, నాయకులు ఇప్పుడు జైలు జీవితం అనుభవిస్తున్నారు. కొంతమంది బెయిల్ కోసం కోర్టులచుట్టూ తిరుగుతున్నారు. మరికొందరు పరారీలో ఉన్నారు. ఇంకొందరైతే.. అరెస్టుల భయంతో ముందస్తు బెయిల్ కోసం కోర్టులచుట్టూ తిరుగుతున్నారు.

జగన్ అనే మాయగాడు తన స్వార్థ రాజకీయాలు, వ్యక్తిగత ప్రయోజనాలు, అక్రమ సంపాదన, దోచుకున్న ప్రాపర్టీని దాచుకునేందుకు ఏస్థాయి అధికారులను, నాయకులను అయినా వాడుకుంటాడని జగన్‌ను నమ్మిన వారికి ఇప్పుడు అర్థమవుతోంది.

తన తండ్రి ముఖ్యమంత్రి పదవిని అడ్డంపెట్టుకుని అక్రమంగా మైనింగ్ లీజులు, ప్రాజెక్టుల కేటాయింపుల రూపంలో క్విడ్ ప్రోకో చేసి 58 కంపెనీలకు లాభం చేకూర్చి లక్షల కోట్ల సంపదను సొంతం చేసుకున్న నీచ చరిత్ర జగన్‌ది. 13 ఏళ్ల క్రితం.. 2011లో జగన్‌పై తొలి ఎఫ్ఐఆర్ నమోదు చేసింది సీబీఐ. 2012 జనవరి 21న మొదటి చార్జిషీటు దాఖలు చేసింది. అప్పటి నుంచి ఇప్పటివరకు ఈ కేసులపై ఎలాంటి పురోగతీ లేదనడానికి బయట తిరుగుతున్న జగన్ ఓ ఉదాహరణ. 2012-2013 మధ్య సీబీఐ 11 చార్జిషీట్లు, ఈడీ 9 చార్జిషీట్లు దాఖలు చేసింది. ప్రతి కేసులో ఏ1గా జగన్మోహన్ రెడ్డి, ఏ2గా విజయసాయిరెడ్డి ఉన్నారు. మొత్తం 120 మంది నిందితులపై ఛార్జిషీట్లు దాఖలయ్యాయి, ఇంకా 860 మంది సాక్షులను కోర్టు విచారించింది. జగన్మోహన్ రెడ్డి అక్రమాస్తుల వ్యవహారంలో మొత్తం 125 పిటిషన్ల విచారణ ప్రస్తుతం పెండింగ్‌లో ఉంది. ట్రయల్ కోర్టు నుంచి సుప్రీంకోర్టు వరకు దాఖలైన పిటిషన్లలో దాదాపు 80 శాతం పెండింగ్‌లో ఉన్నాయి. 11 కేసుల్లో 86 డిశ్చార్జి పిటిషన్లు దాఖలయ్యాయి, ఏ ఒక్క డిశ్చార్జి పిటిషన్ లోనూ తుది తీర్పు వెలువరించలేదు. ఇండియా "ఎస్కోబార్"గా పేరుగాంచిన జగన్‌రెడ్డి.. మచ్చలేని చంద్రుడుమీద ఆధారాలు లేని కేసులు పెట్టడం దుర్మార్గమైన చర్య.

"చంద్రబాబు వ్యవస్థలను మేనేజ్ చేస్తున్నారు. అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారు. పేరున్న లాయర్లను ఢిల్లీనుంచి రప్పిస్తున్నారు" అంటూ తన అవినీతి సొమ్ముతో నిర్మించుకున్న సాక్షిలో అసత్య ప్రచారం చేసే జగన్మోహన్ రెడ్డికి, తన చెంచా గ్యాంగ్ సీబీఐ జడ్జిని మేనేజ్ చేస్తూ అడ్డంగా దొరికిపోయినది గుర్తులేదా? జగన్‌రెడ్డి ఆజ్ఞ ప్రకారం ఒక ఆడపిల్లను చెప్పుకోలేని విధంగా 40 రోజులు హింసపెట్టిన అధికారులు.. ఇప్పుడు బెయిల్ కోసం కోర్టులు చుట్టూ తిరుగుతున్నది గుర్తులేదా? రాష్ట్రాన్ని నాశనం చేయడానికి కింద కోర్టుకి, హైకోర్టుకు పొన్నవోలు సహా కొంతమంది లాయర్లకు ప్రజా ధనాన్ని దోచిపెట్టింది గుర్తులేదా? మనీలాండరింగ్ వ్యవహారంలో కేంద్ర హోంశాఖ 'సాక్షి' టీవీకి అనుమతులు పునరుద్ధరించకుండా నిలిపివేసింది గుర్తులేదా? గురివింద గింజ తరహాలో జగన్‌రెడ్డి కింద ఇన్ని నీచమైన తప్పులు పెట్టుకుని తన బురద యథావిధిగా ఎదుటివారికి అంటించడానికి అబద్ధాల రచనలు చేస్తున్నాడు. అసత్య ప్రచారాలు ఇదే పంథాలో కొనసాగితే.. సాక్షి పేపర్ టిష్యూ పేపర్‌గా కూడా పనిరాకుండా పోతుందని బల్లగుద్ది మరీ చెప్పొచ్చు!!

## ఇండోర్‌లో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి బృందం పర్యటన

అమరావతి (చైతన్యరథం): స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి నేతృత్వంలోని బృందం మంగళవారం దేశంలోనే క్లీనెస్ట్ సిటీగా పేరుపొందిన మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ నగరంలో పర్యటించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు సారధ్యంలో స్వచ్ఛత విషయంలో దేశంలో అగ్రగామి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను నిలపాలన్న లక్ష్యంతో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ అడుగులు ముందుకి వేస్తోందని ఈ సందర్భంగా పట్టాభి తెలిపారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు దేశంలోని వివిధ నగరాల్లో పరిస్థితులను స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ అధికారులతో కలిసి అధ్యయనం చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా మంగళవారం పరిశుభ్రత విషయంలో దేశంలోనే నంబర్ వన్ స్థానంలో ఉన్న ఇండోర్ నగరాన్ని సందర్శించి అక్కడి పరిస్థితులను అధ్యయనం చేశామని తెలిపారు. ఇండోర్‌లో చేపడుతున్న సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్రక్రియలను తమ కార్పొరేషన్ ఉన్నతాధికారులతో కలిసి పరిశీలించామన్నారు. ఇండోర్ నగర మేయర్ పుష్యమిత్ర భార్గవ్, కమిషనర్ శివమ్ వర్మ స్వయంగా తమ పర్యటనకు అన్ని ఏర్పాట్లు చేసి ఎంతో సహకరించారని కృతజ్ఞతలు తెలిపారు. ఇండోర్ నగరంలో కార్పొరేషన్ సిబ్బంది ప్రతి ఇంటి వద్ద నుండి వేరు చేయబడిన చెత్త సేకరించే కార్యక్రమం, తడి చెత్త నుండి ప్రతి రోజూ వారు ఉత్పత్తి చేస్తున్న దాదాపు 15 టన్నుల బయో గ్యాస్ ప్లాంట్, మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ (ఎంఆర్ఎఫ్), ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్, ఇతర వ్యవస్థలను క్షుణ్ణంగా పరిశీలించామని పట్టాభి తెలిపారు.





# ఆక్వా రైతులందరికీ విద్యుత్ రాయితీ

- చేప పిల్లల పంపిణీకి చర్యలు
- మత్స్యకారుల ఇంధన రాయితీకి నిధుల మంజూరు
- తీర ప్రాంత అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేయండి
- పశుసంవర్ధక శాఖలో ఖాళీల భర్తీకి చర్యలు
- పశువుల ఆసుపత్రుల భవన నిర్మాణాలు, మరమ్మతులకు ప్రతిపాదనలు
- వచ్చే నెలలో మత్స్యకార భరోసా, పశువులు, గొర్రెలకు టీకాలు
- మత్స్య, పశు సంవర్ధక శాఖల సమీక్షలో మంత్రి అచ్చెన్నాయుడు





అమరావతి, (చైతన్యరథం): ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ఎన్డీయే ప్రభుత్వం జోన్లతో సంబంధం లేకుండా ఆక్వా రైతులందరికీ విద్యుత్ రాయితీ అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని వ్యవసాయ, మత్స్య శాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. మంగళవారం అమరావతిలోని సచివాలయంలో ఆయా శాఖల ఉన్నతాధికారులతో మంత్రి అచ్చెన్నాయుడు సమీక్షా సమావేశం నిర్వహించారు. చేప పిల్లల పంపిణీకి తక్షణమే చర్యలు చేపట్టాలని, జనవరి నెలాఖరు లోపు రాష్ట్ర వ్యాప్తంగా ఆయా జిల్లాల్లోని ప్రజా ప్రతినిధులు చేప పిల్లల పంపిణీ పూర్తి చేసేందుకు చర్యలు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని జాయింట్ కలెక్టర్ల ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ వేగవంతం చేయాలని సూచించారు. మత్స్యకారులకు ఇంధన రాయితీలో ఇబ్బందులు తలెత్తడంతో తక్షణమే రూ.6.67 కోట్ల నిధులు మంజూరు చేశారు. ఇకనుంచి ప్రతి ఏటా మత్స్యకారుల బోట్లకు ఇంధన రాయితీకి అవసరమైన నిధులు ముందుగానే మంజూరు చేసేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. మత్స్యకారులకు మరింత మేలు చేకూర్చే విధంగా ఇంధనం ధర లీటరుకు సుమారు రూ.10/- ఆదా చేసేందుకు మెరైన్ ఇంధనం అందుబాటులోకి తెస్తున్నామని, ప్రభుత్వ పరిధిలో ఉన్న 54 ఫిష్ సీడ్ పాండ్స్ అభివృద్ధి చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు.

శ్రీకాకుళం, పశ్చిమ గోదావరి జిల్లాల్లో నిలిచిపోయిన మత్స్య సహకార సంఘాల ఎన్నికలు వెంటనే నిర్వహించాలని మంత్రి ఆదేశించారు. తీర ప్రాంతాల్లో మత్స్యకారులకు ఉపాధి అవకాశాలు మెరుగు పరిచేందుకు కేరళా తరహాలో కేరళ ప్రభుత్వ సహకారంతో తీర ప్రాంతాల్లో మత్స్య సంపద వృద్ధి చేసేందుకు కృషి చేస్తామని మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న తీర ప్రాంతంలో హార్బర్లు, జెట్టీలు, ల్యాండింగ్ సెంటర్ల ఏర్పాటుకు కసరత్తు చేసి ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు.

**పశుసంవర్ధక శాఖ సమీక్ష**

పశు సంవర్ధక శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, రాష్ట్ర వ్యాప్తంగా పశువుల ఆసుపత్రుల భవన నిర్మాణాలు, మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో ఎంబ్రియో ట్రాన్స్ఫర్ టెక్నాలజీ అభివృద్ధి చేసి మేలైన జాతులు, వ్యాధి నిరోధక శక్తి కలిగిన జాతులను వృద్ధి చేసే విధంగా చర్యలు చేపట్టాలని మంత్రి అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. జనవరి నెలలో రాష్ట్రంలో ఉన్న పశువులు, గొర్రెలు, మేకలకు అన్నింటికీ టీకాలు, డీ వార్మింగ్ మందులు అందించాలని, అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఉపాధి హామీ పథకంతో అనుసంధానం అయిన గోకులం పశువుల షెడ్ల నిర్మాణాలు, గడ్డి జాడు పెంపకం మరింత ఎక్కువ మంది లబ్ధిదారులకు అందించేందుకు నివేదిక సిద్ధం చేయాలని, నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ కార్యక్రమంలో మరింత సహకారం అందించే విధంగా బ్యాంకర్లతో చర్చిస్తామని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.

**పశు కిసాన్ క్రెడిట్ కార్డులు :** పశు పోషకులు, కోళ్ల పెంపకం దారులకు రెండు లక్షల వరకు హామీ లేని రుణం అందించి 3శాతం వడ్డీ రాయితీ కల్పిస్తున్నామని పశు పోషకులు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి అచ్చెన్నాయుడు సూచించారు.

ఈ సమావేశంలో పశుసంవర్ధక, మత్స్య శాఖల ముఖ్య కార్యదర్శి ఎమ్ఎమ్ నాయక్, పశు సంవర్ధక శాఖ డైరెక్టర్ దామోదర్ నాయుడు, మత్స్య శాఖ కమిషనర్ డోలా శంకర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# బియ్యం దొంగ పేర్ని నాని



- నీతులు చెప్పే నాని బియ్యం కుంభకోణంలో అడ్డంగా బుక్కయ్యాడు
- రూ.90 లక్షల విలువైన బియ్యం బొక్కేసి కుటుంబం సహా పరార్
- అవినీతి నిజమే... డబ్బులు చెల్లిస్తామని సన్నాయి నొక్కులు
- వైసీపీ పార్టీ దొంగల పార్టీ... నాయకుడు జగన్ రెడ్డి గజదొంగ
- అన్ని స్కాములు బయటకు తీస్తాం... ఎవరిని వదిలేది లేదు
- మీడియా సమావేశంలో నిప్పులు చెరిగిన మంత్రి కొల్లు

అమరావతి (చైతన్యరథం): అధికారం ఉందికదా అని ఇష్టం వచ్చినట్టు వ్యవహరించి, ప్రజలను దోచుకుతిని నీతి కబుర్లు చెప్పే మాజీ మంత్రి పేర్ని నాని బండారం బయట పడిందని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ధ్వజమెత్తారు. బియ్యం కుంభకోణంలో అడ్డంగా బుక్కై పరారీలో ఉన్న పేర్ని నాని కుటుంబ వ్యవహారంపై మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మంగళవారం మీడియాతో మాట్లాడారు. అరాచకాలను చూస్తూ కూటమి ప్రభుత్వం చేతులు ముడుచుకుని కూచోదన్నారు. గతంలో చేసిన అన్ని కుంభకోణాలను బయటకు తీస్తామన్నారు. గత ప్రభుత్వ హయాంలో మీరు చేసిన మీ తప్పిదాలే మిమ్మల్ని నడిరోడ్డుపై బట్టలు ఊడదీసి కూర్చొబెట్టాయని ఎద్దేవా చేశారు. అయిన దానికీ కాని దానికీ తగుదునమ్మా అని వచ్చి నీతి కబురులు చెప్పేందుకు ముందుండే పేర్ని నాని పరిస్థితి తేలు కుట్టిన దొంగ చందంగా మారిందన్నారు. ఇవాళ పేదలకు చెందాల్సిన బియ్యాన్ని నువ్వు బొక్కింది వాస్తవమా కాదా? దాదాపు 3,708 బస్తాలు, 187 టన్నులు, రూ.90 లక్షల విలువైన బియ్యం, లారీలకు లారీలు మీ సొంత గోడౌన్‌కు చేరలేదా.. అక్కడ నుండి పోర్టు ద్వారా రేషన్ కుంభకోణానికి పాల్పడలేదా? ఇది కొంత భాగమే అని అకుంటున్నామన్నారు. నిగ్గు తేలిస్తే ఇంకా చాలా బయటికి వస్తాయన్నారు. ఈ రోజు నీతి కబుర్లు చెప్పే పేర్ని నాని కుటంబం అంతా బందర్ నుంచి పరారయ్యారన్నారు. లెటర్ ఇవ్వడం వెనుక మతలబు తెలియాలన్నారు. బియ్యం మాయం చేసింది నిజమే... కావాలంటే డబ్బులు ఇస్తామని చెప్పడానికేనా అని ప్రశ్నించారు. దొంగతనం చేసి డబ్బులు కడితే దొంగ దొర అవుతాడా...అని పేర్ని నానిని నిలదీశారు. సొంత గోడౌనే కదా అని పేదలకు చెందాల్సిన బియ్యం కొట్టేసి డబ్బులు కడతా అంటే చట్టం ఊరుకోదన్నారు. మీ అవినీతి దాహానికి మీ ఆడవాళ్లను కూడా రోడ్డుపైకి తీసుకొచ్చారు కదయ్యా అని పేర్నిపై మండిపడ్డారు.

నానీకి రాజకీయం చేయడమే వ్యాపారమన్నారు. మీ గోడౌన్లను ఎక్కడి నుంచి తెచ్చి కట్టావని ప్రశ్నించారు. నానీ పేదలను బెదిరించి... వారి భూములు కబ్జా చేశాడన్నారు. పేదల స్థలాల నుంచి లక్షల ట్రక్కుల మట్టి ఎత్తుకొచ్చాడన్నారు. కొన్ని లక్షలు ఖర్చు చేసి అవినీతే పునాదిగా గోడౌన్ కట్టాడన్నారు. అడ్డగోలుగా బియ్యం అమ్ముకొని పేదలను మోసం చేశాడన్నారు. అన్నింటికీ ముందుకొచ్చి సోది చెప్పే నానీ, ఈ బియ్యం నొక్కేసిన అంశంపై ఎందుకు సమాధానం చెప్పడం లేదని ప్రశ్నించారు. గతంలో 40 వేల టన్నులు సీడబ్ల్యూసీ గోడౌన్ ఉంటే... అందులో ఒక్క బియ్యపు గింజ కూడా పెట్టనివ్వలేదన్నారు. గత ఐదేళ్లలో 300 మంది కూలీల పొట్ట కొట్టాడని విమర్శించారు. కడుపు రగిలిన చిలకలపూడి గోడౌన్‌కు చెందిన పేద కార్మికులు నానీ అవినీతి బట్టబయలు కావడంతో స్వీట్లు పంచుతున్నారన్నారు, కరగ్రహారం గోడౌన్‌ను అవినీతి అడ్డాగా మార్చి బండారం బయట పడడంతో పేర్ని కుటుంబం ఊరు వదిలి పరారయిందన్నారు. వైసీపీ పార్టీ ఒక దొంగల పార్టీ అన్నారు. వాళ్ల నాయకుడు జగన్మోహన్ రెడ్డి అందరి కంటే పెద్ద దొంగ అన్నారు. దాదాపు 5 లక్షల టన్నుల రేషన్ బియ్యం మాయమైనట్లు కేంద్ర ప్రభుత్వమే చెబుతోందన్నారు. మీరు బస్సుల్లో, పౌరసరఫరాల్లో చేసిన నిర్వాకం తేలుస్తామన్నారు. అప్పటి పౌర సరఫరాల శాఖ మంత్రి కొడాలి నాని ఫైళ్లు కూడా పేర్ని నానే చూసేవాడన్నారు. ఆ నానీతో కలిసి ఈ నానీ తనకు అనుకూలంగా ఉన్న జిల్లా అధికారిని నియమించుకొని చేసిన స్కాములన్నీ బయటకు తీస్తామని హెచ్చరించారు. కుమారుడితో కలిసి గంజాయి దందా నడిపి యువకుల జీవితాలు నాశనం చేశారన్నారు. చేసిన పాపాలకు కర్మఫలం అనుభవించాల్సిందేనన్నారు.

**మేము జవాబుదారీగా ఉన్నాం**

గత వైసీపీ ప్రభుత్వ హయంలో తమపై అక్రమంగా తప్పుడు కేసులు పెట్టి అరెస్టులు చేశారన్నారు. తాము నిజాయతీగా పనిచేస్తున్నామన్నారు. ప్రజలకు జవాబుదారీగా పరిపాలన చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేలా పనిచేస్తున్నాం. పేదలకు ఇచ్చిన సూపర్ 6 పథకాలు అమలు చేస్తున్నామన్నారు.



తమిళనాడు టూరిజం కార్పొరేషన్‌కు..

# టీటీడీ శీఘ్రదర్శన టికెట్లను పునరుద్ధరించాలి

**- మంత్రి ఆనంను కోరిన తమిళనాడు టూరిజం మంత్రి రాజేంద్రన్**

నెల్లూరు (చైతన్యరథం): తమిళనాడు టూరిజం కార్పొరేషన్‌కు గతంలో మాదిరిగానే తిరుమల శ్రీవారి శీఘ్ర దర్శన టిక్కెట్లను కేటాయించాలని ఆ రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి రాజేంద్రన్.. రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన మంత్రి ఆనంకు లేఖను అందజేశారు. మంగళవారం ఉదయం చెన్నై నుంచి నెల్లూరు మంత్రి క్యాంపు కార్యాలయానికి విచ్చేసిన తమిళనాడు పర్యాటక శాఖ మంత్రి రాజేంద్రన్‌కు మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణ, ఎన్ఎండి ఫరూక్ ఘనస్వాగతం పలికారు. వేదపండితుల వేద ఆశీర్వాచనాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా తమిళ మంత్రి రాజేంద్రన్ మట్లాడుతూ 1974వ సంవత్సరం నుంచి తమిళనాడు టూరిజం డెవలప్‌మెంటు కార్పొరేషన్‌కు టీటీడీ దర్శన టిక్కెట్లను కేటాయిస్తోందని, దీంతో తమిళనాడులోని భక్తులు చాలామంది ఈ అవకాశాన్ని వినియోగించుకుంటూ శ్రీవారిని దర్శించుకుంటున్నారని చెప్పారు.

టీటీడీ కల్పించిన ఈ అవకాశాన్ని తమ ప్రభుత్వం ఎటువంటి ఇబ్బందులు లేకుండా భక్తుల సేవ కోసం వినియోగిస్తున్నట్లు వివరించారు. అయితే ఇటీవల అన్ని టూరిజం కార్పొరేషన్లకు ఈ శీఘ్ర దర్శన టికెట్ల కోటాను టీటీడీ బోర్డు రద్దు చేసిందని, దీనిని వెంటనే పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టాలని మంత్రి ఆనంకు రాజేంద్రన్ విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన మంత్రి ఆనం.. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కావలి, ఉదయగిరి ఎమ్మెల్యేలు దగ్గుమాటి కృష్ణారెడ్డి, కాకర్ల సురేష్, ఆర్డీవో అనూష, తదితరులు ఉన్నారు.

# పొరపాటు జరిగింది.. క్షమించండి

- పార్టీ ప్రమేయం, నా ప్రమేయం లేదు
- గౌడ సంఘీయుల్లో వైసీపీ సానుభూతిపరులు ఉన్నారు
- వారివల్లనే జోగి వచ్చి ఉంటాడు
- ప్రభుత్వ కార్యక్రమాల్లో బిజీగా ఉండడంతో ఆహ్వానపత్రికను పూర్తిగా గమనించలేదు
- చంద్రబాబు, లోకేష్ నాకు చాలా గౌరవం ఇచ్చారు.. దాన్ని నిలబెట్టుకుంటాను
- వైసీపీ తాను నుండి నన్ను నేను చింపుకుని బయటకు వచ్చేశాను
- టీడీపీ కార్యకర్తలు, నాయకుల కోసమే నేను అహర్నిశలు పనిచేస్తున్నాను
- భవిష్యత్తులో ఇలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటాను
- మంత్రి కొలుసు పార్థసారథి సుదీర్ఘ వివరణ



అమరావతి (చైతన్యరథం): బలహీన వర్గాల నాయకుడు, సామాజిక న్యాయం కోసం పోరాడిన వ్యక్తి సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహావిష్కరణ కార్యక్రమంలో టీడీపీ కార్యకర్తలు బాధపడే సంఘటన చోటు చేసుకుందని, దీని విషయంలో పార్టీ కార్యకర్తలు తనను క్షమించాలని కోరుతున్నానని రాష్ట్ర సమాచార, పౌరసంబంధాలు, గృహనిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నూజివీడులో సర్దార్ గౌతు లచ్చన్న కాంస్య విగ్రహావిష్కరణ కార్యక్రమంలో వైసీపీ మాజీ మంత్రి జోగి రమేష్ పాల్గొనడంపై వివిధ పత్రికల్లో రకరకాల కథనాలు వచ్చాయన్నారు. కొన్ని పత్రికల్లో ఉద్దేశపూర్వకంగా, తెలిసి కూడా టీడీపీ నాయకులు జోగి రమేష్ పాల్గొన్న కార్యక్రమంలో పాల్గొన్నారు అనే విమర్శలు చేశారన్నారు.

సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ తనకు ఇచ్చిన గౌరవాన్ని జీవితంలో మర్చిపోలేనన్నారు. తనను ఆదరించిన కార్యకర్తలు మనోభావాలు దెబ్బతిన్నందుకు మరోసారి క్షమాపణ చెప్తున్నానన్నారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు కార్యకర్తలకు తెలియ జేయాలని మీడియా ముందుకు వచ్చానన్నారు. కార్యక్రమాన్ని పార్టీ రహితంగా, టీడీపీ మంత్రిగా, నూజివీడు టీడీపీ అభ్యర్థిగా విగ్రహావిష్కరణకి తన వంతు సహాయ సహకారాలు ఉంటాయని తన అవసరం ఏమున్నా చేస్తానని గౌడ సంఘీయ సోదరులకు చెప్పానన్నారు. ఈ కార్యక్రమానికి ఆహ్వానించే అతిథుల నుంచి కార్యక్రమ ఏర్పాట్ల వరకు టీడీపీకి గానీ, టీడీపీ జాతీయ అధ్యక్షులు, మండల అధ్యక్షులకు గానీ, ఎటువంటి ప్రమేయం లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాన్ని కేవలం గౌడ సంఘానికి సంబంధించిన వారు మాత్రమే నిర్ణయించారన్నారు. ఈ నెల 8,9 తేదీల్లో ఏ రోజున జరపాలో నిర్ణయించేందకు గౌడ సంఘ నాయకులు నా దగ్గరకు వచ్చారన్నారు. 15వ తేదీన జరపాలని సూచించానన్నారు. ఆ తర్వాత నాకు ఇన్విటేషన్ పంపించినా అది పూర్తిగా చదివే సమయం లేక పూర్తిగా గమనించలేదన్నారు. 15వ తేదీన ఐ అండ్ పీఆర్ సమావేశం ఉందని విగ్రహావిష్కరణకి రాలేనని చెప్పానన్నారు. కానీ తప్పకుండా రావాలని కార్యక్రమాన్ని మధ్యాహ్నానికి వాయిదా వేస్తామని నిర్వాహకులు పట్టుబట్టారన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ఐ అండ్ పీఆర్ మీటింగ్ పూర్తిచేసుకుని కార్యక్రమానికి హాజరయ్యానన్నారు. అక్కడ జోగి రమేష్‌ను చూసి షాకయ్యానన్నారు. గౌడ సంఘం కార్యక్రమం కావడం వలయల అలా చేయాలి, ఇలా చేయాలి అని సలహాలు ఇవ్వకూడదని భావించి వాళ్లకు సూచనలు ఇవ్వలేదన్నారు. దానికి కూడా కార్యకర్తలకు క్షమాపణలు చెప్తున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులందరూ కూడా టీడీపీ నాయకులే ఉన్నారన్నారు.

## ఉద్దేశపూర్వకంగా జరిగింది కాదు

తనకు జోగి రమేష్‌కు వ్యక్తిగతంగా బలమైన సంబంధాలు ఏమీ లేవన్నారు. గతంలో తనపై తప్పుడు ఆరోపణలు చేసి తనను ఇబ్బంది పెట్టిన ఘటనలు కూడా చాలా ఉన్నాయన్నారు. ఇది ఉద్దేశ్య పూర్వకంగా జరిగినది కాదని కార్యకర్తలకు మరోసారి చెప్తున్నానన్నారు. అక్కడ జరిగిన ర్యాలీలో కూడా టీడీపీ కోసం కష్టపడిన వారు, తన విజయం కోసం సహకరించిన వారే ఉన్నారన్నారు. అక్కడ ఎలాంటి గొడవ జరిగినా పార్టీకి కార్యకర్తలకు చెడ్డ పేరు వస్తుందేమోనని భావించి తాను ఏమీ మాట్లడలేకపోయానన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ తనను నమ్మి తనకు గౌరవప్రదమైన హోదా ఇచ్చినందుకు తానెప్పుడూ పార్టీ కోసం, కార్యకర్తల మనోబలాన్ని పెంచడం కోసం కార్యకర్తల అవసరాలని తీర్చే విధంగా పోరాటం చేస్తానని చెప్పారు. పత్రికల్లో వచ్చిన అవాస్తవాలను ఎవరూ నమ్మొద్దన్నారు. తాను వైసీపీ తానులో నుంచి తనను తాను చీల్చుకుని టీడీపీలో చేరానన్నారు. తానెక్కడా కూడా పార్టీ సిద్ధాంతాన్ని గానీ, పార్టీ విషయాలను గానీ ప్రజల వద్దకు తీసుకెళ్లే విషయంలో వెనుకంజ వేయనన్నారు. గత రెండు రోజులుగా వచ్చే పత్రికల్లో చూస్తే వైసీపీ వాళ్లను తాను విమర్శించిన వార్తలు కూడా వచ్చాయన్నారు. అలాంటిది తాను వాళ్లకు అనుకూలంగా ఉన్నాననేది అబద్ధమని ఈ సంఘటన ఉద్దేశపూర్వకంగా జరిగినది కాదని మంత్రి పార్థసారథి ఉద్ఘాటించారు.

## గౌరవం నిలబెట్టుకుంటా..

తాను ఎన్నికలకు ఐదారు నెలల ముందు పార్టీలో చేరినా టీడీపీ కార్యకర్తలు తనను నమ్మి, ఆదరించి నూజివీడులో గెలిపించారన్నారు. తన వ్యవహార శైలి, పనితనం గమనిస్తే టీడీపీ కార్యకర్తలను బలోపేతం చేయడానికి, గ్రామాల్లో ఎలాంటి వివక్ష లేకుండా చూసేందుకు ప్రయత్నిస్తున్నానని అర్థమవుతుంద న్నారు. ఇటీవల జరిగిన నీటి సంఘాల ఎన్నికల్లో కూడా వైసీపీ కార్యకర్తలకు నేను సపోర్ట్ చేస్తున్నాననే విమర్శలు వచ్చాయన్నారు. తాను కేవలం నీటి సంఘాల అధ్యక్షుల్లో 50శాతం ఎస్సీ, బీసీలకు వచ్చేలా చూడాలని నియోజకవర్గ నాయకత్వానికి సూచించానన్నారు. తాను ఎవరి పేర్లు సూచించలేదన్నారు. డీసీ ఎన్నికల్లోనూ ఎక్కడా జోక్యం చేసుకోలేదన్నారు. నాయకత్వానికే ఆ బాధ్యతను అప్పజెప్పి, వారికి సహకరిస్తానని చెప్పానన్నారు. తాను వైసీపీ, కాంగ్రెస్‌లో ఉండి వచ్చానన్నారు. ఆ సమయంలో తాను సామాన్యులకు దగ్గరగా ఉండేవాడినన్నారు. ఆ పరిచయాలతో వారిని కూడా టీడీపీలోకి తీసుకొచ్చి పార్టీని బలోపేతం చేయాలని ప్రయత్నం చేస్తున్నానన్నారు. వైసీపీలో ఉన్న కార్యకర్తలు తన వద్దకు వస్తే టీడీపీలో చేరితేనే దగ్గరకు రావాలని చెబుతున్నానన్నారు. రానున్న కాలంలో స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ టీడీపీ జెండా ఎగరేయాలని చూస్తున్నానన్నారు. తాను వైసీపీ తానులో ఉన్నప్పటికీ దాని నుండి తనను తాను ఆ తాను నుండి చింపుకుని వచ్చి చంద్రబాబు, లోకేష్ వద్దకు వచ్చానన్నారు. ఇద్దరూ తనకు చాలా గౌరవం ఇచ్చారన్నారు. దాన్ని నిలబెట్టుకుంటానని స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో టీడీపీ కార్యకర్తల మనోభావాలు దెబ్బతినకుండా చూసేందుకు తగు జాగ్రత్తలు తీసుకుంటానని తెలిపారు.

## పునరావృతం కాకుండా జాగ్రత్తలు..

పార్టీలకు అతీతంగా జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపీ కార్యకర్తల మనోభావాలు దెబ్బతినేలా జరిగిన ఘటనకు చింతిస్తున్నానన్నారు. సర్దార్ గౌతులచ్చన్న కాంస్యవిగ్రహావిష్కరణ కార్యక్రమం తన ఆధ్వర్యంలో లేదా గౌతు శిరీష ఆధ్వర్యంలో చేసి ఉంటే తాము తగు జాగ్రత్తలు తీసుకునేవాళ్లమన్నారు. గౌడ కులానికి చెందిన పెద్దలు ఈ కార్యక్రమం చేయడం, ఆ కార్యక్రమంలో మేము పాల్గొనడం వల్ల తమపై నిందలు వచ్చాయన్నారు. పార్టీ కార్యకర్తల్లో కూడా ఓ చెడు సంకేతం వెళ్లిందన్నారు. తనకు సర్దార్ గౌతు లచ్చన్న కాంస్యవిగ్రహావిష్కరణకు సంబంధించి వచ్చిన ఆహ్వాన పత్రికను తాను పూర్తిగా గమనించకపోవడం వల్ల ఇలాంటి పరిస్థితి ఏర్పడిందన్నారు. జోగి రమేష్‌ను ఎవరు ఆహ్వానించారో కూడా తనకు తెలియదన్నారు. నిర్వాహకులు కూడా జోగి రమేష్‌ను ఆహ్వానించలేదని చెప్పారన్నారు. గౌడ సంఘీయుల్లో వైసీపీ సానుభూతిపరులు ఉండడంతో ఈ పొరపాటు జరిగిందని తాను భావిస్తున్నానన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటానన్నారు.

# రాష్ట్రంలో నాలుగు మోడల్ స్మార్ట్ స్కూల్స్

- మంత్రి నారాయణ వెల్లడి



నెల్లూరు (చైతన్యరథం): రాష్ట్రంలో కార్పొరేటర్ పాఠశాలలకు దీటుగా నాలుగు మోడల్ స్మార్ట్ స్కూల్స్‌ను ప్రారంభిస్తామని, అందుకు రాష్ట్ర విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖల మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. నెల్లూరు నగరంలోని వీఆర్ ఉన్నత పాఠశాలను జాయింట్ కలెక్టర్ కార్తీక్, కమిషనర్ సూర్య తేజలతో కలిసి మంగళవారం మంత్రి నారాయణ పరిశీలించారు. మార్చి 31లోపల వీఆర్ ఉన్నత పాఠశాలను పునః ప్రారంభించి...అన్ని తరగతులు ప్రారంభిస్తామని నారాయణ తెలిపారు. గత ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను పూర్తిగా విస్మరించిందన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ విద్యకు పెద్దపీట వేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# పకడ్బందీగా వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లు

- అధికారులతో టీటీడీ ఈఓ సమీక్ష
- వచ్చే నెల 10 నుంచి 19 వరకు వైకుంఠద్వార దర్శనం
- 23న వైకుంఠద్వార దర్శన శ్రీవాణి టికెట్లు విడుదల
- 24న ఎస్ఈడీ టికెట్లు విడుదల



తిరుమల (చైతన్యరథం): వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని తిరుమల శ్రీవారి ఆలయంలో వచ్చే నెల 10వ తేదీ నుండి 19వ తేదీ వరకు నిర్వహించనున్న వైకుంఠద్వార దర్శన ఏర్పాట్లపై మంగళవారం సాయంత్రం టీటీడీ ఈవో జె శ్యామలరావు అదనపు ఈవో సీహెచ్ వెంకయ్యతో కలిసి తిరుమలలోని అన్నమయ్య భవనంలో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఏర్పాట్లపై అన్ని విభాగాల అధిపతులతో చర్చించారు. ఆ మేరకు పలు నిర్ణయాలు తీసుకున్నారు. 23వ తేదీన ఉదయం 11 గంటలకు వైకుంఠ ద్వార దర్శనాలకు సంబంధించి 10 రోజుల శ్రీవాణి టికెట్లు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. 24వ తేదీన ఉదయం 11 గంటలకు వైకుంఠ ద్వార దర్శనాలకు సంబంధించి 10 రోజుల ఎస్ఈడీ టికెట్లు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు.

వచ్చే నెల 10వ తేదీ నుండి 19వ తేదీ వరకు పది రోజుల వైకుంఠ ద్వార దర్శనాలకు సంబంధించి తిరుపతిలో 8 కేంద్రాలు, తిరుమలలో ఒక కేంద్రంలో ఎస్ఎస్‌డి టోకెన్లు కేటాయిస్తారు. తిరుపతిలో ఎమ్మార్‌పల్లి జీవకోన, రామానాయుడు స్కూల్, రామచంద్ర పుష్కరిణి, ఇందిరా మైదానం, శ్రీనివాసం, విష్ణు నివాసం, భూదేవి కాంప్లెక్స్, తిరుమలలోని కౌస్తుభం విశ్రాంతి భవనంలో టోకెన్ల కేటాయిస్తారు.

## టోకెన్ కేంద్రాల వద్ద వసతులు

టోకెన్ జారీ కేంద్రాలు వద్ద భక్తులకు అవసరమైన సౌకర్యాలను ఏర్పాటు చేయాలని సీఈకి ఆదేశాలు జారీ చేశారు. టోకెన్లు, టికెట్లు ఉన్న భక్తులకు మాత్రమే దర్శనాలకు అనుమతి ఇస్తారు. టోకెన్ లేని భక్తులు తిరుమలకు రావచ్చు. కానీ దర్శన క్యూ లైన్లలోకి అనుమతించరు. వైకుంఠ ఏకాదశి రోజు ఉదయం 4.45 గంటలకు ప్రోటోకాల్ దర్శనాలు ప్రారంభమవుతాయి.

ఆ రోజున అధిక రద్దీని దృష్టిలో పెట్టుకుని ఆలయంలో వేదాశీర్వచనం రద్దు చేశారు. వైకుంఠ ఏకాదశి రోజు ఉదయం 9 నుండి 11 గంటలు వరకు స్వర్ణరథంపై శ్రీవారిని పూరేగిస్తారు. వైకుంఠ ద్వాదశి రోజున ఉదయం 5.30 నుండి 6.30 వరకు శ్రీవారి పుష్కరిణిలో చక్రస్నానం నిర్వహిస్తారు. గోవిందమాల భక్తులకు ఎలాంటి ప్రత్యేక దర్శన సదుపాయం ఉండదు. వైకుంఠ ఏకాదశి రోజున టీటీడీ సెక్యూరిటీ సిబ్బంది సమన్వయంతో తిరుమలలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచనలు జారీ చేశారు. ఉదయం 6 నుండి రాత్రి 12 గంటల వరకు నిరంతరాయంగా అన్న ప్రసాదాలు పంపిణీ చేయాలని కేటరింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. టీ, కాఫీ, పాలు, ఉప్మా, చక్కెర పొంగలి, పొంగలి పంపిణీ చేయాలని నిర్ణయించారు. లడ్డూ ప్రసాదం కోసం భక్తులకు ఇబ్బంది తలెత్తకుండా ప్రతిరోజూ అందుబాటులో మూడున్నర లక్షల లడ్డూలు, అదనంగా మరో మూడున్నర లక్షల లడ్డూలు బఫర్ స్టాక్ ఉంచుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం, సీవీఎస్వో శ్రీధర్ అన్ని విభాగాల విభాగాధిపతులు పాల్గొన్నారు.

# నుడాతో నెల్లూరు సర్వతోముఖాభివృద్ధి

- జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఫరూక్ ఆకాంక్ష
- పండుగ వాతావరణంలో నుడా చైర్మన్‌గా కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి ప్రమాణ స్వీకారం
- పాల్గొన్న మంత్రులు ఆనం, నారాయణ, ఎమ్మెల్యేలు
- కోటంరెడ్డికి ఫోన్‌లో శుభాకాంక్షలు తెలిపిన హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ





నెల్లూరు (చైతన్యరథం): నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (నుడా) ద్వారా చరిత్రలో నిలిచిపోయేలా నెల్లూరు సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసుల రెడ్డికి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర న్యాయ, మైనార్టీ శాఖల మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్ సూచించారు. నుడా చైర్మన్‌గా కోటంరెడ్డి శ్రీనివాసుల రెడ్డి మంగళవారం ప్రమాణ స్వీకారం చేశారు. తొలుత నగరంలోని నర్తకి సెంటర్ నుండి రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, నగర డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, ఆర్టీసీ జోనల్ చైర్మన్ సురేష్ రెడ్డి తోడుగా అశేష అభిమానులు, వేలాది కార్యకర్తలు వెంట రాగా భారీ ర్యాలీగా నుడా కార్యాలయానికి కోటంరెడ్డి చేరుకున్నారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, సర్వేపల్లి, ఉదయగిరి, కావలి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, కాకర్ల సురేష్, దగుమాటి వెంకట కృష్ణారెడ్డి హాజరయ్యారు. అతిథులకు ఘన స్వాగతం పలికిన నెల్లూరు నగర పాలక సంస్థ కమిషనర్, నుడా వీసీ సూర్య తేజ.. నుడా చైర్మన్‌గా కోటంరెడ్డి శ్రీనివాసుల రెడ్డి చేత ప్రమాణ స్వీకారం చేయించారు.

ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన ప్రత్యేక సభలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఫరూక్ మాట్లాడుతూ గతంలో తాను గతంలో మున్సిపల్ వ్యవహారాల శాఖ మంత్రిగా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో హైదరాబాద్ అభివృద్ధిలో భాగస్వామినయ్యానని తెలిపారు. అదేవిధంగా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల ద్వారా రాష్ట్రంలోని నగరాలు, పట్టణాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. అందరి సహకారంతో నెల్లూరు జిల్లా సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలని నుడా చైర్మన్‌కు సూచించారు. కార్యకర్తగా పార్టీ అభివృద్ధికి కష్టపడినందునే పదవి వరించిందన్నారు.

### అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం: మంత్రి ఆనం

రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి మాట్లాడుతూ అన్ని రంగాల్లో నెల్లూరు జిల్లా సమగ్రాభివృద్ధి సాధనే లక్ష్యంగా నుడా పనిచేయాలన్నారు. నుడా పరిధి జిల్లా అంతటా ఉన్నం దున అన్ని నియోజకవర్గాల అభివృద్ధి బాధ్యత నుడా చైర్మన్‌పై ఉందన్నారు. మాస్టర్ ప్లాన్ ప్రకారం నెల్లూరు నగరాన్ని అభివృద్ధి చేసుకోవాలన్నారు. రోజురోజుకీ పెరుగుతున్న పట్టణీకరణకు అనుగుణంగా ప్రజలను అభివృద్ధిలో భాగస్వామ్యం చేయాలన్నారు. అలాగే టిడ్కో ఇళ్ల సముదాయంలో ఆలయాల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

### సంపద సృష్టితోనే అభివృద్ధి: మంత్రి నారాయణ

రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో 123 మున్సిపాలిటీలు, 21 అర్బన్ అథారిటీలు ఉన్నాయన్నారు. పట్టణ జనాభా 34 శాతం వృద్ధితో ఎప్పటికప్పుడు పెరుగుతోందన్నారు. అందుకను గుణంగా రాష్ట్ర ప్రభుత్వం టౌన్ ప్లానింగ్ అనుమతుల్లో ప్రజలకు అనుకూలమైన విధి, విధానాలకు రూపకల్పన చేస్తోందని, త్వరలోనే ఖరారు చేసి విడుదల చేస్తామన్నారు. సంపద సృష్టి ద్వారా మాత్రమే అభివృద్ధి సాధ్యమన్నారు. రాష్ట్రంలోని అన్ని అర్బన్ అథారిటీలకు జాయింట్ కలెక్టర్లను వైస్ చైర్మన్లుగా నియమించామన్నారు. నెల్లూరు నగరానికి అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించి రాష్ట్రంలోనే మోడల్ సిటీగా తీర్చిదిద్దేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు.

### ఔటర్ రింగ్‌రోడ్డు తెప్పించాలి: సోమిరెడ్డి

సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ.. నందమూరి బాలకృష్ణకు కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి అంటే ఎంతో అభిమానం ఉన్నారు. సొంత సోదరుల కంటే ఎక్కువగా కోటంరెడ్డిని బాలకృష్ణ అభిమానిస్తారని వెల్లడించారు. మంత్రి నారాయణ సహకారంతో నెల్లూరుకి ఔటర్ రింగ్ రోడ్డు వచ్చేలా నుడా చైర్మన్ కృషి చేయాలని పిలుపునిచ్చారు. చెట్లను పెంచడంపై దృష్టి పెట్టి పర్యావరణాన్ని కాపాడాలని సూచించారు. అమరావతి అభివృద్ధికి పెడుతున్న వేల కోట్ల రూపాయల్లో కొంత భాగాన్ని నెల్లూరు అభివృద్ధికి కూడా కేటాయించేలా చూడాలంటూ మంత్రి నారాయణని కోరారు.

### అందరి సహకారంతో అభివృద్ధి: నుడా చైర్మన్

నుడా చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ ఐ లవ్ నెల్లూర్ నినాదంతో పరిశుభ్రమైన, సుందరమైన నెల్లూరును తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానన్నారు. అదేవిధంగా జిల్లా మంత్రుల సహాయ, సహకారాలతో నుడా పరిధిలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తామన్నారు. ఈ పదవి కార్యకర్తలు పెట్టిన భిక్ష మాత్రమేనని, ఇందుకు సహకరించిన కూటమి నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీలకతీతంగా నెల్లూరు జిల్లాకు విశేష సేవలు అందించిన మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్ రెడ్డి, మాజీ శాసనసభ్యులు ఆనం వివేకానంద రెడ్డి, మంగమూరి శ్రీధర కృష్ణారెడ్డి, మాగుంట పార్వతమ్మ, అలాగే నాయకులు వెన్నెలకంటి రాఘవయ్య, ఉగ్గాల రాజేశ్వరమ్మ విగ్రహాలను నెల్లూరు నగరంలో ప్రతిష్ఠించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

### కార్యకర్తలకు అండగా పార్టీ: బాలకృష్ణ

కార్యక్రమం చివరలో నుడా చైర్మన్‌కు అగ్ర నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఫోను చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. సీనియర్ మంత్రుల సహకారంతో జిల్లాను మరింత అభివృద్ధి పథంలో నడపాలని శ్రీనివాసులరెడ్డికి సూచించారు. అలాగే కార్యకర్తలకు పార్టీ అన్నివేళలా అండగా ఉంటుందని తెలిపారు. ఈ సంభాషణ అంతా మైకు ద్వారా ప్రజలందరికీ వినిపించడంతో ఒక్కసారిగా అభిమానుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి.

ఈ కార్యక్రమంలో మాజీ కేంద్ర మంత్రి, టీటీడీ బోర్డు సభ్యురాలు పనబాక లక్ష్మి, టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, చేజర్ల వెంకటేశ్వర్ రెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్ చెంచల్ బాబు యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు దివి శివరాం, కొమ్మి లక్ష్మయ్య నాయుడు, పెద్దసంఖ్యలో కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.



## క్రీడాభివృద్ధికి టీటీడీ సహకారం అవసరం

*- టీటీడీ చైర్మన్, ఈఓలను కోరిన శాప్ చైర్మన్ రవినాయుడు*

తిరుపతి (చైతన్యరథం): తిరుపతి వేదికగా క్రీడారంగాన్ని అభివృద్ధి చేసేందుకు టీటీడీ సహకారం అవసరమని ఏపీ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ అనిమిని రవినాయుడు ఆకాంక్షించారు. టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈఓ జె.శ్యామలారావులను శాప్ చైర్మన్ రవినాయుడు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా క్రీడారంగాభివృద్ధికి సంబంధించిన సమస్యలపై వారిరువురికీ రవినాయుడు విన్నవించారు. హాకీ క్రీడకు విశేషాదరణ లభిస్తున్నందున తిరుపతిలోని ఎస్వీ ఆర్ట్స్ కాలేజీలోని హాకీ అకాడమీని పునఃప్రారంభించాలని కోరారు. అలాగే శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్సులో మౌలిక వసతుల కల్పన, మరమ్మతుల నిర్వహణకు టీటీడీ సహకరించాలని కాంక్షించారు.

క్రీడారంగానికి టీటీడీ కూడా సహకరిస్తే తిరుపతి నుంచి అంతర్జాతీయస్థాయి క్రీడాకారులు తయారయ్యే అవకాశం ఉంటుందని వివరించారు. దీనిపై టీటీడీ చైర్మన్, ఈవో కూడా సానుకూలంగా స్పందించారని, టీటీడీ నుంచి పూర్తి సహాయసహకారాలు అందిస్తామని హామీ ఇచ్చినట్లు రవినాయుడు వెల్లడించారు.

## వచ్చే మార్చిలోపు అన్ని పంచాయతీలకు బ్రాడ్ బ్యాండ్ సర్వీసులు

**భారత్ నెట్-2 ప్రాజెక్టు పనులు పూర్తి చేస్తాం - ఏపీ ఫైబర్‌నెట్ ఎండీ దినేష్ కుమార్ వెల్లడి**

విజయవాడ (చైతన్యరథం): వచ్చే మార్చి నెలాఖరులోపు రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీలకు బ్రాడ్ బ్యాండ్ సేవల సదుపాయం కల్పిస్తామని డిజిటల్ భారత్ నిధి అధికారులకు ఏపీ ఫైబర్‌నెట్ ఎండీ కే దినేష్ కుమార్ తెలిపారు. రాష్ట్రంలో డిజిటల్ భారత్ నిధి నిధులతో చేపడుతున్న భారత్‌నెట్-2 ప్రాజెక్టు పనుల ప్రగతి గురించి మంగళవారం విజయవాడలోని బీఎస్ఎన్ఎల్ ప్రధాన కార్యాలయంలో సమీక్ష జరిగింది. ఈ సమావేశంలో ఏపీ ఫైబర్ నెట్ ఎండీ దినేష్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో భారత్ నెట్ ప్రాజెక్టు పనుల పురోగతి గురించి వివరించారు. వచ్చే ఏడాది మార్చి నెలాఖరులోపు ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని గ్రామ పంచాయతీలకు బ్రాడ్ బ్యాండ్ సర్వీసుల సదుపాయం కల్పించాలనేది రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యమని, ఈ మేరకు పనులు వేగవంతంగా చేపడుతున్నామని తెలిపారు. భారత్ నెట్ పథకంలో భాగంగా ఇప్పటికే రాష్ట్రంలో 15 వేల పంచాయతీలకు ఫైబర్ నెట్ ద్వారా బ్రాడ్ బ్యాండ్ కనెక్టివిటీ కల్పించామన్నారు. మార్చి నెలాఖరులోపు మరో 11,254 పంచాయతీలకు బ్రాడ్ బ్యాండ్ కనెక్టివిటీ కల్పిస్తామని తెలిపారు. భారత్‌నెట్-2 పథకం కింద అన్ని పంచాయతీలకు బ్రాడ్ బ్యాండ్ కనెక్టివిటీ కల్పిస్తున్న ఏకైక రాష్ట్రం దేశంలో ఆంధ్రప్రదేశ్ మాత్రమేనని తెలిపారు. డిజిటల్ పంచాయతీల దిశగా రాష్ట్ర ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందని చెప్పారు.





### భారత్ నెట్ అమలు భేష్

డిజిటల్ భారత్ నిధి డిప్యూటీ డైరెక్టర్ జనరల్ సంజయ్ కుమార్ వర్షనే మాట్లాడుతూ ఏపీలో భారత్‌నెట్-2 ప్రాజెక్టు పనులు బాగా జరుగుతున్నాయన్నారు. నిర్దిష్ట లక్ష్యాల మేరకు ప్రాజెక్టు పనులు పూర్తి చేయాలని, దానికి అవసరమైన సహకారం తాము అందజేస్తామన్నారు. ఈ సమావేశంలో డిజిటల్ భారత్ నిధి డైరెక్టర్ హరికృష్ణన్, తదితరులు పాల్గొన్నారు.

## స్కేటర్ రమ్యకు శాప్ చైర్మన్ అభినందన

తిరుపతి (చైతన్యరథం): చదువుతోపాటు క్రీడల్లోనూ తమ పిల్లలను రాణించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు సూచించారు. చిత్తూరుకు చెందిన నేషనల్ స్కేటర్ అద్విక రమ్య తిరుపతిలోని క్యాంపు కార్యాలయంలో శాప్ చైర్మన్ రవినాయుడిని మంగళవారం కలిశారు. ఈనెల 5వ తేదీ నుంచి 15వ తేదీ వరకూ మైసూర్‌లో జరిగిన 62వ నేషనల్ రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్ -2024 పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరుపున ప్రాతినిధ్యం వహించి ప్రథమ స్థానంలో నిలిచినట్లు ఆమె వివరించారు. ఈ సందర్భంగా రమ్యను రవినాయుడు అభినందించడంతోపాటు, శాప్ నుంచి పూర్తి సహాయ,సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.



జోన్ - 1 (శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అరకు)

చైతన్యరథం

## గ్రామ పంచాయతీల సుస్థిరాభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి

● భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సభలు



శృంగవరపుకోట (చైతన్యరథం): రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ గ్రామ సభలు నిర్వహించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు డిసెంబర్ 6 2024 నుండి జనవరి 8 2025 వరకు సమావేశాలు నిర్వహించనున్నట్లు ఎస్.కోట మండలం ధర్మవరం గ్రామంలో నిర్వహించిన గ్రామ రెవిన్యూ సదస్సులో నియోజకవర్గ శాసనసభ్యురాలు కోళ్ల లలిత కుమారి తెలిపారు. గ్రామస్థాయిలో భూమి తగాదాలు, రీ సర్వే అవకతవకలను పరిష్కరించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ప్రతి మండలంలో ఒక గ్రామంలో రోజుకు ఒకసారి సమావేశాలు జరుగుతాయి. చిన్న గ్రామాల్లో ఒక పూట, పెద్ద గ్రామాల్లో రోజంతా ఈ సభలు నిర్వహించబడతాయి. తహాశీల్దార్, రెవెన్యూ ఇన్స్పెక్టర్, గ్రామ, మండల సర్వేయర్ వంటి అధికారులు సమావేశాల్లో పాల్గొంటారు. అవసరమైతే ఇతర శాఖల అధికారులను కూడా పిలుస్తారు. ప్రతి మండలానికి డిప్యూటీ కలెక్టర్ పర్యవేక్షణాధికారిగా వ్యవహరిస్తారన్నారు. గత ప్రభుత్వంలో భూముల ఆక్రమాల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని,ఈ సభల ద్వారా సమస్యలను పరిష్కరించడమే లక్ష్యమని తెలిపారు. ప్రజలు తమ సమస్యల డాక్యుమెంట్లు, దరఖాస్తులు తీసుకురావాలని, రశీదు ఇవ్వబడుతుందని చెప్పారు. 45 రోజుల్లో సమస్యల పరిష్కారం ఉంటుందని స్పష్టం చేశారు. సభల అనంతరం రాష్ట్ర స్థాయిలో పర్యవేక్షణ టీం ఏర్పాటుచేసి సమస్యల పరిష్కారం పరిశీలించి నివేదిక అందజేస్తుందని తెలిపారు. గ్రామ స్థాయిలో ప్రజల సమస్యలు పరిష్కరించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.కోట మండల మండల పార్టీ అధ్యక్షులు జీ.ఎస్ నాయుడు, యూనిట్ ఇంచార్జ్ లగుడు తిరుపతిరావు మరియు కూటమి నాయకులు కార్యకర్తలు,గ్రామ పెద్దలు, ప్రజలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తండాల్లోని రెవెన్యూ సమస్యలను పరిష్కరించండి

● మంత్రి అనగానికి సత్యప్రసాద్‌కు కిడారి శ్రావణ్ వినతి



విశాఖ(చైతన్యరథం): విశాఖపట్నం కలెక్టర్ కార్యాలయంలో రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ హెూంమంత్రి అనిత ఆధ్వర్యంలో జరిగిన ఉమ్మడి మూడు జిల్లాల జిల్లా కలెక్టర్లు ఆర్డీవోలు ఇతర ఉన్నత స్థాయి రెవిన్యూ సదస్సులో మాజీ మంత్రి రాష్ట్ర జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు. గిరిజన ప్రాంతాల్లో ఉన్న రెవిన్యూ సమస్యలను రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్, హెూం మంత్రి అనిత దృష్టికి తీసుకువెళ్లారు. గిరిజన ప్రాంత రెవిన్యూ సమస్యలను పరిష్కరించేలా కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్య పరిష్కారం అవుతుందని, రాష్ట్ర ప్రభుత్వం మంచి కార్యక్రమాన్ని చేపడుతుందన్నారు. ఏళ్ల తరబడి భూ సమస్యతో అనేకమంది బాధపడుతున్నారని రెవిన్యూ సదస్సులు ఒక పరిష్కారం వేదికగా దొరికిందని, రెవిన్యూ సదస్సుల ద్వారా ప్రజల భూ సమస్యలు పరిష్కారం అవుతున్నాయన్నారు. విశాఖపట్నం కలెక్టరేట్లో జరిగిన సదస్సులో మూడు ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు ఉన్నత అధికారులు పాల్గొన్నారు.

## 22ఏ అంక్షలు ఎత్తివేయాలి



గాజువాక రెవెన్యూ సదస్సులో వివిధ సమస్యలు పరిస్కరించాలని కోరుతూ స్టీల్ ప్లాంట్ నిర్వాసితులు వినతులు అందజేశారు. ఎప్పట్నుంచో పెండింగ్లో ఉన్న కొండ ప్రాంత ఇళ్ల పట్టాలు అందజేయాలని.. 22ఏ ఆంక్షలు ఎత్తివేయాలని కోరారు. సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పల్లా అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఆర్ అమల, స్పెషల్ ఆఫీసర్ సైలజ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# గల్ఫ్ బాధితురాలికి మంత్రి సుభాష్ అండ

●వీడియో సందేశం ద్వారా మంత్రికి విన్నవించిన బాధితురాలు

●క్షేమంగా ఇండియా రప్పించిన మంత్రి సుభాష్

●మంత్రి సుభాష్‌కు రుణపడి ఉంటామన్న బాధిత కుటుంబం



రామచంద్రపురం (చైతన్యరథం): 'అయ్యా మంత్రి గారు.. ఏజెంట్లు చెప్పిన మాయ మాటలు నమ్మి మోసపోయాను.. చిన్న ఇంట్లో పని అని చెప్పి.. నాలుగు అంతస్తుల భవనంలో వెట్టి చాకిరీ చేయిస్తూ.. చిత్ర హింసలు పెడుతున్నారు.. కడుపునిండా తిండి కూడా పెట్టట్లేదు.. గుండెలో నొప్పి.. ముక్కు చెవుల ద్వారా రక్తం పడుతుంది.. ఎలాగైనా ఆదుకొని నా కుటుంబంతో చేర్చండి' అంటూ.. వీడియో మెసేజ్ పెట్టిన గంటా దీప్తి అనే మహిళకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ కొండంత అండగా నిలిచారు. గల్ఫ్ లో పని చేస్తున్న ఆ మహిళకు వెట్టిచాకిరి నుంచి విముక్తి కల్పించి ఇండియాకు రప్పించారు. బాధితురాలను తన కుటుంబ సభ్యులకు అప్పగించి మానవత్వం చాటుకున్నారు మంత్రి సుభాష్. ఈ సందర్భంగా గల్ఫ్ బాధితురాలు గంటా దీప్తి, తన భర్త త్రిమూర్తు, కుటుంబ సభ్యులతో మంగళవారం మంత్రి సుభాష్‌ను రామచంద్రపురంలో మర్యాదపూర్వంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మీడియాతో మాట్లాడుతూ... దీప్తి కుటుంబం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉండడం, భర్తకు హృదయ సంబంధిత రోగం, కన్నబిడ్డల అనారోగ్యం కారణంగా పొట్టకూటి కోసం గత అక్టోబర్ నెలలో బెహరాన్ దేశం వెళ్ళింది. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలం అంతర్వేది కరా గ్రామానికి చెందిన గంటా దీప్తి కుటుంబ పోషణ నిమిత్తం కేతా శ్రీనివాస్ అనే ఏజెంట్ ద్వారా పని కోసం బెహరాన్ దేశం వెళ్ళింది. అక్కడ రాజబాబు, హసీనా అనే ఏజెంట్లు ద్వారా ఒక ఇంట్లో పని నిమిత్తం గత అక్టోబర్ 24న వెళ్లగా అక్కడ బారెడు వెట్టి చాకిరీ చేయిస్తూ, తిండి పెట్టకుండా చిత్రహింసలకు గురి చేస్తున్నారని మంత్రి సుభాష్‌కు సెల్ఫీ వీడియో ద్వారా తన గోడు వెల్లబోసుకుంది. దీప్తి వీడియో సందేశాన్ని చూసి చలించిన మంత్రి సుభాష్ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, మరియు ఏపీ నాన్ రెసిడెన్షియల్ తెలుగు సొసైటీ, బెహరన్‌లో ఉన్న శివకుమార్ సహకారంతో సౌదీలోని ఇండియన్ ఎంబసీ అధికారులుతో మాట్లాడి గంటా దీప్తిను అక్కడి నుంచి స్వగ్రామానికి క్షేమంగా తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ... ఏజెంట్ల మాయ మాటలు నమ్మి మోసపోవద్దని ప్రజలకు సూచించారు. ఇటీవల కాలంలో ఏజెంట్ల చేతిలో మోసపోయి కత్తర్, బెహరాన్, దుబాయ్, సౌదీ దేశాలలో చాలామంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు పలు ప్రసారమాధ్యమాల్లో చూస్తున్నామన్నారు. గల్ఫ్ పేరుతో బాధితులను మోసం చేసిన ఏజెంట్లపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంటా దీప్తిను బహరాన్ పంపించిన ఏజెంట్ కేతా శ్రీనివాస్‌పై సఖినేటిపల్లి పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశామని తెలిపారు. వెట్టి చాకిరి నుంచి విముక్తి కలిగించిన మంత్రులు నారా లోకేష్, వాసంశెట్టి సుభాష్‌లకు గల్ఫ్ బాధితురాలు దీప్తి, భర్త త్రిమూర్తు, కేశవపాడు మాజీ సర్పంచ్ మట్టపర్తి దుర్గాప్రసాద్, రాజేష్, ఆమె కుటుంబ సభ్యులు మంత్రి సుభాష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి సుభాష్ తమ కుటుంబానికి చేసిన మేలు ఈ జన్మలో మర్చిపోలేమని తమ ఆనందాన్ని మీడియా ప్రతినిధులతో పంచుకున్నారు.

## యూపీ సీఎం యోగి అదిత్యనాథ్‌ని కలిసిన టీడీపీ ఎంపీలు



విజయనగరం (చైతన్యరథం): ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ని కలిసిన టీడీపీ జాతీయ ఉపాధ్యక్షులు మాధవ నాయుడు, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు. అయోధ్య, వారణాసి పుణ్యక్షేత్రాలలో తెలుగువారికి ఉపయోగపడే తెలుగు సమాచార కేంద్రాల ఏర్పాటు, భక్తుల వసతి, భోజన సౌకర్యాల భవనం కోసం ప్రభుత్వ భూమి కేటాయించాలని, కోరుతూ లఖ్నవూలోని వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు.

రెండు తెలుగు రాష్ట్రాల నుంచి అయోధ్య వారణాసి నగరాలకు వచ్చే భక్తుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోందనీ ఈ భక్తుల కోసం రైల్వే స్టేషన్లు, బస్ స్టేషన్లు, విమానాశ్రయాలు, ప్రధాన ఆలయ ప్రాంతాల్లో తెలుగులో సమాచారం అందించే సమాచార కేంద్రాలను ఏర్పాటు చేయాలనీ అప్పలనాయుడు కోరారు. ఇలాంటి కేంద్రాలు ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు, మరియు భక్తుల కోసం భాషా సమస్యలను పరిష్కరించడానికి ఎంతో ఉపయోగపడతాయనీ వివరించారు.

## గుమ్మడి సంధ్యారాణి ప్రజాదర్బార్‌కి అనుహ్యా స్పందన

సాలూరు (చైతన్యరథం): రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణి నివాసం వద్ద సోమవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌కు అనుహ్య స్పందన లభించింది. నియోజకవర్గంలో సాలూరు, పాచిపెంట, మెంటాడ, మక్కువ, సాలూరు మండలాల వాసులు అనేక సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. వీటిపై మంత్రి స్పందించారు. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, సమస్యలు పరిష్కరించాలని కోరారు. కొన్ని సమస్యలపై అర్జీలు స్వకరించారు. తమకు మళ్లీ ఉద్యోగాలు ఇప్పించేలా చొరవ చూపాలని కోరుతూ పలువురు హెల్త్ అసిస్టెంట్లు మంత్రి సంధ్యారాణికి సోమవారం వినతిపత్రం అందించారు. మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్లుగా గత 20 ఏళ్ల నుంచి విధులు నిర్వహిస్తున్నామన్నారు. కోర్టు ఆదేశాలతో ఈనెల 5న రాష్ట్రంలో 1,200 మంది హెల్త్ అసిస్టెంట్లను తొలగించారని తెలిపారు. వద్దాది సాయిరాం, జి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు. మత్స్యకారుల పరికరాలు భద్రపర్చడానికి, సంఘ కార్యకలాపాలు నిర్వహించడానికి మక్కువలో స్థలం, భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని పోలమాంబ స్వదేశీ మత్స్య పారిశ్రామిక సహకార సంఘ సభ్యులు కోరారు. ఈ మేరకు సోమవారం సాలూరులోని మంత్రి సంధ్యారాణికి వినతిపత్రాన్ని అందించారు.



# చంద్రబాబు గుండెల మీద తన్నేలా జోగి రమేష్ ఉదంతం

- వైసీపీ నేత జోగి రమేష్‌తో టీడీపీ నేతలు వేదిక పంచుకోవడంపై బుద్దా వెంకన్న అసహనం
- అలాంటి వారితో అంటకాగుతుంటే తామెలా పోరాటం చేయాలని సూటి ప్రశ్న
- పార్టీలో నాకు ఎటువంటి పదవులు ఇవ్వకపోయినా విధేయునిగానే ఉంటానని వెల్లడి



విజయవాడ (చైతన్యరథం): ఏలూరు జిల్లా నూజివీడులో దివంగత నేత గౌతు లచ్చన్న విగ్రహావిష్కరణ కార్యక్రమంలో వైసీపీకి చెందిన మాజీ మంత్రి జోగి రమేష్ పాల్గొనడంపై టీడీపీ నేత బుద్దా వెంకన్న స్పందించారు. జోగి రమేష్‌తో టీడీపీ నేతలు వేదిక పంచుకోవడాన్ని బుద్దా తీవ్రంగా తప్పుబట్టారు. అలాంటి వ్యక్తులతో టీడీపీ నేతలు అంటకాగితే తామెలా పోరాటం చేయాలని ప్రశ్నించారు. "నాడు చంద్రబాబు ఇంటిపై దాడికి వెళ్లిన జోగి రమేష్... తాము అడ్డుకున్న సమయంలో జరిగిన వివాదం" వంటి అంశాలతో ఫోటోలను బుద్దా వెంకన్న ప్రదర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ... నూజివీడులో జోగి రమేష్ పాల్గొన్న ఘటన అందరికీ బాధ కలిగించిందన్నారు. చంద్రబాబు ఇంటిపైకి వెళ్లిన వ్యక్తి జోగి రమేష్ అని.. నీచంగా దూషణలు చేసి... చంద్రబాబుకు బాధ కలిగించిన వ్యక్తి జోగి రమేష్ అంటూ మండిపడ్డారు. అటువంటి నాయకుడితో టీడీపీ మంత్రి, నేతలు కలిసి ర్యాలీ చేయడం బాధ కలిగించిందన్నారు. జోగి రమేష్‌తో వేదిక పంచుకున్న ఘటనతో చంద్రబాబు గుండెలు మీద తన్నిన విధంగా ఉందన్నారు.

**జోగి రమేష్ ఉదంతం చూసి ఆశ్చర్యపోయాను**

"మా నాయకులను నేను ఏమీ అనలేను.. కానీ అలా జరగకుండా చూసుకోవాల్సింది. జోగి రమేష్‌ను మేము అడ్డుకుని ఉండకపోతే ఆరోజు చంద్రబాబు ఇంటి గేటును తాకేవాడు. మేము అడ్డుకున్న సమయంలో పోలీసులు మాపై దాడి చేశారు. ఆ గలాటాలో నాకు ఊపిరి అందక కిందపడ్డాను. చనిపోతాను అని అందరూ అనుకున్నారు. ఆ పక్కనే అప్పుడు గద్దె రామ్మోహన్, ఏలూరి సాంబశివరావులు కూడా ఉన్నారు. 23 స్థానాల నుంచి మళ్లీ ఈ విజయం అందుకున్నాం అంటే ఒకే ఒక్క నేత చంద్రబాబు వల్లే సాధ్యం అయ్యింది. మేమంతా ఆయన అడుగు జాడల్లో నడిచి పని చేశాం. చంద్రబాబుపై అభిమానంతో మేము పోరాటాలు చేశాం. నిన్న జోగి రమేష్ ఉదంతం చూసి ఆశ్చర్యపోయాను. చంద్రబాబు, లోకేష్‌లు నాకు పదవులు ఇవ్వకపోయినా ఆ కుటుంబం పట్ల విధేయునిగానే ఉంటాను. నాకు వాళ్లు ఆరాధ్య దైవం... పార్టీ, ప్రజల కోసం పని చేస్తూనే ఉంటాను. చంద్రబాబును అరెస్టు చేసిన సమయంలో సత్యభామ తరహాలో భువనేశ్వరి బయటకి వచ్చారు. ఇంటికే పరిమితం అయిన భువనేశ్వరి, బ్రాహ్మణిలు రాష్ట్రం కోసం ప్రజల్లోకి వచ్చారు. అంటే ఆ కుటుంబం మొత్తం ఎప్పుడూ రాష్ట్రం హితం, ప్రజల శ్రేయస్సు కోసం పని చేస్తూనే ఉంటారు. వారికి ఉడత సాయంగా మా వంతు సహకారం అందిస్తున్నాం" అని చెప్పుకొచ్చారు.

**మీ సమాధానం కావాలి...**

"నిన్న నూజివీడులో జరిగిన ఘటన మాత్రం కరెక్ట్ కాదు. ఎలా జరిగినా... అక్కడ ఉన్న మీరు బాధ్యత వహించాల్సి ఉంది. జోగి రమేష్‌ను చూశాక అయినా వేదిక నుంచో, ర్యాలీ నుంచో దూరంగా వచ్చేసి ఉండాల్సింది. గౌతు లచ్చన్న ఒక కుల నాయకుడు కాదు. నేడు వంగవీటి మోహనరంగాకు లక్షల విగ్రహాలు ఉన్నాయి. అన్ని కులాల వారు ఆరాధించారు కాబట్టే రంగా దేవుడు అయ్యాడు. వాళ్ల అబ్బాయి రాధా కూడా కులాలకు అతీతంగా పని చేస్తున్నారు. గౌతు శిరీష అంటే మాకు కూడా ఎంతో అభిమానం ఉంది. కానీ నిన్న జరిగిన ఘటన కారణంగా క్యాడర్ మొత్తం చాలా బాధ పడింది. పార్థసారథి, కొనకళ్ల నారాయణ, శిరీషలు ముగ్గురూ సౌమ్యులే. కేవలం క్షమాపణ చెబితే సరిపోదు.. క్యాడర్‌కు సమాధానం చెప్పాలి" అని కోరారు.

**వారితో అంట కాగితే మేమెలా పోరాటాలు చేయాలి?**

"బియ్యం దొంగ పేర్ని నాని నా పైనే ఫిర్యాదు చేశారు. నాని, వంశీలను చంపేస్తా అని బుద్దా వెంకన్న బెదిరించాడని చెప్పాడు. జోగి రమేష్ నోటికి వచ్చిన విధంగా బూతులు తిట్టాడు. వారితో టీడీపీ నేతలు అంట కాగితే... మేమెలా పోరాటాలు చేయాలి. దీనిపై పార్టీ అధిష్టానం కూడా స్పందించి మాకు గైడెన్స్ ఇవ్వాలి. ఒక్కోసారి అసలు పార్టీలో ఉండాలా వద్దా అనే భావన కలుగుతుంది. చంద్రబాబును తిడితేనే నేను వాళ్లకు కౌంటర్ ఇచ్చా. కేశినేని నానితో నాకు గొడవ కూడా చంద్రబాబుకు వ్యతిరేకంగా ట్వీట్ పెట్టినందుకే. విజయ సాయి రెడ్డి మొన్న చంద్రబాబును తూలనాడితే మా నేతలు స్పందించలేదు. కొందరు తమలపాకుతో కొట్టినట్లు మాట్లాడి చేతులు దులుపుకున్నారు. చంద్రబాబు కుటుంబంలో ఉన్న నలుగురు నాలుగు దిక్కులుగా మారి ప్రజల కోసం పని చేస్తున్నారు. గత ప్రభుత్వంలో మా మీద ఎన్నో కేసులు పెట్టారు.. ఇప్పటికీ విచారణ సాగుతోంది. మరి ఇప్పుడు పోరాటాలు చేయతూలా వద్దా అనే అనుమానం కలుగుతుంది. జోగి రమేష్‌తో కలిసి వేదిక పంచుకున్న నేతలు, కార్యకర్తకలను శాంతింప చేయాలి. నారా లోకేష్‌ను కలిసి కూడా జరిగిన విషయం వివరించాలి. జోగి రమేష్ వంటి వ్యక్తులను టీడీపీలో అస్సలు చేర్చుకోకూడదు" అని బుద్దా వెంకన్న స్పష్టం చేశారు.

# డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్లు ఏకగ్రీవంగా ఎంపిక

- డీసీ కమిటీ ఛైర్మన్, ఉపాధ్యక్షులను అభినందించిన నాయకులు



మంగళగిరి (చైతన్యరథం): కృష్ణ వెస్టరన్ డివిజన్ తెనాలి, కొలకలూరి హైలెవల్ ఛానల్, గుంటూరు ఛానల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్లుగా సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం జరిగిన కృష్ణ వెస్టరన్ డివిజన్ తెనాలి డిసి ఎన్నికలలో దుగ్గిరాల నీటి సంఘం అధ్యక్షుడిగా ఎంపికైన గొరినేని అనిల్ కుమార్‌ని డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్‌గా సభ్యులు ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా చినపాలెం నీటి సంఘం అధ్యక్షుడిగా ఎంపికైన విసరపు శేషగిరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కొలకలూరి హైలెవల్ ఛానల్ డిసి ఎన్నికలలో నంబూరు నీటి సంఘం అధ్యక్షులు జొన్నాల మురళీకృష్ణరెడ్డిని డిస్ట్రిబ్యూటరీ ఛైర్మన్‌గా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా కె కొండూరు నీటి సంఘం అధ్యక్షులుగా ఎన్నికైనా తాడిబోయిన నాగేశ్వరరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గుంటూరు ఛానల్ -1(ఆత్మకూరు) డిసి ఎన్నికలలో ఉప్పలపాడు నీటి సంఘం అధ్యక్షులు దుద్దుకూరి బుషా బాబును డిస్ట్రిబ్యూటరీ ఛైర్మన్‌గా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా ఆత్మకూరు నీటి సంఘం అధ్యక్షులు సాదు కొండలరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన ఛైర్మన్, ఉపాధ్యక్షులను టీడీపీ నాయకులు అభినందించారు.

# పేర్ని నానిపై చర్యలు తీసుకుంటాం : కొల్లు



మచిలీపట్నం (చైతన్యరథం): మాజీ మంత్రి పేర్ని నాని కుటుంబమంతా పరారీలో ఉందని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. పేదల బియ్యం బొక్కేసి నాని నీతులు చెబుతున్నారని మండిపడ్డారు. వైసీపీ అంటేనే దొంగల పార్టీ అని ఆయన ఎద్దేవా చేశారు. మరోవైపు కాకినాడ పోర్టులోని స్టెల్లా షిప్లో 1,320 టన్నుల పీడీఎస్ బియ్యం ఉన్నాయని కలెక్టర్ షాన్ మోహన్ తెలిపారు. ఈ బియ్యాన్ని షిప్ నుంచి అన్లోడ్ చేయించి సీజ్ చేస్తామన్నారు.

# రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు స్వాగతం పలికిన ఎమ్మెల్యే యార్లగడ్డ



గన్నవరం (చైతన్యరథం): మంగళగిరి ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్) స్నాతకోత్సవంలో పాల్గొనేందుకు వచ్చిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు గన్నవరం విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌తో పాటు గన్నవరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావ్ ఘన స్వాగతం పలికారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం రాష్ట్రపతి గన్నవరం విమానాశ్రయం నుండి రోడ్డుమార్గన మంగళగిరికి బయలుదేరి వెళ్లారు. స్నాతకోత్సవంలో పాల్గొని మంగళవారం సాయంత్రం విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం నుండి భారత వాయుసేన ప్రత్యేక విమానంలో హైదరాబాద్ హకీంపేట ఎయిర్ ఫోర్స్ స్టేషన్ కు బయలుదేరి వెళ్లారు. విమానాశ్రయం వద్ద అధికారులు వీడ్కోలు పలికారు.

# ఘనంగా పెన్షనర్ల దినోత్సవం..




వినుకొండ (చైతన్యరథం): నరసరావుపేట రోడ్డులోని విశ్రాంత ఉద్యోగుల సేవా సంఘం భవనంలో ఆల్ ఇండియా పెన్షనర్ల దినోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ చీఫ్ విప్ మరియు స్థానిక శాసనసభ్యులు జీవి ఆంజనేయులు మరియు మాజీ శాసనసభ్యులు మక్కెన మల్లికార్జునరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా ఆల్ ఇండియా పెన్షనర్ల ఆరాధ్యుడు డి ఎస్. నకరా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. సంఘ ప్రధాన కార్యదర్శి కాళ్ళ కృష్ణమూర్తి సంఘం ద్వారా చేపడుతున్నటువంటి కార్యక్రమములు సభ్యులు చేయవలసిన విధులు తెలియజేసి 2024 సంవత్సరమునకు సంబంధించిన ఆర్థిక నివేదికను ఈ 17వ వార్షిక సమావేశంలో ప్రవేశపెట్టి ఆర్థిక నివేదికను సభలో ఆమోదం చేశారు. అనంతరం 75 సంవత్సరములు నిండిన పెన్షనర్ల దంపతులకు శాలువా మెమెంటో తో ఘనంగా సన్మానించారు. అనంతరం ముఖ్య అతిథులు అయిన ఎమ్మెల్యే జీవి మాట్లాడుతూ... గత ప్రభుత్వంలో తగ్గించబడిన అదనపు పించను మరియు రావలసిన డిఎ వగైరాలు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. 75 సంవత్సరాలు నిండిన కె.వి రాఘవయ్య మరియు సేవా కార్యక్రమాలు చేపడుతున్నటువంటి పీవీ సురేష్ లను శాలువా పూలదండలతో ఘనంగా సన్మానించారు. అనంతరం మక్కెన మల్లికార్జునరావు మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగుల సేవ సంఘు సభ్యులు చక్కగా సేవా కార్యక్రమాలు చేస్తున్నారని అదేవిధంగా మునుముందు మరెన్నో మంచి సేవా కార్యక్రమాలు చేయాలని అన్నారు. ఉప ఖజానాధికారి ఎండి అజీముల్లా మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యలు వారి దృష్టికి తీసుకొని వస్తే వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జి కృష్ణారెడ్డి, కే. కృష్ణమూర్తి, కె.వి. రాఘవయ్య, భువనగిరి సుబ్రహ్మణ్యం, వి గురవయ్య, ఎంవి. సుబ్బయ్య శర్మ సిహెచ్ సుబ్బారావు, డి కొండయ్య, ఎం.వి శర్మ, ఆదినారాయణ, కోటయ్య, దుబ్బల దాసు, ఎం సామ్యూల్, వెంకటేశ్వర్లు ,జి నాగేంద్రుడు, పి సైదావలి, వై వెంకటస్వామి, ఏ అనంత రమేష్, శేషయ్య, తదితరులు పాల్గొన్నారు.

## బాపులపాడు డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్‌గా' ఆళ్ళ' ఏకగ్రీవ ఎన్నిక



గన్నవరం (చైతన్యరథం): కృష్ణాజిల్లా వ్యాప్తంగా మంగళవారం ఉదయం జరిగిన సాగునీటి వినియోగదారుల సంఘాల ద్వితీయ అంచె డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్‌ల ఎన్నిక ప్రక్రియలో భాగంగా బాపులపాడు మండల పరిషత్ కార్యాలయము లో ఈ రోజు ఉదయం నాగార్జునసాగర్ ఎడమ కాలువ బాపులపాడు డిస్ట్రిబ్యూటరీ కమిటీ నెం.13 ఛైర్మన్ ఎన్నిక కు డి.సి పరిధిలోని సాగునీటి వినియోగదారుల సంఘాలతో ప్రత్యేక జనరల్ బాడీ సమావేశం ఎన్నికల అధికారి బి.చిన్నోడు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్‌గా రంగన్నగూడెం సంఘానికి చెందిన ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావును బాపులపాడు డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్‌గా ఏకగ్రీవంగా సభ్యులు ఎన్నుకోగా ఎన్నికల ధృవపత్రాన్ని 'ఆళ్ళ'కు ఎన్నికల అధికారి బి.చిన్నోడు అందచేశారు. ఈ డి.సిలో ఈడులగూడెం సంఘానికి చెందిన గంపా చిన్నపంగిడేశ్వరరావు డి.సి ఉపాధ్యక్షుగా ఎన్నిక అయ్యారు.

# ప్రజల భూ సమస్యలు తీర్చేందుకే రెవెన్యూ సదస్సులు

◆ప్రతి పిర్యాదు పరిష్కరించి బాధితులకు న్యాయం చేస్తాం

◆మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి

టంగుటూరు (చైతన్యరథం) : ప్రజలు ఎదుర్కొంటున్న భూసమస్యలకు శాశ్వతంగా పరిష్కారం చూపడానికి రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులకు శ్రీకారం చుట్టిందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి అన్నారు. టంగుటూరు మండలం వల్లూరు గ్రామంలోమంగళవారం ఏర్పాటుచేసిన రెవెన్యూ సదస్సుకు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి హాజరై ప్రజలనుంచి అర్జీలను స్వీకరించి వారి సమస్యలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మంత్రి డాక్టర్ స్వామి మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించడానికి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులకు శ్రీకారం చుట్టిందని తెలిపారు.ప్రజలనుంచి వస్తున్న వినతుల్లో ఎక్కువ భాగం భూ సమస్యలేనన్నారు.గత ప్రభుత్వ హయాంలో జరిగిన రీసర్వే ప్రక్రియలో పలు లోపాలు చోటు చేసుకున్నాయని,దీనివల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు.రెవెన్యూ సదస్సుల ద్వారా 45 రోజుల్లో భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని,ఇది గొప్ప సదవకాశామని,దీనిని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ను రద్దు చేయడం జరిగిందని,మీ భూమి



మీ దగ్గరే ఉండాలన్న లక్ష్యంతో ప్రతి రెవెన్యూ గ్రామంలో రెవెన్యూ సదస్సులకు శ్రీకారం చుట్టి ప్రభుత్వ యంత్రాంగం మీ దగ్గరకే వచ్చి,మీ భూసమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుచున్నదన్నారు.ఈ రెవెన్యూ సదస్సులకు రెవెన్యూ అధికారులతో పాటు అనుబంధంగా వున్నటువంటి దేవాదాయ,అటవీ,సర్వే ల్యాండ్ రికార్డ్స్ తదితర సంబంధిత శాఖల అధికారులు వచ్చి సమస్యల పరిష్కారానికి కృషి చేయడం జరుగుచున్నదన్నారు.ఈ నెల 6వ తేదీ నుండి జనవరి 8వ తేదీ వరకు ఈ రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు.జిల్లాలో 18,240 ఎకరాలు ఫ్రీ హోల్డ్ చేసి రిజిస్ట్రేషన్ చేసినట్లుగా,అక్రమాలు జరిగినట్లుగా పిర్యాదులు రావడం జరిగిందన్నారు.భూ యజమానులకు భూమిపై హక్కు కల్పించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తున్నదన్నారు.రెవెన్యూ సదస్సులో వచ్చిన ప్రతీ అర్జీకి రసీదును అందజేస్తామన్నారు.చిన్న సమస్యపైన కూడా అర్జీ అందజేయవచ్చునని చెప్పారు.సదస్సులు ముగిసిన 45 రోజుల్లోగా వచ్చిన వినతులను పరిష్కరిస్తామని తెలిపారు.జనవరి మొదటి వారంలో కొండపి,గిద్దలూరు నియోజక వర్గాల్లో జరిగే రెవెన్యూ సదస్సులకు రెవెన్యూ శాఖ మంత్రి,సీసీఎల్ఏ అధికారులు హాజరు కానున్నట్లు మంత్రి ఈ సందర్భంగా తెలిపారు.ప్రజలు ఎదుర్కొంటున్న భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించడానికి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులకు శ్రీకారం చుట్టిందన్నారు.ఈ సదస్సులు గ్రామీణ ప్రజలకు,రైతులకు గొప్ప సదవకాశామని,ఈ సదస్సులను ఆయా గ్రామాల ప్రజలు సద్వినియోగించుకోవాలని మంత్రి కోరారు.అనంతరం మంత్రి స్వామి గ్రామసభ వద్ద ఏర్పాటు చేసిన అర్జీ నమోదు కౌంటర్,రెవెన్యూ రికార్డుల కౌంటర్,రెవెన్యూ శాశ్వత రికార్డుల కౌంటర్లను పరిశీలించారు. అలాగే సచివాలయం రికార్డ్ లను పరిశీలించారు.

కార్యక్రమంలో ఆర్డివో లక్ష్మీ ప్రసన్న,టంగుటూరు తహసీల్దార్ ఆంజనేయులు,టీడీపీ సీనియర్ నాయకులు బెల్లం జయంత్ బాబు,చదలవాడ చంద్రశేఖర్,కామని విజయకుమార్,బొజ్జా శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



## స్మార్ట్ సిటీగా నెల్లూరు

◆మెప్మా అధికారులకు మంత్రి నారాయణ దిశా నిర్దేశం

నెల్లూరు (చైతన్యరథం): నెల్లూరుని స్మార్ట్ సిటీ చేసే విధంగా అన్ని చర్యలు చేపడుతున్నామని...రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. ఈ సందర్భంగా నెల్లూరులోని నారాయణ మెడికల్ కాలేజీలోని ఆయన క్యాంపు కార్యాలయంలో మెప్మా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మెప్మా ఎండీ తేజ్ భరత్, మున్సిపల్ కమిషనర్ సూర్యతేజలు పాల్గొన్నారు. అనంతరం మెప్మా అధికారులకు మంత్రి నారాయణ దిశా నిర్దేశం చేసి...పలు సూచనలు, సలహాలు చేశారు. అధికారులందరూ సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, అధికారులు పాల్గొన్నారు.

## భూ అక్రమాల నివారణకే రెవిన్యూ సదస్సులు

◆మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి స్పష్టీకరణ

సంబేపల్లి (చైతన్యరథం): గతంలో జరిగిన భూ అక్రమాలను నివారించేందుకే రెవిన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుతుందని రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం సంబేపల్లి మండలం శెట్టి పల్లెలో రెవిన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి మండిపల్లి మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో ఎక్కడ జరగని విధంగా మన రాష్ట్రంలో భూ ఆక్రమణలు జరిగాయని వాటిని నివారించేందుకు గ్రామ సభలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇది రైతుల సంక్షేమం కోరే ప్రభుత్వమని రైతుల మెడకు ఉరితాడు బిగించే ల్యాండ్ టైటిల్ ఆక్ట్ ను ప్రభుత్వం ఏర్పడిన రెండు నెలల లోనే రద్దు చేయడం జరిగిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భూ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందని, పేదల భూములు ఆక్రమించుకున్న గుండాలపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

అధికారులు రెవెన్యూ సదస్సులను సీరియస్‌గా తీసుకుని భూ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. రెవెన్యూ సదస్సులలో భూ



సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందనే నమ్మకాన్ని ప్రజలకు కల్పించి సమస్యలు పరిష్కరించాలన్నారు. ఇకనుంచి భూ బాధితులను పదేపదే కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా రెవెన్యూ సదస్సులలో వచ్చే అర్జీలను వీలైనంతవరకు అక్కడికక్కడే పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. రెవిన్యూ సదస్సుల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రాబోయే రోజులలో జిల్లాలో శాశ్వత భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ అధికారులు సిబ్బంది తమ వంతు బాధ్యతగా పనిచేయాలన్నారు. ఈ సందర్భంగా మంత్రి బాధితుల నుంచి ఆర్జీలు స్వీకరించారు.

## రెవిన్యూ సదస్సులను రైతులంతా సద్వినియోగం చేసుకోవాలి

◆గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల సూచన

గిద్దలూరు (చైతన్యరథం): గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవిన్యూ సదస్సులను రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని గిద్దలూరు ఎమ్మెల్యే శ్రీ ముత్తుముల అశోక్ రెడ్డి గారు సూచించారు. మంగళవారం నాడు అర్ధవీడు మండలం, నాగులవరం గ్రామంలో నిర్వహించిన రెవిన్యూ సదస్సులో పాల్గొన్న ఎమ్మెల్యే గారికి గ్రామ నాయకులు, మేళాతాళాలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సభలో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు అత్యధికముగా భూ సమస్యలతో సతమతమవుతున్నారని తెలుసుకున్న సీఎం చంద్రబాబు గారు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ గార్లు రెవిన్యూ సదస్సులను ప్రారంభించటం జరిగిందని గ్రామాల్లో రైతులు ఎదుర్కొనుచున్న భూ సమస్యలను అర్జీ ద్వారా అధికారులకు తెలియచేస్తే నిర్ణిత సమయంలో వాటిని పరిష్కారం చేయటం జరుగుతుందన్నారు. సభ అనంతరం ప్రజలు ఇచ్చిన అర్జీలను స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ నాగార్జున రెడ్డి, మండల అధికారులు, నాయకులు ప్రజలు పాల్గొన్నారు.



## పూతలపట్టు సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు

◆ఎమ్మెల్యే మురళీమోహన్ స్పష్టీకరణ

పూతలపట్టు (చైతన్యరథం): పూతలపట్టు నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశయాలకు అనుగుణంగా పలు ప్రణాళికలు రూపొందిచడానికి ప్రయత్నాలు ముమ్మరంగా కొనసాగిస్తున్నామని పూతలపట్టు శాసనసభ్యులు మురళీమోహన్ వెల్లడించారు. మంగళవారం కాణిపాకంలోని ఎల్.బి. కళ్యాణ మండపంలో జరిగిన పూతలపట్టు నియోజకవర్గ అభివృద్ధి ప్రణాళిక సమీక్షా సమావేశానికి చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పూతలపట్టు శాసనసభ్యులు డాక్టర్ కలికిరి మురళీమోహన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం ఉద్యానశాఖ, ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ శాఖలచే సిగ్మెంట్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, భూమి పాలిమర్ ప్రైవేట్ లిమిటెడ్ వారిచే డ్రిప్, స్ప్రింకర్ల పంపిణీ 22 మంది రైతులకు డ్రిప్, స్ప్రింకర్ల పరికరాల సామగ్రిని పంపిణీ, 27.61 హెక్టార్లకు గానూ రూ. 26.24 లక్షలు వెచ్చించి రూ. 23.61 లక్షలు సబ్సిడీతో లబ్దిదారులకు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ , స్థానిక శాసనసభ్యులు మురళీమోహన్ అందజేశారు. అనంతరం పూతలపట్టు నియోజకవర్గం అభివృద్ధి ప్రణాళికపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పూతలపట్టు శాసనసభ్యులు మురళీమోహన్ మాట్లాడుతూ. 2047 నాటికి ఏపిని అభివృద్ధి చెందిన రాష్ట్రంగా తీర్చిదిద్దాలనే ముఖ్యమంత్రి ఆశయానికి అనుగుణంగా పూతలపట్టు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సహకారంతో జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రతి గ్రామం, ప్రతి మండల స్థాయిలో శాఖల వారిగా అభివృద్ధి ప్రణాళికలు రూపొందించుకోవడం, వాటిని అమలు చేయడం ప్రధాన ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధిలో రైతులు, యువత, గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం కీలకంగా భావిస్తున్నామని తెలిపారు. ప్రతి గ్రామం నుండి అభివృద్ధి అవసరాలను గుర్తించి, తగిన ప్రణాళికలు రూపొందిస్తామని, రాబోయే మూడు నెలల్లో రూపొందించిన అభివృద్ధి ప్రణాళికల అమలు ప్రగతిని



సమీక్షించి, అవసరమైన మార్పులు చేస్తామని తెలిపారు. 2047 నాటికి పూతలపట్టు నియోజకవర్గం అభివృద్ధిలో రాష్ట్రానికి ఒక ఆదర్శంగా నిలవాలని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆశీస్సులతో పూతలపట్టు నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తామన్న నమ్మకాన్ని ఆయన వ్యక్తం చేశారు.

## విశ్రాంత ఉద్యోగులకు అండగా ఉంటా

◆గూడూరు ఎమ్మెల్యే పాశం భరోసా

గూడూరు (చైతన్యరథం): విశ్రాంత ఉద్యోగులకు అండగా ఉంటానని, వారికి ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ అన్నారు. పట్టణంలోని రిటైర్డ్ ఎంప్లాయిస్ భవనంలో మంగళవారం జరిగిన పెన్షనర్ల దినోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని రిటైర్డ్ ఎంప్లాయిస్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలియజేశారు. అనంతరం రిటైర్డ్ ఎంప్లాయిస్‌ను ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో ఏపీ.ఎస్.జి.ఆర్.ఈ.ఏ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ షేక్ మహబూబ్ బాషా, ప్రధాన కార్యదర్శి ఎస్ మోహన్, అసిస్టెంట్ ట్రెజరీ బి శ్రీనివాసులు, ఎస్బిఐ రీజనల్ మేనేజర్ అరుణ్ కుమార్,చీఫ్ మేనేజర్ సురేష్ కుమార్, ఎస్ వి కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.







పెనుకొండ క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖ మంత్రి సవితను కలసిన నూతనంగా ఎన్నికైన సాగునీటి సంఘం అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, పలువురు కూటమి నాయకులు

# పెన్షనర్ల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

**◆ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ స్పష్టీకరణ**



అనంతపురం (చైతన్యరథం): పెన్షనర్లకు ఇచ్చిన ప్రతి హామీని తెలుగుదేశం ప్రభుత్వం అమలు చేస్తుందని అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. అనంతపురంలోని లలిత కళాపరిషత్‌లో మంగళవారం ఏపీ ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే దగ్గుపాటి పెన్షనర్ల పితామహుడు నగారా చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ, నా విజయంలో పెన్షనర్లు, ఉద్యోగులు, ఉపాధ్యాయుల పాత్ర ఎంతో ఉందని కొనియాడారు. మీకు కృతజ్ఞతలు చెప్పే అవకాశం నాకు ఈరోజు వచ్చిందన్నారు. 2016లో 11వ పీఆర్సీ ద్వారా పదవీ విరమణ గ్రాట్యుటీ 12 లక్షలకు పెంచారని తెలిపారు. 2018 నుంచి ఉన్న బకాయిలను విడతలవారీగా విడుదల చేయిస్తామన్నారు. వైసీపీ ప్రభుత్వంలో పెన్షనర్లకు తీవ్ర అన్యాయం జరిగిందని విమర్శించారు. పెన్షన్లు, వేతనాలు సకాలంలో ఇవ్వకుండా వేధింపులకు గురి చేశారని అన్నారు. అందరికీ హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకురావాలని ముఖ్యమంత్రి భావిస్తున్నారని తెలిపారు. తాము ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు.



## లక్ష్మీనరసింహ ఆలయ అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

కదిరి (చైతన్యరథం): కదిరి పట్టణంలోని ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామివారి దేవస్థానం, తిరువీధులు, కోనేరు అభివృద్ధికి చేయవలసిన పనులను కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ పర్యవేక్షించారు. మాజీ శాసనసభ్యులు ఏమ్.ఎస్. పార్థసారథి, ఆలయ ఈవో, అధికారులు, ఆలయ ప్రధాన అర్చకులు, స్థపతి, తదితరులు పాల్గొన్నారు.



# రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

**◆ రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పిలుపు**

రాప్తాడు (చైతన్యరథం): రాష్ట్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో రెవిన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు, ఈ సదస్సులను ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పిలుపునిచ్చారు. రాప్తాడు నియోజకవర్గంలోని బండమీదపల్లి రెవెన్యూ పరిధిలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పాల్గొన్న ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ, దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలు వివాదాల పరిష్కారమే అజెండాగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సదస్సులో ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

# రైతాంగ నీటి సమస్యల పరిష్కారానికి కృషి

**◆కెసి కెనాల్ నీటిపారుదల డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడు ధనిరెడ్డి రామచంద్రారెడ్డి స్పష్టీకరణ**

ప్రొద్దుటూరు (చైతన్యరథం): కేసీ కెనాల్ పరిధిలోని రైతాంగ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని నూతనంగా ఎన్నికైన కెసి కెనాల్ నీటిపారుదల డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడు ధనిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. ఇటీవల సాగునీటి పారుదల శాఖకు జరిగిన ఎన్నికలలో అధ్యక్షులుగా గెలుపొందిన వారి నుండి మంగళవారం కెసి కెనాల్ నీటి పారుదల డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడిగా ధన రెడ్డి రామచంద్రారెడ్డి, ఉపాధ్యక్షులుగా నారపురెడ్డి లక్ష్మినారాయణరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన వీరికి కెసి కెనాల్ నీటిపారుదల శాఖ ఈఈ హరిబాబు స్థానిక అరవిందాశ్రమం వీధిలోని శాఖ కార్యాలయంలో నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న మాజీ జడ్పీటీసీ తోట మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ కెసి కెనాల్ నీటిపారుదల డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్ష ఉపాధ్యక్షులకు అభినందనలు తెలిపి, రైతులకు అందుబాటులో వుండాలని సూచించారు. అనంతరం అధ్యక్షుడు ధనిరెడ్డి రామచంద్రారెడ్డి, ఉపాధ్యక్షులు నారపురెడ్డి లక్ష్మినారాయణరెడ్డి మాట్లాడుతూ తమ ఎన్నికకు అన్నివిధాల సహకారం అందించిన ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డికి, మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, తోటి అధ్యక్షులకు ధన్యవాదాలు తెలిపారు. కెసి కెనాల్ పరిధిలోని ప్రతి ఆయకట్టుకు నీరు అందించేందుకు తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. రైతులు కూడా తగిన సలహాలు ఇవ్వాలని, సమస్యలు తెలిపితే ఎమ్మెల్యేలు, అధికారుల సమన్వయంతో పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. అనంతరం కెసి కెనాల్ నీటిపారుదల శాఖ ఏఈ గురు మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఈ సాగునీటి సంఘం ఎన్నికలు రాజకీయాలకతీతంగా రైతులను భాగస్వాములను చేస్తూ, రైతుల కోసమే జరిగాయని వివరించారు. రైతులు కూడా నేరుగా తమ కార్యాలయానికి వచ్చి తమ సమస్యలు తెలపాలని, లేనిపక్షంలో ఈ అధ్యక్ష, ఉపాధ్యక్షులకు తెలిపితే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి రైతాంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కెసి కెనాల్ నీటిపారుదల శాఖ డిఈ చంద్రశేఖర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ హుసేన్ వల్లీ, రైతులు పాల్గొన్నారు.



# శ్రీశైలం మల్లికార్జున స్వామి ఆలయంలో ఘనంగా విశేష పూజలు

**◆వీరభద్రుడు, బసవన్నకు అభిషేకాలు**

శ్రీశైలం : భ్రమరాంబ మల్లికార్జున క్షేత్రమైన శ్రీశైలం దేవస్థానంలో మంగళవారం విశేష పూజలు నిర్వహించినట్లు ఈవో శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళవారం ఉదయం స్వామివారి ఆలయం వెనుక భాగంలో ఉన్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి షోడశోపచార పూజలు, విశేష అభిషేకాలు నిర్వహించారు. ఈ స్వామిని పూజించడం వల్ల వివాహం జరగని వారికి.. పెళ్లవుతుందని, సంతానం కలుగుతుందని భక్తుల విశ్వాసం. సాయంత్రం సంధ్యా సమయంలో ఆరుబయటనున్న బయలు వీరభద్ర స్వామికి వివిధ రకాల జలాలతో అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ప్రదోషకాలంలో ఆలయంలోని నందిమండపంలో కొలువైన శనగల బసవన్నకు పంచామృత అభిషేకాలు, ఫలోదకాలు, వివిధ రకాల శుద్ధ జలాలతో పాటు మల్లికా గుండంలోని జలాలతో అభిషేకం చేశారు. అనంతరం వృషభ సూక్తం పురుష సూక్తం పఠించి శనగలు నైవేద్యంగా సమర్పించారు. లోక కల్యాణం కోసం దేవస్థానం వారు సర్కారీ సేవగా ప్రతి మంగళవారం విశేష పూజలు జరిపిస్తున్నట్లు ఈవో వివరించారు.





# జాకీర్ హుస్సేన్ మృతి సంగీత అభిమానులకు తీరని లోటు

**◆ టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్ అమీర్‌బాబు నివాళి**

కడప (చైతన్యరథం): ప్రముఖ తబలా విద్వాంసుడు జాకీర్ హుస్సేన్ మరణం సంగీత అభిమానులకు తీరని లోటు అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ అమీర్ బాబు అన్నారు. నగరంలోని ఆయన తన కార్యాలయంలో మంగళవారం జాకీర్ హుస్సేన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాకీర్ హుస్సేన్ తన చిన్ననాటి నుండి తబల నేర్చుకుని 11 సంవత్సరాల వయసులోనే ఎన్నో కచేరీలను నిర్వహించి అందరి మన్ననలను పొందారని అన్నారు. తబలా సంగీత కళాకా రుడు జాకీర్ హుస్సేన్ మరణం సంగీత కళాకారులకు తీరని లోటని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సంగీత అభిమానులు, టీడీపీ నాయకులు అబ్దుల్ రాయల్ కరీముల్లా, నాసర్వలి, బుల్లెట్ నూర్ భాషా, ఏజాస్. ఆదిల్.తోసీఫ్. కరీం తదితరులు పాల్గొన్నారు.

# లోక్‌సభలో జమిలి ఎన్నికల బిల్లులు

## ◆సంయుక్త పార్లమెంటరీ కమిటీ ముందుకు బిల్లులు

న్యూఢిల్లీ: 'ఒకే దేశం, ఒకే ఎన్నిక' బిల్లులను జాయింట్ పార్లమెంట్ కమిటీకి పంపడానికి లోక్‌సభ అనుమతించింది. బిల్లును జేపీసీకి పంపడంపై లోక్‌సభలో ఓటింగ్ నిర్వహించగా అనుకూలంగా 220 ఓట్లు, వ్యతిరేకంగా 149 ఓట్లు వచ్చాయి. దీంతో బిల్లును జేపీసీకి పంపేందుకు లోక్‌సభ ఆమోదం లభించినట్లయింది.

ఇందుకోసం ప్రతిపాదించిన రాజ్యాంగ (128 సవరణ) బిల్లు-2024, కేంద్ర పాలిత ప్రాతాల చట్టాల (సవరణ) బిల్లు-2024ను కేంద్ర మంత్రి అర్జున్ సింగ్ మేఘవాల్ లోక్‌సభలో మంగళవారం ప్రవేశపెట్టారు. ఈ రెండు బిల్లులను సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)కి పంపనున్నారు.

బిల్లులు లోక్‌సభలో ప్రవేశపెట్టడానికి ముందు అధికార ఎంపీలు, విపక్ష ఎంపీల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ, తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు ఈ బిల్లులను వ్యతిరేకించారు. ఏకకాలంలో ఎన్నికలు ప్రజాస్వామ్య మౌలిక వ్యవస్థపై దాడిగా కాంగ్రెస్ ఎంపీ మనీష్ తివారి పేర్కొన్నారు. బిల్లులను ఉపసంహరించుకోవాలని కోరారు. దేశంలో నియంతృత్వానికి బీజేపీ జరుపుతున్న ప్రయత్నంగా సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ ధర్మేంద్ర యాదవ్ అభివర్ణించారు. రాజ్యాంగ పరరక్షణకు చర్చ జరిగి రెండ్రోజులు కూడా కాకుండానే రాజ్యాంగ సవరణ బిల్లును తేవడం రాజ్యాంగ స్ఫూర్తికి చరమగీతం పాడాలనుకోవడం సరికాదన్నారు.



బిల్లులను నిర్ద్వంద్వంగా తమ పార్టీ వ్యతిరేకిస్తోందని పేర్కొన్నారు. ఎన్నికలను సంస్కరించేందుకు కాకుండా ఒక జెంటిల్‌మన్ కోరిక, కలను సాకారం చేసేందుకు ఈ బిల్లులను తెచ్చారని టీఎంసీ ఎంపీ కల్యాణ్ బెనర్జీ తప్పుపట్టారు.

### జమిలి కొత్తదేమీ కాదు: మేఘవాల్

జమిలి ఎన్నికల నిర్వహణ అంశం కొత్తదేమీ కాదని, 1983 నుంచి ఈ తరహా ఎన్నికలు జరపాలనే డిమాండ్ ఉందని న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘవాల్ అన్నారు. ఇది రాజ్యాంగ మౌలిక సర్వరూపానికి కానీ రాష్ట్రాల హక్కులకు కానీ, సమాఖ్య స్ఫూర్తికి కానీ భంగం కాదన్నారు. స్వీడన్, జర్మనీలోనూ జమిలి ఎన్నికలు జరుగుతున్నాయని వివరించారు. ఈ బిల్లులను పరిశీలన, చర్చ కోసం ప్రభుత్వం జేపీసీకి పంపడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. సార్వత్రిక ఎన్నికలతోపాటు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలను ఒకేసారి నిర్వహించాలని ప్రతిపాదించే బిల్లులను మరింత క్షుణ్ణంగా సమీక్షించాలని పలువురు ఎంపీల సిఫార్సు మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. ఆ తర్వాత ఈ బిల్లులను జేపీసీకి పంపడానికి కేంద్ర మంత్రి అర్జున్ సింగ్ మేఘవాల్ ప్రతిపాదించారు. దీనిపై లోక్‌సభలో విపక్షాలు డివిజన్ కోరాయి.

దీంతో డివిజన్‌కు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అనుమతి ఇచ్చారు. అయితే బిల్లులను జేపీసీకి పంపినప్పుడు సమగ్ర చర్చ జరుగుతుందని స్పీకర్ ఓం బిర్లా తెలిపారు. అలాగే బిల్లుపై పార్లమెంట్‌లో చర్చ జరిగినపుడు కూడా మళ్లీ సమగ్ర చర్చ జరుగుతుందని ఆయన వివరించారు.

### జమిలి బిల్లుకు టీడీపీ మద్దతు

లోక్‌సభలో ప్రవేశపెట్టిన జమిలి ఎన్నికల బిల్లుకు తెలుగుదేశం పార్టీ మద్దతు పలికింది. దేశవ్యాప్తంగా నిర్వహించే ఎన్నికల విధానం సరళీకృతం అవుతుందని టీడీపీ పేర్కొన్నది. కేంద్ర కమ్యూనికేషన్స్ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ.. జమిలి ఎన్నికల నిర్వహణ ద్వారా ఖర్చు తగ్గుతుందన్నారు. ఓటర్ల సంఖ్య కూడా పెరుగుతుందన్నారు. దేశవ్యాప్తంగా ఎన్నికల నిర్వహణ ద్వారా సుమారు లక్ష కోట్లు ఖర్చు అవుతుందని, అయితే జమిలి నిర్వహణతో ఆ ఖర్చు తగ్గే అవకాశం ఉందన్నారు. ఏకనాథ్ షిండే వర్గానికి చెందిన శివసేన పార్టీ కూడా బిల్లుకు మద్దతు ఇచ్చింది.

# కొత్త ఏడాదిలో బీజేపీకి కొత్త అధ్యక్షుడు!

## ◆రేసులో బీజేపీ జనరల్ సెక్రటరీ వినోద్ తావ్డే, ఓబీసీ మోర్చా చీఫ్ కె లక్ష్మణ్



న్యూఢిల్లీ: కొత్త ఏడాదిలో భారతీయ జనతా పార్టీ నూతన జాతీయ అధ్యక్షుడిని ఎన్నుకోనున్నట్లు తెలిసింది. ఈ మేరకు ఇప్పటికే అధ్యక్షుడి ఎన్నిక ప్రక్రియను మొదలుపెట్టినట్లు సంబంధిత వర్గాలు తాజాగా వెల్లడించాయి. ఈ ఎంపిక ప్రక్రియ వచ్చే ఏడాది ఫిబ్రవరికల్లా పూర్తవుతుందని పేర్కొన్నాయి.

పార్టీ రాజ్యాంగం ప్రకారం.. జాతీయ అధ్యక్షుడిని ఎన్నుకునే ప్రక్రియను ప్రారంభించే ముందు కనీసం సగం రాష్ట్ర యూనిట్లలో సంస్థాగత ఎన్నికలు పూర్తిచేయాల్సి ఉంటుంది. ఇందులో భాగంగానే ప్రస్తుతం జరుగుతున్న సంస్థాగత ఎన్నికలు సజావుగా సాగుతున్నాయని పార్టీ వర్గాలు తెలిపాయి. సగానికి పైగా రాష్ట్ర యూనిట్లలో పోలింగ్ ప్రక్రియ జనవరి మధ్య నాటికి పూర్తయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఫిబ్రవరి చివరికి జేపీ నడ్డా స్థానంలో కొత్త అధ్యక్షుడు బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉందని ఆ పార్టీ వర్గాలు వెల్లడించాయి.

కాగా, ప్రస్తుతం బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా జేపీ నడ్డా ఉన్న విషయం తెలిసిందే. 2020లో ఆయన బీజేపీ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించారు. ఇక ఇటీవలే కేంద్రంలో ఎన్డీయే కూటమి మళ్లీ అధికారంలోకి వచ్చిన తర్వాత నడ్డాను కేంద్ర మంత్రి వర్గంలోకి తీసుకున్నారు. ప్రస్తుతం ఆయన పార్టీ జాతీయ అధ్యక్షుడితో పాటు కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రిగానూ వ్యవహరిస్తున్నారు. ఇక పార్టీ చీఫ్ పదవీకాలం మూడు సంవత్సరాలే. దీంతో ఇటీవలే ఆయన పదవీకాలం ముగిసింది. అయితే, 2024 లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని నడ్డా పదవీకాలాన్ని పొడిగించారు.

### బీజేపీ కొత్త అధ్యక్షుడు ఎవరు?

మరోవైపు తదుపరి పార్టీ అధ్యక్షుడు ఎవరన్న దానిపై జోరుగా చర్చ నడుస్తున్నది. కేంద్ర మంత్రులుగా పనిచేస్తున్న వారిలోనే ఒకరికి జాతీయాధ్యక్షుడి బాధ్యతలు అప్పగిస్తారా..? లేక కొత్త వారిని తీసుకుంటారా..? అనే విషయంపై తీవ్రంగా చర్చ జరుగుతోంది. ఇదే సమయంలో రేసులో పలువురి పేర్లు కూడా వినిపిస్తున్నాయి. మహారాష్ట్ర మాజీ మంత్రి, బీజేపీ జనరల్ సెక్రటరీ వినోద్ తావ్డే పేరు రేసులో ప్రధానంగా వినిపిస్తున్నది. బీఎల్ సంతోష్ తర్వాత పార్టీ జనరల్ సెక్రటరీల్లో అత్యంత ప్రభావవంతమైన నేతగా తావ్డేకు పేరున్నది. అలాగే తెలంగాణకు చెందిన కె లక్ష్మణ్ కూడా రేసులో ఉన్నారు. ప్రస్తుతం ఆయన పార్టీ ఓబీసీ మోర్చా చీఫ్‌గా వ్యవహరిస్తున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేసిన అనుభవం ఆయనకు ఉంది. రేసులో సునీల్ బన్సల్ పేరు కూడా వినిపిస్తోంది. ఆయన తెలంగాణ, బెంగాల్, ఒడిశా రాష్ట్రాల ఇన్‌చార్జిగా ఉన్నారు. ఎంపీ ఓం మాథుర్ కూడా అధ్యక్ష రేసులో ఉన్నారు. మరోవైపు, పార్టీ తొలి మహిళా అధ్యక్షురాలిగా కేంద్ర మాజీ మంత్రి స్మృతి ఇరానీ నియమితులయ్యే అవకాశమున్నట్టు వార్తలు వస్తున్నాయి.



# ఆనందంలోనే నిస్వార్థంగా సేవ చేస్తాం

## ◆ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ స్పష్టీకరణ

పుణె: ప్రతిఒక్కరు ఇగోను పక్కన పెట్టాలని లేకపోతే అగాధంలో పడిపోతారని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ హితవు పలికారు. శాశ్వతమైన ఆనందాన్ని గుర్తించినప్పుడే నిస్వార్థమైన సేవ చేస్తారని, అదే ఇతరులకు సహాయపడే ధోరణిని పెంచుతుందని అన్నారు. మహారాష్ట్రలో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. సమాజంలో ప్రతిదీ తప్పుగా జరుగుతోందనే అభిప్రాయం కూడా పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.

"సమాజంలో ఒక ప్రతికూల అంశం జరిగితే దానికి 40 రెట్లు మంచి కార్యక్రమాలు జరుగుతున్నాయి. సానుకూల అంశాల గురించి అవగాహన కల్పించడం అవసరం. సేవ అనేది సమాజంలో శాశ్వతమైన నమ్మకాన్ని పెంచుతుంది. రామకృష్ణ పరమహంస అభిప్రాయం ప్రకారం.. మనలో రెండు 'నేను'లు ఉంటాయి. ఒకటి ముడిపదార్థం కాగా, మరొకటి పరిపక్వత చెందినది.. పరిపక్వతతో కాకుండా ముడిపదార్థం (ఇగోతో ఉంటే)గానే ఉంటామంటే అగాధంలో పడిపోతాం" అని అన్నారు. అలాగే అన్ని వర్గాల సాధికారతే దేశం అభివృద్ధిని నిర్ధారిస్తుందని తెలిపారు. దేశ పురోగతికి దోహదపడేలా యువతను తీర్చిదిద్దాలని సూచించారు.

గతంలో కూడా భగవత్ ఈ తరహా వ్యాఖ్యలు చేశారు. "దేవుళ్లమని మనకు మనం స్వయంగా ప్రకటించుకోకూడదని.. ఆ విషయాన్ని ప్రజలే నిర్ణయిస్తారు. కొంతమంది మెరుపులా మెరవాలని కోరుకుంటారు. కానీ, పిడుగు పడిన తర్వాత మరింత చీకటిగా మారుతుందని వారు గుర్తించరు" అని నేతలను ఉద్దేశించి అన్నారు.

# రిక్రూట్‌మెంట్ పరీక్షలను ఇక ఎన్‌టిఏ నిర్వహించదు

## ◆కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ స్పష్టీకరణ

న్యూఢిల్లీ: రిక్రూట్‌మెంట్, ప్రవేశ పరీక్షల నిర్వహణ వంటి అంశాల్లో కేంద్రం ఏర్పాటుచేసిన ఉన్నత స్థాయి ప్యానెల్ దృష్టి సారించింది. దీంతో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఏ) బాధ్యతల్లో మార్పులు చోటుచేసుకున్నాయి. ఇకపై రిక్రూట్మెంట్ పరీక్షలను ఆ సంస్థ నిర్వహించదు. ఈ విషయాన్ని కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ వెల్లడించారు.

"ఉన్నత స్థాయి ప్యానెల్ సిఫార్సు చేసిన సంస్కరణల్లో భాగంగా ఈ మార్పులు చేశాం. ఇకపై రిక్రూట్మెంట్ పరీక్షలను ఎన్టీఏ నిర్వహించదు. కేవలం ప్రవేశ పరీక్షలు మాత్రమే నిర్వహిస్తుంది. ఇది 2025 నుంచి అమలు కానుంది. ఎన్టీఏను ప్రక్షాళన చేస్తాం. వచ్చే ఏడాది దీనిలో మరిన్ని మార్పులు రానున్నాయి. కొత్తగా పది పోస్టులు సృష్టిస్తాం. జీరో- ఎర్రర్ టెస్టింగ్ ఉండేలా ఎన్టీఏ పనితీరులో మార్పులు ఉంటాయి" అని కేంద్రమంత్రి స్పష్టం చేశారు. "కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ ఏడాదికి ఒక్కసారి మాత్రమే నిర్వహించనున్నాం. అంతేకాకుండా.. నీట్ యూజీ పరీక్షలు పెన్-పేపర్ విధానంలో నిర్వహించాలా..? లేదా ఆన్‌లైన్‌లో చేపట్టాలా అనే విషయంపై ఆరోగ్య మంత్రిత్వశాఖతో చర్చలు జరుగుతున్నాయి. అయితే.. భవిష్యత్తులో అన్ని ప్రవేశ పరీక్షలు కంప్యూటర్ ఆధారితంగా నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది" అని తెలిపారు.



ఇదిలావుండగా నీట్ ప్రవేశపరీక్ష పత్రం లీక్, ఇతర పరీక్ష నిర్వహణల్లో అవకతవకలు చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. దీంతో కేంద్రం ఆదేశాలతో విద్యాశాఖ ఉన్నతస్థాయి ప్యానెల్ సంస్కరణలకు ఉపక్రమించింది. ప్రవేశ పరీక్ష, రిక్రూట్మెంట్ పరీక్ష నిర్వహణల్లో సంస్కరణలు చేసింది. ఈ సిఫార్సుల ప్రకారం తాజాగా ఈ మార్పులు చోటుచేసుకున్నాయి.

# త్వరలో ఢిల్లీ ఎన్నికల తేదీల ప్రకటన?

## ◆ సన్నాహక సమావేశానికి ఈసీ పిలుపు

న్యూఢిల్లీ: వచ్చే ఏడాది ఆరంభంలో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం సమాయత్తమవుతోంది. ఇందులో భాగంగా ఢిల్లీ ఎన్నికలపై సన్నాహక సమావేశానికి పిలుపునిచ్చింది. ఈ వారంలోనే ఎన్నికల నిర్వహణపై అధికారులతో భేటీ కానున్నట్లు తెలిసింది. సమావేశం అయిన వెంటనే ఎన్నికల తేదీలను ప్రకటించనున్నట్లు సంబంధిత వర్గాలు తాజాగా వెల్లడించాయి.

ఇక ఈ ఎన్నికల కోసం అధికార ఆప్ తన అభ్యర్థులను ప్రకటించిన విషయం తెలిసిందే. ఢిల్లీ అసెంబ్లీలోని మొత్తం 70 స్థానాలకు అభ్యర్థులను ఆప్ ఖరారు చేసింది. ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ న్యూఢిల్లీ స్థానం నుంచి పోటీ చేస్తుండగా ముఖ్యమంత్రి అతిశీ గతంలో పోటీ చేసిన కల్కాజీ స్థానం నుంచే పోటీ చేస్తున్నారు. తమ పార్టీ పూర్తి విశ్వాసంతో, పూర్తి సన్నద్ధతతో ఎన్నికల్లో పోటీ చేస్తోందని కేజ్రీవాల్ తెలిపారు.